

తెలుగు దినపత్రిక

సాక్షర

చదువు..సమీక్షించు

RNI NO.APTEL/2011/42149



ఆదిలాబాద్ | సంపుటి : 16 సంచిక : 280 శుక్రవారం, నవంబర్ 13, 2026 ఎడిటర్: ఎ. లింగన్న | పేజీలు : 10 రూ. 2.00

కేసీఆర్ స్థానంలో కేటీఆర్.. రేవంత్ గురి ఎటు?

(హైదరాబాద్, సాక్షర): తెలంగాణ రాజకీయ రంగంలో అధికార కాంగ్రెస్, ప్రధాన విపక్ష బిఆర్ఎస్ ల మధ్య మాటల యుద్ధం రోజురోజుకు మరింత పదునెక్కుతోంది. ముఖ్యంగా ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి, బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ మధ్య సాగుతున్న ప్రత్యక్ష వైరం ఇప్పుడు పరాకాష్టకు చేరింది. విధానాలు, పరిపాలనా లోపాల ఆధారంగా విమర్శలు చేసుకోవాల్సింది పోయి.. వ్యక్తిగత రూపం, గెటప్‌లు, హెయిర్ ట్రాన్స్‌ప్లాంటేషన్, గడ్డం పెంచడం వంటి అంశాల దాకా విమర్శలు వెళ్లడం తెలంగాణ రాజకీయాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది.ఇటీవలి సభల్లో సీఎం రేవంత్ రెడ్డి.. గడ్డం పెంచినంత మాత్రాన ఎవరూ రేవంత్ రెడ్డి కా లేరు అని సెటైర్లు వేయడం, గతంలో కేటీఆర్ లుక్‌పై చేసిన వ్యాఖ్యలు కాంగ్రెస్-బీఆర్ఎస్ శ్రేణుల మధ్య పగను మరింత పెంచాయి. అయితే, ఒక రాష్ట్ర ముఖ్యమంత్రి స్థానంలో ఉన్న నేత, ప్రతిపక్షంలో ఉన్న ఒక నాయకుడి వ్యక్తిగత ఇమేజ్‌పై ఇంతలా దృష్టి సారించి దాడి చేయడం వెనుక బలమైన రాజకీయ లెక్కలు ఉన్నాయని విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ వ్యూహంలో మొదటి ప్రధాన కోణం —



ప్రత్యర్థి గుర్తింపు. బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ ప్రత్యక్ష రాజకీయాల్లో, మీడియా ముందుకు రావడం గణనీయంగా తగ్గించారు. అసెంబ్లీలో లేదా ప్రజాక్షేత్రంలో బిఆర్ఎస్ తరఫున కేటీఆర్, హరీష్ రావులే ప్రధానంగా గళం విప్పుతున్నారు. ఈ క్రమంలో కేసీఆర్ స్థానంలో బీఆర్ఎస్ ప్రధాన ముఖంగా కేటీఆర్‌ను రేవంత్ రెడ్డి స్వయంగా గుర్తించినట్లేనని పొలిటికల్ పండితులు అంచనా వేస్తున్నారు. కేటీఆర్‌నే తన ముఖాముఖి ప్రత్యర్థిగా ఎంచుకోవడం ద్వారా, ఇతర నాయకులను పక్కకు నెట్టి పోరును రేవంత్ వర్సెస్ కేటీఆర్ గా మలచడం కాంగ్రెస్ వ్యూహంలో భాగం.ప్రతిపక్ష నేతగా కేటీఆర్ లేవనెత్తే అడ్మినిస్ట్రేటివ్ వైఫల్యాల నుంచి ప్రజల దృష్టిని మళ్లించడానికి వ్యక్తిగత విమర్శలు ఒక అస్త్రంగా పనిచేస్తాయి. కేటీఆర్ ఇమేజ్, ఆయన బాడీ లాంగ్వేజ్‌ను టార్గెట్ చేయడం ద్వారా ఆయన ప్రతిష్టను దెబ్బతీయడం, డిఫెన్స్‌లోకి నెట్టడం మరియు మానసికంగా ఆయన విశ్వాసాన్ని దెబ్బతీయడమే లక్ష్యంగా ఈ పర్సనల్ ఎటాక్స్ సాగుతున్నాయనే అభిప్రాయం ఉంది. మిగతా 2 లో

కవిత పార్టీ సత్తా చాటుతుందా



(వరంగల్, సాక్షర): తెలంగాణ రక్షణ సేన ఏర్పాటు తర్వాత తొలిసారి ఎన్నికల బరిలోకి దిగుతున్న కల్వకుంట్ల కవిత.. రెండు గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానాలకు శ్రీకాంత్ గౌడ్, ఆకాశ్ కొల్లూరును అభ్యర్థులుగా ప్రకటించారు. బీసీ వర్గానికి చెందిన విద్యార్థి నాయకులకు అవకాశం ఇచ్చినట్లు తెలిపారు. 75 నియోజకవర్గాల్లో ప్రచారం నిర్వహిస్తున్నారు. తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) పార్టీని స్థాపించిన తర్వాత మాజీ సీఎం కేసీఆర్ తనయ.. కల్వకుంట్ల కవిత తొలిసారిగా ఎన్నికల బరిలోకి దిగుతున్నారు. రాష్ట్రంలో జరగనున్న రెండు గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల కోసం ఆమె తన పార్టీ తరఫున అభ్యర్థులను ప్రకటించి, ప్రచారాన్ని ముమ్మరం చేశారు. సామాజిక న్యాయమే లక్ష్యంగా బీసీ సామాజిక వర్గానికి చెందిన శ్రీకాంత్ గౌడ్, ఆకాశ్ కొల్లూరులను కవిత ఎమ్మెల్సీ అభ్యర్థులుగా బరిలోకి దించారు. ఏ మాత్రం రాజకీయ నేపథ్యం లేని, చదువుకున్న విద్యార్థి నాయకులకు (కాకతీయ, ఉస్మానియా విశ్వవిద్యాలయాల విద్యార్థులు) టికెట్లు ఇచ్చామని కవిత చెబుతున్నారు. అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్, బీజేపీ పార్టీలకు ఈ ఎన్నికల్లో పట్టభద్రులు బుద్ధి చెప్పాలని కవిత పిలుపునిచ్చారు. ఈ పార్టీలు ప్రజలను వేధిస్తున్నాయని.. ప్రజలకు ప్రత్యామ్నాయం ఎవరైనా ఉంటే అది తామేనని ఆమె చెప్పడం గమనార్హం. రాష్ట్రంలో సుమారు 80 లక్షల మంది పట్టభద్రులు ఉన్నప్పటికీ ఓటు నమోదు తక్కువగా ఉందని, గ్రాడ్యుయేట్లు తప్పనిసరిగా ఓటు హక్కు వినియోగించుకోవాలని కవిత కోరారు. హైదరాబాద్‌లోని బంజారాహిల్స్‌లో టీఆర్ ఎస్ పార్టీ కార్యాలయం వద్ద బుధవారం ప్రచార వాహనాలను ప్రారంభించిన కవిత, సింగరేణి ప్రాంతంతో పాటు నల్గొండ, ఆదిలాబాద్, మెదక్ తదితర 75 నియోజకవర్గాల పరిధిలో విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తున్నారు. 3 లో

జనవరి నుంచి పల్లె యాత్రకు సిద్ధం



(హైదరాబాద్, సాక్షర): తెలంగాణ రాజకీయాల్లో ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి సరికొత్త పరిపాలనా వ్యూహాలకు, పొలిటికల్ నెరేటివ్‌కు తెరలేపారు. రాబోయే సంక్రాంతి పండుగ ముగిసిన వెంటనే రాష్ట్రంలోని ప్రతి పల్లెనూ స్వయంగా సందర్శించేలా ప్రజాబలం పేరుతో ఒక భారీ మాస్ కనెక్ట్ కార్యక్రమాన్ని ఆయన సిద్ధం చేసుకున్నారు. కేవలం సచివాలయంలోని ఏసీ గదులు, రివ్యూ మీటింగ్‌ల అధికార దర్పానికి పరిమితం కాకుండా, నేరుగా అట్టడుగు వర్గాల వద్దకు వెళ్లే 'మాస్ లీడర్'గా తన స్థానాన్ని సుస్థిరం చేసుకోవడం మరియు కాంగ్రెస్ పాలనపై ప్రజల్లో చెక్కుచెదరని విశ్వసనీయతను పెంచడం ఈ పల్లెబాట ప్రధాన లక్ష్యంగా కనిపిస్తోంది.రేవంత రెడ్డి ప్లాన్ చేసుకున్న ఈ వ్యూహంలో రెండు స్పష్టమైన పొలిటికల్ యాంగిల్స్ ఉన్నాయి. మొదటిది క్షేత్రస్థాయికి వెళ్లి ప్రజా అవసరాలను నేరుగా తెలుసుకోవడం మరియు ఎల్‌నినో ప్రభావంతో తలెత్తిన తాగు, సాగునీటి పర్యవేక్షణపై చర్యలు తీసుకోవడం ద్వారా సమ్మేళన సంక్షేమ ముద్రను సాధించడం. ఇక రెండవది, అత్యంత కీలకమైనదిశాసనసభ వేదికగా కాళేశ్వరం ప్రాజెక్టు వైఫల్యాలు, మేడిగడ్డ బ్యారేజీ డిజైన్ లోపాలను ఆధారాలతో సహా ఎండగట్టడం ద్వారా కేసీఆర్ నిర్మించుకున్న 'నీటిపారుదల రథసారథి' బ్రాండ్ ఇమేజ్‌ను శాశ్వతంగా బద్దలు కొట్టడం. కేసీఆర్ బ్రాండ్‌ను దెబ్బతీసేందుకు ప్రత్యేక అసెంబ్లీ సమావేశాల వేదికను సిద్ధం చేస్తున్న రేవంత్.. 2 లో

కరువు మండలాల్లో రుణాల వసూళ్లకు బ్రేక్

(హైదరాబాద్, సాక్షర): తెలంగాణలో కరువు పరిస్థితులతో ఇబ్బందులు పడుతున్న రైతులకు భారీ ఊరట లభించనుంది. ఎల్ నినో ప్రభావం నేపథ్యంలో ప్రభుత్వం రాష్ట్రంలో 365 మండలాలను కరువు మండలాలుగా ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ మండలాల్లో రైతులు తీసుకున్న పాత రుణాల వసూళ్లను 12 నెలల పాటు నిలిపివేయాలని నిర్ణయించింది. అంతేకాదు.. రుణాలు తిరిగి చెల్లించేందుకు రైతులకు 3 నుంచి 5 ఏళ్ల వరకు గడువు కల్పించనుంది. దీంతో అప్పుల చెల్లింపుల విషయంలో రైతులకు కొంత ఉపశమనం లభించనుంది.రాష్ట్రంలోని కరువు పరిస్థితులపై అధ్యయనం చేసేందుకు ఏర్పాటు చేసిన మంత్రివర్గ ఉపసంఘం చేసిన సిఫారసుల మేరకు ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. ఈ ప్రతిపాదనకు బ్యాంకర్లు కూడా సూత్రప్రాయంగా అంగీకరించారు. మంగళవారం ప్రజాభవన్‌లో జరిగిన రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల కమిటీ (ఎస్ఎల్‌బీసీ) ప్రత్యేక సమావేశంలో ఈ మేరకు తీర్మానాలు చేశారు. 4 లో

డిసెంబర్ నుంచి డేంజర్ బెల్స్...

(హైదరాబాద్, సాక్షర): అప్పట్లో 2002 సంవత్సరం.. ఇప్పటికీ ఆ కరువు కరాళనృత్యం అందరి మదిలో ఉంది. తెలుగునాట తీవ్రమైన కరువొచ్చింది.. నీళ్ల కోసం బిందెలు సైకిళ్లకు కట్టుకొని పొలాల వద్దకు వెళ్లి మిగిలిన కాసిన్ని నీటిని తెచ్చుకొని జనాలు తమ అవసరాలు తీర్చుకున్న పరిస్థితి. అప్పుడు తెలుగు రాష్ట్రాల్లో ఎక్కడ చూసినా బిందెలు మోస్తూ వెళుతున్న దృశ్యాలే.... రైతులు అయితే పిట్టల్లా రాలారు. కరెంట్ లేక, తాగునీటి సౌకర్యం లేక జనాలు హరిగోస పడ్డారు. అంతటి తీవ్రమైన కరువు ఇప్పుడు ఎల్ నినోతో మరోసారి రాబోతోంది. ఈసారి హైదరాబాద్ మహానగారానికి అది పొంచి ఉంది. డిసెంబర్ నుంచే ఆ డేంజర్ బెల్స్ మోగనున్నాయి. హైదరాబాద్ ప్రజల గొంతులో ఇప్పుడు పచ్చి వెలక్కాయ పడింది. వేసవి దాహార్తి గురించి మనం ప్రతీ ఏడాదీ వింటూనే ఉంటాం.. కానీ ఈసారి వేసవి రావాల్సిన అవసరం కూడా లేదేమో అనిపిస్తోంది. 3 లో

ధాన్యం కొనుగోలు చేయకుండా కాంగ్రెస్ రైతులను మోసం చేస్తున్నది : పుట్ట మధుకర్

మంథని :పెద్దపల్లి జిల్లా మంథని ఏఎంసీలో ధాన్యం కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయకుండా రైతులను కాంగ్రెస్ ప్రభుత్వం ఆగం చేస్తున్నదని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధుకర్ అన్నారు. గురువారం మంథని ఏఎంసీ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ధాన్యాన్ని ప్రైవేటుగా రూ. 3000 వరకు ఇచ్చి కొనుగోలు చేస్తున్నారని సీఎం అనడం ఎంతవరకు సమంజసమన్నారు. ప్రభుత్వమే దళారులను ప్రోత్సహిస్తూ రైతులను ఆగం చేయాలని చూస్తున్నది. మంథనిలో రూ. 2500లకు కూడా ధాన్యాన్ని కొనుగోలు చేయడం లేదనడానికి ఏఎంసీలో ఉన్న ధాన్యమే నిదర్శనమన్నారు. ఏఎంసీలో ఉన్న ధాన్యం కుప్పలను కొంగలకు ఆహారంగా మారుతున్నాయి. సీఎంకు భజన చేస్తున్న మంథని ఎమ్మెల్యే శ్రీధర్ బాబు కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే ప్రజలను చులకన చేయడం బంద్ చేయాలన్నారు. 3 లో

ఎన్విడియా సీఈఓ జెన్సన్ హువాంగ్‌ను నియమించుకోవడం గౌరవంగా భావిస్తా:ఎలాన్ మస్క్



ప్రముఖ చిప్ తయారీ సంస్థ ఎన్విడియా సీఈఓ జెన్సన్ హువాంగ్‌ను తన సంస్థలో నియమించుకోవడానికి అవకాశం వస్తే గౌరవంగా భావిస్తానని టెస్లా అధినేత ఎలాన్ మస్క్ అన్నారు. హువాంగ్‌ను ఉద్యోగంలోకి తీసుకోవాలని ఓ నెటిజన్ ఎక్స్‌లో చేసిన సూచనకు మస్క్ స్పందించారు. ''అది నాకు గౌరవంగా ఉంటుంది'' అని బదులిచ్చారు. ఈ నెల ప్రారంభంలోనూ హువాంగ్‌కు మస్క్ మద్దతుగా నిలిచారు. సీక్వోయా క్యాపిటల్ భాగస్వామి షాన్ మాగ్వైర్ చేసిన ఓ పోస్టును ఆయన సమర్థించారు. పూర్తిగా 3 లో

హసీనా ప్రకటనతో హైటెన్షన్..



ఢాకా:ఒకప్పుడు ప్రజా తిరుగుబాటుతో అధికారం కోల్పోయిన షేక్ హసీనా.. ఇప్పుడు మళ్లీ స్వదేశానికి వస్తానంటున్నారు. ఆమె రాకకు డిసెంబర్ గడువు దగ్గరపడుతుండగా బంగ్లాదేశ్‌లో ఒక్కసారిగా పరిస్థితులు వేడెక్కాయి. వీధుల్లో బాంబు పేలుళ్లు.. బస్సులు, వాహనాలకు నిప్పు.. పోలీసులతో ఆందోళనకారుల ఘర్షణలు.. వరుస ఘటనలతో దేశంలో ఉద్రిక్తతలు పెరుగుతున్నాయి. ఈ హింస వెనుక హసీనా పార్టీ అవామీ లీగ్ కార్యకర్తల హస్తం ఉందని ప్రభుత్వం ఆరోపిస్తోంది. పూర్తిగా 3 లో

ప్రెస్ రిలీజ్‌ల కాలం పోయింది.. ఇప్పుడంతా ఇన్‌స్టా రీల్స్..!



మీడియాతో తనకు సుదీర్ఘ కాలంగా అనుబంధం ఉందని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. మీడియా ప్రపంచంలో సాధ్యం కానిదంటూ ఏదీ లేదని ఆయన చెప్పారు. విపత్తులు, సంక్షోభాల సమయంలో క్షేత్రస్థాయి రిపోర్టర్‌లు కథనాల కోసం ఎంతదూరమైనా వెళ్తారని ప్రశంసించారు. ఢిల్లీలోని బీజేపీ ప్రధాన కార్యాలయం లో జర్నలిస్టుల కోసం దీపావళి మిలన్ పేరుతో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రధాని మోదీ ప్రసంగించారు. విలేకరులతో తనకు సుదీర్ఘకాల అనుబంధం ఉన్నదని, బీజేపీలో చేరిన తొలినాళ్లలో మీడియా ఈవెంట్ల కోసం కుర్చీలువేసే బాధ్యత తనదే ఉండేదని, అప్పట్లో తాను విలేకరులతో చాలా విషయాలు మాట్లాడేవాడినని ప్రధాని తెలిపారు. గడిచిన కొన్నేళ్లలో జర్నలిజంలో ఎన్నో మార్పులు వచ్చాయని, సాంకేతికంగా ఎంతో అభివృద్ధి జరిగిందని అన్నారు. ఒకప్పుడు మీడియా సమావేశాల ప్రసారం కోసం అవుట్‌సైడ్ బ్రాడ్‌కాస్ట్ వ్యాన్లను ఉపయోగించేవారని, ఇప్పుడు మొబైల్ ఫోనే బ్రాడ్‌కాస్ట్ వాహనంగా మారిపోయిందని చెప్పారు. పూర్తిగా 3 లో

పెట్టుబడిదారులకు భారత్ భరోసా



(విశాఖపట్నం, సాక్షర): ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖ నగరం సీఐఐ భాగస్వామ్య సదస్సుకు శాశ్వత వేదికగా మారుతోంది. పవిత్రమైన కార్తీక మాసంలో ఈ పెట్టుబడుల సదస్సు నిర్వహించటం సంతోషదాయకం, ఒక దీపం మరో దీపాన్ని వెలిగిస్తుంది. పెట్టుబడుల సదస్సు కూడా దేశ వాణిజ్యాన్ని వృద్ధి చేస్తోందని కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖామంత్రి పీయూష్ గోయెల్ అన్నారు. విశాఖ లో జరుగుతున్న సిఐఐ సమ్మిట్ లో అయన మాట్లాడారు. కేంద్రమంత్రి మాట్లాడుతూ ఇటీవలే రెండు తుఫాన్లు ఏపీ తీరాన్ని తాకాయి. విధ్వంసం సృష్టించాయి. కానీ నష్టం జరిగినా వెంటనే కోలుకుని విశాఖ నగరం పెట్టుబడుల సదస్సుకు వేదిక అయ్యింది. ప్రపంచ వ్యాప్తంగా పారిశ్రామిక వేత్తల్ని, ఆయా దేశాల రాయబారులను, ప్రతినిధుల్ని ఆహ్వానించింది. కాలం కంటే ముందు ఆలోచన చేసి ఏఐ, క్వాంటం లాంటి టెక్నాలజీల గురించి మాట్లాడిన వ్యక్తి సీఎం చంద్రబాబు. అంతా ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ గురించి మాట్లాడుకుంటే ఆయన స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ ను అమలు చేస్తున్నారు. పెట్టుబడిదారుల్లో విశ్వాసాన్ని పెంచేలా పారిశ్రామిక ప్రోత్సాహకాలను అందించేందుకు ఎస్క్రోఖాతాను ఏపీ ప్రారంభించింది. 2024లో సీఎం చంద్రబాబు అధికారం చేపట్టినప్పుడు రాష్ట్రానికి పెద్ద ఎత్తున అప్పులు, విధ్వంసమైన వ్యవస్థలు ఆయన చేతికి వచ్చాయి. అయినా ఏపీని వేగంగా పునరుద్ధరించి వ్యవస్థలను చక్కదిద్దుతూ పెట్టుబడులకు స్వర్గధామంగా ఏపీని తయారు చేశారు. స్పీడ్ ఆఫ్ డెలివరింగ్ గవర్నెన్సు విధానంతో సీఎం చంద్రబాబు నేతృత్వంలోని ప్రభుత్వం పనిచేస్తోంది. ఆర్ఆర్ఆర్ సినిమాలో లా సీఎం చంద్రబాబు, ప్రధాని మోదీ నీరు, నిప్పులా అభివృద్ధి కోసం పనిచేస్తున్నారు. ప్రపంచవ్యాప్తంగా సంక్షోభం, సవాళ్లు, పోటీ నెలకొన్నాయని అన్నారు. ఇలాంటి విపత్కర సమయంలోనే పెట్టుబడిదారులకు భారత్ భరోసాగా నిలుస్తోంది. పూర్తిగా 3 లో

సంపాదకీయం

అమెరికా టార్గెట్ గా హానీట్రాప్



చిప్ తయారీ దిగ్గజం ఎన్విడియా సీఈవో జెన్సన్ హువాంగ్ చుట్టూ వివాదం మరింత ముదురుతోంది. చైనా గూఢచర్య కార్యకలాపాలతో సంబంధాలున్నట్లు అనుమానిస్తున్న అలిస్ హువాంగ్‌తో ఆయనకు సన్నిహిత సంబంధాలున్నాయన్న ఆరోపణలపై సంస్థ స్వతంత్ర దర్యాప్తు ప్రారంభించింది. ఇందుకోసం ప్రముఖ అమెరికా న్యాయ సంస్థ వాచెల్, లిప్టన్, రోసెన్ అండ్ కట్జ్‌ను నియమించింది. మరోవైపు ఉద్యోగులతో జరిగిన అంతర్గత సమావేశంలో తన వ్యక్తిగత తప్పిదాన్ని అంగీకరించి, కుటుంబానికి కలిగించిన బాధకు హువాంగ్ క్షమాపణలు చెప్పినట్లు సమాచారం.గతంలో ఓపెన్‌ఏఐ, సేల్స్‌ఫోర్స్ వంటి దిగ్గజాల తరపున వాదించిన ఈ న్యాయసంస్థ, హువాంగ్ వ్యవహారంపై లోతుగా దర్యాప్తు జరపనుంది. ఆర్థిక మోసాలు, క్రిమినల్ కేసులను వాదించడంలో అపార అనుభవం ఉన్న న్యూయార్క్ సదరన్ డిస్ట్రిక్ట్ మాజీ అటార్నీ జూన్ కిమ్ ఈ దర్యాప్తునకు నేతృత్వం వహించనున్నారు. గతంలో ఆయన న్యూయార్క్ సదరన్ డిస్ట్రిక్ట్‌లో తాత్కాలిక ఫెడరల్ అటార్నీగా పనిచేశారు. పెద్ద సంస్థలకు సంబంధించిన క్లిష్టమైన న్యాయపరమైన వ్యవహారాలు, దర్యాప్తుల్లో ఈ న్యాయ సంస్థకు అనుభవం ఉంది. 2021లో అప్పటి న్యూయార్క్ గవర్నర్ ఆండ్రూ క్యూమోపై వచ్చిన లైంగిక వేధింపుల ఆరోపణలపై జరిగిన విచారణలోనూ కిమ్ కీలక పాత్ర పోషించారు. ఇప్పుడు హువాంగ్ వ్యవహారంలోనూ స్వతంత్రంగా అన్ని అంశాలను పరిశీలించనున్నారు.ఎన్విడియా స్వతంత్ర డైరెక్టర్లతో కూడిన కమిటీ విచారణను పర్యవేక్షించనుంది. జాతీయ భద్రతకు సంబంధించిన అంశాలు, సంస్థ రహస్యాలు బయటకు వెళ్లినట్లు ప్రస్తుతం తమ వద్ద ఆధారాలు లేవని ఎన్విడియా ఇప్పటికే స్పష్టం చేసింది. అయినప్పటికీ అందుబాటులో ఉన్న సమాచారాన్ని బోర్డు సమగ్రంగా పరిశీలిస్తుందని తెలిపింది. ఈ విచారణకు హువాంగ్ పూర్తిగా సహకరిస్తారని వెల్లడించింది. ఇదే అంశంపై అమెరికా దర్యాప్తు సంస్థ ఎఫ్‌బీఐ కూడా విచారణ జరుపుతోంది. ఈ దర్యాప్తులో భాగంగా అలిస్ హువాంగ్‌ను విచారించే అవకాశం ఉందా లేదా అన్న దానిపై ఇంకా స్పష్టత రాలేదు.'ది న్యూయార్క్ టైమ్స్' కథనం ప్రకారం, ఆలిస్ హ్వాంగ్ అనే చైనా వ్యాపారవేత్త.. చైనా తరపున గూఢచర్యానికి పాల్పడుతున్నారని అమెరికా నిఘా అధికారులు అనుమానిస్తున్నారు.ఎన్విడియా సీఈఓ, దాని సహ వ్యవస్థాపకుడైన జెన్సన్ హ్వాంగ్‌తో ఆలిస్‌కు సన్నిహిత సంబంధం ఉందని అధికారులు భావిస్తున్నారు.హ్వాంగ్ తన భార్యకు నమ్మకద్రోహం చేసినట్లు అంగీకరించి, భార్యకు, పిల్లలకు క్షమాపణలు చెప్పారు.ఈ కథనాలపై ఎన్విడియా ఒక స్వతంత్ర దర్యాప్తును ప్రారంభించింది. అయితే, దీనివల్ల అమెరికా జాతీయ భద్రతకు ఎలాంటి ముప్పు వాటిల్లలేదని ఆ సంస్థ పేర్కొంది.ఈ విషయంపై ఎఫ్‌బీఐ కూడా దర్యాప్తు చేస్తోందని అధ్యక్షుడు డోనల్డ్ ట్రంప్ తెలిపారు. హ్వాంగ్‌తో తాను మాట్లాడినట్లు ట్రంప్ వెల్లడించారు.గూఢచర్యంలో అమెరికాను టార్గెట్‌గా చేసుకున్న చైనా ఇందుకోసం హ్వాంగ్‌ను పావుగా వాడుకున్నట్లు అనుమానాలు వ్యక్తమయ్యాయి..ది న్యూయార్క్ టైమ్స్' నివేదిక ప్రకారం గూఢచర్యం చేసే ఉద్దేశ్యంతో చైనా అగ్రశ్రేణి గూఢచార సంస్థ ఆలిస్ హ్వాంగ్‌ను నియమించుకుందని అమెరికా అధికారులు భావించారు. ఆమె ప్రస్తుతం ఎక్కడ ఉన్నారో తెలియదు.ఆలిస్ హ్వాంగ్‌కు జెన్సన్ హ్వాంగ్‌తో ఎలాంటి కుటుంబ సంబంధం లేదు. మార్చి- నవంబర్ 2023 మధ్య ఆమె సింగపూర్‌కు చెందిన డేటా సెంటర్ కంపెనీ మెగాస్పీడ్‌లో ఒక ఉన్నత పదవిని నిర్వహించారు. ఈ సంస్థ చైనాకు ఎన్విడియా చిప్‌ల రవాణాను సులభతరం చేసిందనే అనుమానం ఉండేది. అయితే, ఈ విషయంపై విచారణ జరిపి, ఆ ఆరోపణలు అవాస్తవమని తేలిందని ఎన్విడియా పేర్కొంది.మెగాస్పీడ్‌పై గతంలో వచ్చిన ఆరోపణలపై సింగపూర్ ప్రభుత్వం విచారణ జరుపుతోంది. ఆ ఆరోపణల ప్రకారం, ఉన్నత శ్రేణి ఎన్విడియా చిప్‌లపై అమెరికా విధించిన ఎగుమతి ఆంక్షలను ఆ కంపెనీ తప్పించుకోవడానికి ప్రయత్నించింది. ఈ విషయంపై వ్యాఖ్య కోసం మెగాస్పీడ్‌ను సంప్రదించింది.గత నెలలో, ప్రస్తుత నాయకత్వం ఈ ఆరోపణలను తీవ్రంగా పరిగణించిందని, అంతర్గత విచారణ జరిపేందుకు న్యాయ సలహాదారులను నియమించిందని ఆ కంపెనీ 'ది న్యూయార్క్ టైమ్స్'కు తెలిపింది.నిఘా పెట్టినప్పుడు ఆలిస్ హ్వాంగ్‌కు ఒక అమెరికా పౌరుడికి మధ్య సంభాషణలు జరిగినట్లు తేలింది. 'అన్‌మాస్కింగ్' అనే ప్రక్రియ ద్వారా పరిశోధించినప్పుడు ఆ వ్యక్తి జెన్సన్ హ్వాంగ్ అని గుర్తించారు.అయితే, హ్వాంగ్ లే అనే మరో పేరు కూడా ఉన్నా ఆలిస్ హ్వాంగ్ ఎలాంటి సమాచారాన్ని సేకరించి బీజింగ్‌కు పంపారు అన్నది స్పష్టంగా తెలియలేదు..అమెరికా గూఢచార అధికారులు లేవనెత్తిన ఆందోళనల గురించి తమ కంపెనీకి తెలుసా అని అడిగినప్పుడు, తమకు అలాంటి సమాచారం తెలియదని ఎన్విడియా ఖండించింది.''ఒకవేళ మేం ఏదైనా నిజమైన ముప్పును ఎదుర్కొంటున్నట్లయితే, అమెరికా ప్రభుత్వం మాకు తెలియజేసి ఉండేదని భావిస్తున్నాం'' అని ఎన్విడియా ప్రతినిధి బీబీసీతో అన్నారు.మరోవైపు ఈ గూఢచర్యం ఆరోపణలను చైనా తోసిపుచ్చింది. విదేశాంగ శాఖ ప్రతినిధి గ్వో జియాకున్ ఒక మీడియా సమావేశంలో "మేం ఇప్పటికే స్పందించాం. చైనా గూఢచర్యానికి సంబంధించిన ఈ ఆరోపణలు పూర్తిగా నిరాధారమైనవి. ఊహాగానాలపై ఆధారపడినవి. చైనా ప్రతిష్ఠను దెబ్బతీయడానికి ఉద్దేశించినవి" అని అన్నారు.ఆలిస్ హ్వాంగ్ చైనా కోసం గూఢచర్యం చేస్తున్నారని ఆరోపిస్తూ డోనల్డ్ ట్రంప్‌కు గత సంవత్సరమే నిఘా నివేదికలు అందాయని అక్టోబర్ చివరిలో 'ది న్యూయార్క్ టైమ్స్' కథనం రాసింది.మరోవైపు హ్వాంగ్ గురించి అడిగినప్పుడు అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో వ్యాఖ్యానించడానికి నిరాకరించారు.హ్వాంగ్ 1980ల ప్రారంభంలో ఒరెగాన్ స్టేట్ యూనివర్శిటీలో తన కాబోయే భార్య లారీ మిల్స్‌ను కలిశాడు. ఆ సమయంలో, వారిద్దరూ ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ చదువుతూ ఒకే ల్యాబ్‌లో పనిచేసేవారు.వారు ఎన్విడియాను సహ-స్థాపించడానికి సుమారు ఎనిమిది సంవత్సరాల ముందు, 1985లో వివాహం చేసుకున్నారు. వారికి మాడిసన్, స్పెన్సర్ అనే ఇద్దరు పిల్లలు ఉన్నారు.2007లో, వారిద్దరూ జెహెచ్ అండ్ ఎల్ హ్వాంగ్ ఫౌండేషన్‌ను స్థాపించారు. ఎన్విడియా స్టాక్ ధరలో వేగవంతమైన పెరుగుదల కారణంగా, గత కొన్ని సంవత్సరాలుగా ఈ ఫౌండేషన్ ఆస్తులు గణనీయంగా పెరిగాయి. దీని విలువ 9 బిలియన్ డాలర్లకు పైగా ఉంటుందని అంచనా.ఈ ఫౌండేషన్ ఒరెగాన్ స్టేట్ యూనివర్సిటీ, స్టాన్‌ఫోర్డ్ యూనివర్సిటీలలోని ఇంజనీరింగ్ ప్రోగ్రామ్‌లకు మిలియన్ల డాలర్లను విరాళంగా ఇచ్చింది.హ్వాంగ్ ఎప్పుడూ తనను తాను ఒక ఫ్యామిలీ మ్యాన్‌గా చూపించుకునేందుకు ప్రయత్నించేవారని హ్వాంగ్ బయోగ్రఫీ రచయిత స్టీఫెన్ విట్ చెప్పారు."ఆయన తన భార్యను పొగుడుతూ ఆమె గురించి చాలా మంచి విషయాలు చెబుతారు. అయితే ఇలాంటి విషయాలు బయటపడితే ఏ కుటుంబానికైనా తీవ్రమైన బాధ కలుగుతుంది. తనను తాను ఒక కుటుంబ పెద్దగా చూపించుకోవడానికి, తన పిల్లలను తన దగ్గర ఉంచుకోవడానికి ఎంతో కృషి చేసిన వ్యక్తిపై ఆ ప్రభావం మరింత ఎక్కువగా ఉండొచ్చు'' అని స్టీఫెన్ విట్ చెప్పారు.

డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ తో మంత్రి లోకేష్ భేటీ



(విశాఖపట్నం, సాక్షర): విశాఖలో జరుగుతున్న సిఐఐ 31వ పార్టనర్ షిప్ సమ్మిట్ కు హాజరైన ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ తో రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ మర్యాద పూర్వకంగా భేటీ అయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో పెద్దఎత్తున పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వస్తున్న ఇన్వెస్టర్ల వివరాలను మంత్రి లోకేష్ డిప్యూటీ సిఎంకు తెలియజేశారు. పెట్టుబడుల రాకకు చొరవ చూపుతున్న మంత్రి లోకేష్ ను పవన్ కళ్యాణ్ అభినందించారు. భవిష్యత్తులో ఇదే ఒరవడిని కొనసాగగలదన్న ఆశాభావాన్ని ఆయన వ్యక్తం చేశారు.

మొదటి పేజీ తరువాయి

కవిత పార్టీ సత్తా చాటుతుందా

రాజకీయ సవాళ్లు బీఆర్ఎస్ నుంచి బయటకు వచ్చి సొంత పార్టీ ఏర్పాటు చేసిన తర్వాత కవిత ఎదుర్కొంటున్న మొదటి ఎన్నికలు ఇవే కావడం గమనార్హం. కొత్త పార్టీకి క్షేత్రస్థాయిలో బలమైన క్యాడర్ నిర్మించుకోవడం, ప్రధాన పార్టీల ఆర్థిక బలాన్ని తట్టుకోవడం ఆమె ముందున్న ప్రధాన సవాళ్లుగా పరిశీలకులు చెబుతున్నారు. అంతేకాదు.. విద్యావంతులు ఈ ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకుంటారు. సో.. ఈ క్రమంలో కవితకు విద్యావంతుల్లో ఏమేరకు ప్రభావం ఉంది? వారు ఏమేరకు ఆమెను స్వాగతిస్తున్నారన్న విషయం కూడా స్పష్టం అవుతుందని పరిశీలకులు అంచనా వేస్తున్నారు

అరకు కాఫీ రుచి చూసిన పీయూష్, చంద్రబాబు, పవన్ కల్యాణ్..

- ఏపీ పెవిలియన్‌ను సందర్శించిన కేంద్రమంత్రి పీయూష్ గోయల్
- కేంద్రమంత్రికి రాష్ట్ర అభివృద్ధి ప్రణాళికలు వివరించిన సీఎం చంద్రబాబు
- సీఎం, డిప్యూటీ సీఎం పవన్‌తో కలిసి పెవిలియన్‌ను పరిశీలించిన గోయల్
- రాష్ట్ర కళలు, సంస్కృతిని ప్రతిబింబించే స్టాళ్లను ఆసక్తిగా తిలకించిన నేతలు



ఆంధ్రప్రదేశ్ సమగ్రాభివృద్ధి ప్రణాళికలు, సాంస్కృతిక వైభవాన్ని ప్రతిబింబించేలా ఏర్పాటు చేసిన ఏపీ పెవిలియన్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌తో కలిసి ఈ పెవిలియన్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను అధికారులు వారికి వివరించారు. ముఖ్యంగా, తిరుపతి, విశాఖపట్టణం, అమరావతి ఎకనమిక్ రీజియన్లలో జరుగుతున్న ప్రగతిపై అధికారులు డిజిటల్ ప్రజెంటేషన్ ద్వారా తెలియజేశారు. సీఆర్డీఏ పరిధిలో చేపడుతున్న పనులు, విశాఖపట్నం అభివృద్ధి ప్రణాళికలపై ప్రత్యేకంగా వివరించారు. రాష్ట్రంలో చిన్న, మధ్య తరహా పరిశ్రమల అభివృద్ధికి తీసుకుంటున్న చర్యలను సైతం నేతల దృష్టికి తీసుకెళ్లారు. పారిశ్రామిక ప్రగతికి ప్రభుత్వం ఇస్తున్న ప్రాధాన్యతను అధికారులు స్పష్టం చేశారు. అనంతరం పెవిలియన్‌లోని సాంస్కృతిక ప్రదర్శనలను నేతలు ఆసక్తిగా తిలకించారు. రాష్ట్ర సంస్కృతి, సంప్రదాయాలకు అద్దం పట్టేలా ఏర్పాటు చేసిన కళాకృతుల వద్ద కేంద్రమంత్రి పీయూష్ గోయల్, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్ ఫొటోలు దిగారు. గిరిజనులు రూపొందించిన చిత్రాలను ప్రత్యేకంగా పరిశీలించి, కేంద్రమంత్రి, సీఎం స్వయంగా నమూనా చిత్రాలను తీర్చిదిద్దడం విశేషం. తోలుబొమ్మలాట, పెన్ కలంకారీ వంటి కళారూపాల స్టాళ్లను సందర్శించారు. ఈ సందర్భంగా రాష్ట్రానికి చెందిన ప్రముఖ కళాకారులు, వారి నైపుణ్యాల గురించి సీఎం చంద్రబాబు కేంద్రమంత్రికి వివరించారు. పర్యటనలో భాగంగా, అరకు కాఫీ స్టాల్ వద్ద సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రులు లోకేశ్, బీజేపీ ఏపీ అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్‌తో కలిసి కేంద్రమంత్రి పీయూష్ గోయల్ అరకు కాఫీని రుచి చూశారు. కాసేపు సరదాగా ముచ్చటించారు. అనంతరం సదస్సు ప్రాంగణంలో కేంద్రమంత్రి, సీఎం, డిప్యూటీ సీఎం బ్యాటరీ కారులో కలిసి ప్రయాణించారు. ఈ పర్యటన రాష్ట్ర అభివృద్ధికి కేంద్రం అందిస్తున్న సహకారానికి, బలమైన బంధానికి నిదర్శనంగా నిలిచింది.

పక్క చూపులు చూస్తున్న టీవీకే ఎమ్మెల్యేలు

(చెన్నై, సాక్షర): తమిళనాడులో తమిళగ వెట్రి కళగం ప్రభుత్వం కొలువుదీరి సరిగ్గా ఆరు నెలలు పూర్తయిన తరుణంలో, ముఖ్యమంత్రి సి.జోసెఫ్ విజయ్ అధ్యక్షతన చెన్నై సమీపంలోని పనైయూర్ వేదికగా ఎమ్మెల్యేల అత్యవసర సమావేశం ఏర్పాటు చేశారు. ప్రభుత్వాన్ని నూతన ప్రమాణాలతో నడిపిస్తామని అధికారంలోకి వచ్చిన టీవీకే.. అతి స్వల్ప కాలంలోనే సొంత పార్టీ ఎమ్మెల్యేలు, మంత్రుల వివాదాస్పద ప్రవర్తన వల్ల తీవ్రమైన ప్రజా వ్యతిరేకతను, ప్రతిపక్షాల దాడిని ఎదుర్కొంటోంది. దీనికితోడు 234 మంది సభ్యులున్న అసెంబ్లీలో మేజిక్ ఫిగర్ 118 కాగా, టీవీకేకు 109 మంది శాసనసభ్యుల బలమే ఉండటం, కాంగ్రెస్, వీసీకే, వామపక్షాల బాహ్య మద్దతుపైనే సర్కారు ఆధారపడి ఉండటంతో.. ప్రభుత్వ మనుగడ ప్రశ్నార్థకంగా మారకుండా ఉండేందుకు పార్టీ పగ్గాలను కఠినతరం చేసేందుకు విజయ్ సిద్ధమయ్యారు.ఇటీవల పార్టీ ప్రజాప్రతినిధులపై వెల్లువెత్తిన వరుస ఆరోపణలు ప్రభుత్వ ప్రతిష్టను తీవ్రంగా దెబ్బతీశాయి. కళ్లకురిచ్చి మహిళా జిల్లా కలెక్టర్‌కు అసభ్యకర వాట్సాప్ సందేశాలు పంపారన్న అభియోగంపై ఎమ్మెల్యే అరుల్ విఘ్నేశ్ సోషల్ మీడియాలో తీవ్ర విమర్శలపాలయ్యారు. మరోవైపు తాగునీటి ఎద్దడిపై ప్రశ్నించిన ఒక వృద్ధుడిపై అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్, తురైయూర్ ఎమ్మెల్యే రవిశంకర్ చేయి చేసుకున్న వీడియో రాష్ట్రవ్యాప్తంగా కలకలం రేపింది. బాధితుడిని పోలీసులతో బెదిరించి బలవంతపు ప్రకటన చేయించారన్న ఆరోపణలు వివాదాన్ని మరింత రాజేశాయి. వీటికి తోడు ఐపీఎల్ మ్యాచ్ చూస్తూ ఒక అనుమానాస్పద పదార్థాన్ని నలిపిన పాత వీడియో కారణంగా మంత్రి శరత్ కుమార్ డ్రగ్స్ ఆరోపణలు ఎదుర్కోవడం, తాంబరం మున్సిపాలిటీ ప్రాజెక్టులో అవినీతి ఆరోపణలు రావడం, తూత్తుకుడి ఎమ్మెల్యేపై లైంగిక దాడి ప్రోత్సాహం వంటి ఫిర్యాదులు రావడంతో ప్రభుత్వం తీవ్ర ఆత్మరక్షణలో పడింది.ఈ పరిణామాలపై డీఎంకే, ఏఐఏడీఎంకే వంటి ప్రధాన ప్రతిపక్షాలు ఉమ్మడిగా విరుచుకుపడుతున్నాయి. రాష్ట్రంలో శాంతిభద్రతలు ఐసీయూలో పడ్డాయని, పాలన కోమాలోకి వెళ్లిపోయిందని డీఎంకే అధినేత ఎం.కె. స్టాలిన్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. పాలనా అనుభవం లేకపోవడం, కేడర్‌పై నియంత్రణ లోపించడం వల్లే ఇలాంటి బరితెగింపులు జరుగుతున్నాయని విపక్షాలు విమర్శిస్తుండగా.. టీవీకే మాత్రం విపక్షాలే తమ ఎమ్మెల్యేలను కొనుగోలు చేసి ప్రభుత్వాన్ని కూల్చేందుకు ఆపరేషన్ ఆకర్ష్ కుట్రలు పన్నుతున్నాయని ప్రత్యారోపణలు చేస్తోంది. ప్రభుత్వం ఏర్పాటై ఆరు నెలలు కావడంతో ప్రతిపక్షాలు సాంకేతికంగా మరోసారి అవిశ్వాస తీర్మానాన్ని ప్రతిపాదించే అవకాశం ఉండటం, త్వరలోనే జరగనున్న 5 అసెంబ్లీ స్థానాల ఉప ఎన్నికలతో పార్టీ ఎమ్మెల్యేలు ఎవరూ ప్రలోభాలకు గురికాకుండా తమ గూటిని కాపాడుకోవడం విజయ్‌కు అత్యంత క్లిష్టమైన పరీక్షగా మారిందిసొంత పార్టీ కార్యాలయంలో కాకుండా ఒక ప్రైవేట్ రిసార్ట్‌లో ఈ అంతర్గత భేటీని నిర్వహించేందుకు సన్నాహాలు చేయడం వెనుక ఎమ్మెల్యేలను కాపాడుకునే ఎత్తుగడ స్పష్టంగా కనిపిస్తోంది. ఎమ్మెల్యేలు, మంత్రుల తీరుపై తీవ్ర ఆగ్రహంతో ఉన్న విజయ్.. క్రమశిక్షణారాహిత్యాన్ని సహించేది లేదని హెచ్చరించడంతో పాటు అంతర్గత విచారణల ఆధారంగా కొందరి శాఖలను మార్చడం, ఉద్వాసన పలికేలా కేబినెట్ పునర్వ్యవస్థీకరణకు సిద్ధమవుతున్నట్లు సమాచారం. మరోవైపు రానున్న ఐదు ఉప ఎన్నికల్లో క్లీన్ స్వీప్ చేసి సంపూర్ణ మెజారిటీకి చేరువకావాలన్న వ్యూహాన్ని కూడా ఈ సమావేశంలో ఖరారు చేయనున్నారు. ఏది ఏమైనప్పటికీ, సినిమాల నుంచి సరికొత్త రాజకీయ ఆశలతో ముఖ్యమంత్రి పీఠాన్ని అధిరోహించిన విజయ్‌కు.. సొంత ఎమ్మెల్యేల అదుపులేని వైఖరి, సంకీర్ణ సర్కారు సంక్షోభం ఆరు నెలల్లోనే అతిపెద్ద రాజకీయ అగ్నిపరీక్షగా నిలిచాయి.

మొదటి పేజీ తరువాయి

హసీనా ప్రకటనతో హైటెన్షన్..

మరోవైపు వేతనాల పెంపు కోసం కార్మికుల నిరసనలు కూడా కొనసాగుతున్నాయి. అసలు బంగ్లాదేశ్‌లో ఏం జరుగుతోంది? హసీనా రీఎంట్రీ ప్రకటనతో ఈ పరిణామాలకు సంబంధం ఉందా? అనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి. హసీనా రాక నేపథ్యంలో ప్రస్తుత ఆందోళనలు పరిస్థితిని మరింత సంక్లిష్టంగా మారుస్తున్నాయి. బంగ్లాదేశ్‌లో అక్టోబర్ చివరి నుంచి హింసాత్మక ఘటనలు పెరుగుతున్నాయి. రాజధాని ఢాకాతో పాటు గాజీపూర్, గోపాల్‌గంజ్, షరియత్‌పూర్ తదితర ప్రాంతాల్లో బాంబు పేలుళ్లు, వాహనాల దహనాలు చోటుచేసుకున్నాయి. నవంబర్ 9, 10 తేదీల్లో దేశవ్యాప్తంగా కనీసం 22 అగ్నిప్రమాదాలు, బాంబు పేలుళ్ల ఘటనలు నమోదైనట్లు స్థానిక మీడియా వెల్లడించింది. నవంబర్ 11న ఢాకాలో రెండు బస్సులు, ఒక ట్రక్కుకు నిప్పు పెట్టారు. పబ్నాలోని గ్రామీణ బ్యాంకు శాఖను కూడా దగ్ధం చేశారు. తాజాగా నవంబర్ 12న నేషనల్ సిటిజన్ పార్టీ ఎంపీ నుస్రత్ తబస్సుమ్ ఇంటికి నిప్పు పెట్టారు. అవామీ లీగ్ కార్యకర్తలే ఈ దాడికి పాల్పడినట్లు ఆరోపణలు వచ్చాయి. అవామీ లీగ్ బంద్ పిలుపుతో ఉద్రిక్తతలు..: కాగా, బంగ్లాదేశ్‌లో నిషేధిత అవామీ లీగ్ విద్యార్థి విభాగమైన బంగ్లాదేశ్ ఛాత్ర లీగ్ నవంబర్ 10న దేశవ్యాప్త దిగ్బంధానికి పిలుపునిచ్చింది. దీంతో పలు ప్రాంతాల్లో రహదారులపై ఆందోళనలు జరిగాయి. షరియత్‌పూర్‌లో ఢాకా-భంగా ఎక్స్‌ప్రెస్‌వేను నిరసనకారులు దిగ్బంధించారు. వాహనాలపై దాడులు చేయడంతో ట్రాఫిక్ నిలిచిపోయింది. గోపాల్‌గంజ్‌లోనూ పోలీసులతో ఘర్షణలు జరిగాయి. కొన్ని ప్రాంతాల్లో పోలీసు వాహనాలను ధ్వంసం చేసి నిప్పు పెట్టారు. పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుకు బోర్డర్ గార్డ్ బంగ్లాదేశ్ బలగాలను రంగంలోకి దించారు. కార్మికుల ఆందోళనలు..: మరోవైపు వస్త్ర పరిశ్రమ కార్మికుల నిరసనలు కూడా హింసకు దారితీస్తున్నాయి. ప్రస్తుతం నెలకు 12,500 టాకాలుగా ఉన్న కనీస వేతనాన్ని 30 వేల టాకాలకు పెంచాలని కార్మికులు డిమాండ్ చేస్తున్నారు. ఢాకా, గాజీపూర్, సావర్ ప్రాంతాల్లో ఈ ఆందోళనలు తీవ్రరూపం దాల్చాయి. కొన్ని చోట్ల పోలీసులతో ఘర్షణలు జరగగా, వాహనాలు, ఫ్యాక్టరీలు, గోదాములపై దాడులు జరిగాయి. వందలాది వస్త్ర పరిశ్రమలు తాత్కాలికంగా మూతపడ్డాయి. హింస వెనుక హసీనా పార్టీ ఉందా?: దేశంలో జరుగుతున్న హింసాత్మక ఘటనల వెనుక నిషేధిత అవామీ లీగ్ కార్యకర్తలు ఉన్నారని బంగ్లాదేశ్ పోలీసులు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వాన్ని అస్థిరపరిచి ప్రజల్లో భయాందోళనలు సృష్టించడమే లక్ష్యమని పేర్కొంటున్నారు. నవంబర్ 1 నుంచి 7 వరకు బాంబు పేలుళ్ల కేసుల్లో కనీసం 21 మందిని అరెస్టు చేసినట్లు స్థానిక మీడియా తెలిపింది. అదే సమయంలో అవామీ లీగ్‌తో సంబంధాలున్నట్లు అనుమానిస్తున్న 898 మందిని వేర్వేరు పోలీసు తనిఖీల్లో అదుపులోకి తీసుకున్నట్లు వెల్లడించింది. అయితే కార్మికుల వేతనాల పెంపు డిమాండ్లు కూడా నిరసనలకు ప్రధాన కారణంగా ఉన్నాయి. ఈ ఆందోళనలను కేవలం రాజకీయ కోణంలోనే చూడలేమని పరిస్థితులు సూచిస్తున్నాయి. డిసెంబర్‌లో హసీనా రీఎంట్రీ?: 2024 ఆగస్టులో భారీ ప్రజా నిరసనల నేపథ్యంలో ప్రధాని పదవికి రాజీనామా చేసిన షేక్ హసీనా భారత్‌కు వచ్చారు. అప్పటి నుంచి ఆమె ఇక్కడే ఉంటున్నారు. ఈ ఏడాది ఆగస్టులో ఢిల్లీలో నిర్వహించిన మీడియా సమావేశంలో డిసెంబర్‌లోగా బంగ్లాదేశ్‌కు తిరిగి వస్తానని ప్రకటించారు. అయితే ఆమెకు అక్కడి అంతర్జాతీయ నేరాల ట్రిబ్యునల్ 2025 నవంబర్‌లో గైర్హాజరీలో మరణశిక్ష విధించింది. ఈ తీర్పును హసీనా రాజకీయ ప్రేరేపితమైనదిగా కొట్టిపారేశారు. మరోవైపు ఆమె నేతృత్వంలోని అవామీ లీగ్‌పై నిషేధం కొనసాగుతోంది. ఇలాంటి తరుణంలో హసీనా స్వదేశానికి తిరిగొస్తే ఆమె మద్దతుదారులు, వ్యతిరేక వర్గాల మధ్య ఎలాంటి పరిణామాలు చోటుచేసుకుంటాయన్నది ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. రాజకీయ విభేదాలు, కార్మికుల సమస్యలు రెండూ కలిసి బంగ్లాదేశ్‌లో పరిస్థితులను ప్రభావితం చేస్తున్నాయి.

మైనర్‌పై అఘాయిత్యం..

- మెదక్ పోక్సో కోర్టు సంచలన తీర్పు
- మైనర్‌పై లైంగిక దాడి కేసులో యువకుడికి 20 ఏళ్ల కఠిన కారాగార శిక్ష
- శిక్షతో పాటు రూ. 20,000 జరిమానా విధింపు
- 2021లో బాలికను కిడ్నాప్ చేసిన ఘటనలో దోషిగా నిర్ధారణ
- పక్కా ఆధారాలతో ఛార్జిషీట్ దాఖలు చేసిన పోలీసులు

(మెదక్, సాక్షర): మైనర్ బాలికపై లైంగిక దాడికి పాల్పడిన కేసులో ఓ యువకుడికి 20 ఏళ్ల కఠిన కారాగార శిక్ష విధిస్తూ మెదక్ జిల్లా పోక్సో కోర్టు కీలక తీర్పు వెలువరించింది. శిక్షతో పాటు నిందితుడికి రూ. 20,000 జరిమానా కూడా విధించింది. పోలీసుల వివరాల ప్రకారం.. కామారెడ్డి జిల్లాకు చెందిన యువకుడికి, మెదక్ జిల్లాకు చెందిన మైనర్ బాలికతో పరిచయం ఏర్పడింది. చదువు మానేసి ఇంట్లోనే ఉంటున్న ఆ బాలిక, 2021 మే 11న ఇంటి నుంచి వెళ్లిపోయి కామారెడ్డిలోని తన స్నేహితురాలి ఇంట్లో ఉంది. ఈ విషయం తెలుసుకున్న నిందితుడు, బాలికకు ఫోన్ చేసి బస్టాండ్‌లో కలిశాడు. అక్కడి నుంచి తన ఇంటికి తీసుకెళ్లి రెండు రోజుల పాటు తన వద్దే ఉంచుకున్నాడు. బాలిక కనిపించకపోవడంతో ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. మిస్సింగ్ కేసుగా నమోదు చేసిన పోలీసులు, దర్యాప్తులో భాగంగా ఈ ఘటనను గుర్తించారు. నిందితుడిపై పోక్సో చట్టంలోని సంబంధిత సెక్షన్ల కింద కేసు నమోదు చేసి, పక్కా ఆధారాలు సేకరించి కోర్టులో ఛార్జిషీట్ దాఖలు చేశారు. విచారణ సందర్భంగా పోలీసులు సమర్పించిన సాక్ష్యాధారాలను పరిశీలించిన న్యాయస్థానం, నిందితుడిని దోషిగా నిర్ధారించి పై విధంగా శిక్ష ఖరారు చేసింది.

ఈనెల 22 నాడు గోదావరి హారతి

(గోదావరిఖని, సాక్షర): ప్రతి ఏటా కార్తిక మాసంలో గోదావరి హారతి ఉత్సవ సమితి ఆధ్వర్యంలో గోదావరి మాత కి మహా హారతి కార్యక్రమం నిర్వహిస్తున్నామని ఈనెల 22వ తేదీ బుధవారం గోదావరి మాతకి గోలివాడ తీరాన గల పరమేశ్వరుడి సన్నిధిలో గోదావరి మహా హారతి కార్యక్రమం ప్రారంభించడం జరుగుతుందని అనంతరం 25వ తేదీ బుధవారం సమ్మక్క సారలమ్మల జాతర స్థలం గోదావరిఖనిలో, 27వ తేదీ శుక్రవారం మంథని గౌతమీశ్వరుని సన్నిధి లో, 30వ తేదీ సోమవారం సుందిల్ల లక్ష్మీ నరసింహ స్వామి సన్నిధి లో, డిసెంబర్ 2వతేదీ, బుధవారం మంచిర్యాలలో, డిసెంబర్ 4వ తేదీ శుక్రవారం జనగామ త్రిలింగేశ్వర స్వామి వారి చెంత,డిసెంబర్ 7వ తేదీ సోమవారం ధర్మాపురి లక్ష్మీనరసింహస్వామి వారి సన్నిధిలో ఈ మహత్తర మహా హారతి కార్యక్రమాన్ని నిర్వహించనున్నామని కావున భక్తులు అధిక సంఖ్యలో ఆయా ప్రాంతాలలో నిర్వహించే మహా హారతి కార్యక్రమాలలో పాల్గొని గోదావరి మాత ఆశీస్సులు పొందగలరని కోరుతున్నాము.

మొదటి పేజీ తరువాయి పెట్టుబడిదారులకు భారత్ భరోసా

అప్పట్లో ఆంధ్ర ప్రాంత పాలకుడైన కాకతీయ రాజు గణపతి దేవుడు అప్పట్లోనే విదేశీ పెట్టుబడిదారులకు విశ్వాసం కల్పించేలా కొన్ని శాసనాలు చేశారు. అప్పుడూ ఇప్పుడూ భారత్ విదేశీ పెట్టుబడిదారులకు విశ్వసనీయమైన భాగస్వామిగా ఉంది. భారత జీడీపీ పెరుగుదలలో విదేశీ పెట్టుబడులకు నైపుణ్యం ఉన్న యువత కూడా అంతే స్థాయిలో సహకారం అందిస్తున్నాయి. భారతీయ యువత ప్రపంచ వ్యాప్తంగా వివిధ దేశాల్లో తమ నైపుణ్యాలను ప్రదర్శిస్తున్నారు. విశాఖ నగరం స్టీల్ నుంచి సిలికాన్ సిటీగా ఎదుగుతోంది. ఓర్వకల్లు, పూడిమడక లాంటి ప్రాంతాల్లో గ్రీన్ ఎనర్జీ కేంద్రాలుగా మారుతున్నాయి. ఇంటలెక్చువల్ ప్రాపర్టీ రైట్స్ ను భారత్ పూర్తిగా గౌరవిస్తుంది. సహకారం అందిస్తుందని అన్నారు.

కోతులు, వీధి కుక్కల బెడదతో ప్రజల భయాందోళన



- స్కూల్ కి వెళ్లాలంటే భయపడుతున్న పిల్లలు.... వృద్ధులు..

(మహబూబాబాద్, సాక్షర): గార్ల స్థానికమేజర్ గ్రామపంచాయతీ లో కోతులు, వీధి కుక్కల బెడద రోజురోజుకూ పెరుగుతుండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గ్రామంలోని పలు వీధుల్లో కోతుల గుంపులు, వీధి కుక్కలు స్వేచ్ఛగా సంచరిస్తుండటంతో చిన్నారులు, వృద్ధులు బయటకు రావాలంటే యపడుతున్నారు. కోతులు ఇళ్లలోకి చొరబడి ఆహార పదార్థాలను ఎత్తుకెళ్లడంతో పాటు, వీధుల్లో ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయని స్థానికులు చెబుతున్నారు. మరోవైపు వీధి కుక్కలు గుంపులుగా సంచరిస్తూ రాకపోకలు సాగించే ప్రజలను వెంటపడుతుండటంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చిన్నారులు పాఠశాలలకు వెళ్లే సమయంలో కుక్కల బెడద ఎక్కువగా ఉంటోందని, వృద్ధులు సైతం అవసరమైన పనుల కోసం బయటకు రావడానికి ఇబ్బందులు పడుతున్నారని గ్రామస్తులు తెలిపారు. మార్కెట్ ప్రాంతాల్లోనూ ఇదే పరిస్థితి నెలకొని ప్రజలకు తీవ్ర అసౌకర్యం కలుగుతోంది. ప్రజల భద్రత దృష్ట్యా పంచాయతీ అధికారులు తక్షణమే స్పందించి కోతులను నియంత్రించడంతో పాటు వీధి కుక్కల నివారణకు చర్యలు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

నవంబర్ 15 నుండి 18 వరకు నల్లగొండలో జరిగే అఖిలభారత రైతు మహాసభలను జయప్రదం చేయండి...


- కుమ్మరికుంట్ల నాగన్న సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు...



(మహబూబాబాద్, సాక్షర): నవంబర్ 15 నుండి 18 వరకు తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట కేంద్రమైన నల్లగొండ జిల్లా కేంద్రంలో నిర్వహించనున్న అఖిలభారత కిసాన్ సభ (ఏఐకేఎస్) 36వ అఖిలభారత మహాసభల సందర్భంగా 15న జరిగే రైతు బహిరంగ సభను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు కుమ్మరి కుంట్ల నాగన్న పిలుపునిచ్చారు గురువారం నాడు సిఐటియు ఆధ్వర్యంలో పట్టణంలోని అన్ని హమాలి అడ్డల దగ్గర వ్యవసాయ మార్కెట్లో కరపత్రాలు పంచుతూ విస్తృతంగా ప్రచారం నిర్వహించడం జరిగింది.ఈ సందర్భంగా నాగన్న మాట్లాడుతూ దేశవ్యాప్తంగా 1.58 కోట్లకు పైగా సభ్యత్వం తో అఖిలభారత కిసాన్ సభ ప్రపంచంలో నే అతిపెద్ద రైతాంగ ఉద్యమ సంస్థగా కొనసాగుతుంది అని అన్నారు రైతాంగ హక్కుల కోసం నిరంతరం పోరాడుతుందన్నారు దేశంలో బిజెపి ప్రభుత్వం వచ్చిన తర్వాత రైతులపై మూడు నల్ల చట్టాలు తీసుకురావడం జరిగిందని మండిపడ్డారు అదేవిధంగా కార్మికులపై పోరాడి సాధించుకున్న 29 కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్స్ గా తీసుకోవచ్చి కార్మిక హక్కులని కాల రాస్తుందన్నారు కాబట్టి 15 తారీకు నాడు జరగబోయే నల్లగొండలో రైతు సంఘం భారీ బహిరంగ సభకు హమాలీలు కూలీలు మున్సిపాలిటీ కార్మికులు గ్రామపంచాయతీ కార్మికులు సెక్యూరిటీ గార్డు బిల్డింగ్ రంగం కార్మికులు హెయిర్ బస్ కార్మికులు సోడా కార్మికులు స్ట్రీట్ వైన్డర్స్ కార్మికులు ఆ బహిరంగ సభలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు... ఈ కార్యక్రమంలో నవీను వెంకన్న సేవ్య బాలు హరి రవి హేమ జనార్దన్ సారయ్య వెంకటేష్ రాజు మోహన్ కృష్ణ లక్ష్మణ్ కోటేష్ ఉపేందర్ రమేష్ సురేందర్ సుక్య యాకన్న లాలు సూర్య నాగరాజు రాజేష్ మదన్ గోపాల్ తదిరులు పాల్గొన్నారు

సీరియల్ కిల్లర్ గర్ల్‌ఫ్రెండ్‌కు..

- సోనియా ఇంటి నుంచి భోజనం..



మాజీ ప్రధాని ఇందిరాగాంధీ కొంతకాలం తిహాడ్ జైల్లో ఉన్న సంగతి తెలిసిందే. ఆ సమయంలో ఆమె కోసం సోనియా గాంధీ ఇంటి నుంచి భోజనం తీసుకెళ్లేవారు. అలా ఓ సందర్భంలో సీరియల్ కిల్లర్ చార్లెస్ శోభరాజ్ గర్ల్‌ఫ్రెండ్‌కు కూడా భోజనం పంపించారట. ఈ విషయాన్ని తన ఆత్మకథ 'బిలాంగింగ్: ఎ జర్నీ ఆఫ్ లవ్'లో సోనియా పేర్కొన్నారు. ''తిహాడ్ జైల్లో ఉన్నప్పుడు అత్తమ్మ (ఇందిరా గాంధీ) తనతో పాటు మరికొంతమందికి కూడా భోజనం తీసుకురమ్మని చెప్పేవారు. అలా ముగ్గురు మహిళా గార్డులు, జైల్లో ఖైదీగా ఉన్న ఓ విదేశీ యువతికీ నేను ఓసారి భోజనం తీసుకెళ్లా. ఆ యువతి ఎవరో కాదు.. భారత్‌తో సహా థాయ్‌లాండ్, నేపాల్‌లో ఎంతోమందిని హత్య చేసిన కేసులో దోషిగా ఉన్న చార్లెస్ శోభరాజ్ గర్ల్‌ఫ్రెండ్. ఆ విషయం తర్వాత తెలిసింది'' అని సోనియా తన పుస్తకంలో రాసుకొచ్చారు. అయితే, ఆ యువతి పేరును మాత్రం కాంగ్రెస్ నాయకురాలు పేర్కొనలేదు. భారత్-వియత్నాం సంతతికి చెందిన చార్లెస్ శోభరాజ్ 1970ల్లో ఆసియాలోని అనేక దేశాల్లో పలు హత్యలకు పాల్పడ్డాడు. 1976 జులైలో అతడితో పాటు ముగ్గురు మహిళలను భారత పోలీసులు అరెస్ట్ చేసి తిహాడ్ జైలుకు తరలించారు. అందులో శోభరాజ్ గర్ల్‌ఫ్రెండ్ మేరీ ఆండ్రీ లెక్లెర్క్ ఒకరు. ఈ కేసుల్లో నిందితురాలిగా ఉన్న ఆమె క్యాన్సర్ బారిన పడటంతో 1983లో కెనడాకు తిరిగి వెళ్లేందుకు న్యాయస్థానం అనుమతించింది. ఆ మరుసటి ఏడాది ఆమె మరణించింది. ఇక, 1986లో శోభరాజ్ తిహాడ్ నుంచి తప్పించుకోగా.. మళ్లీ అరెస్టు చేసి 1997లో బెయిల్‌పై విడుదల చేశారు. 2004లో ఓ హత్య కేసుకు సంబంధించి నేపాలీ కోర్టు అతడిని దోషిగా తేల్చి శిక్ష విధించింది. 2022లో జైలు నుంచి విడుదలైన అతడు.. ఫ్రాన్స్‌కు వెళ్లిపోయాడు. ఇదిలా ఉండగా.. ఎమర్జెన్సీ తర్వాత 1978లో ఏర్పడిన జనతా ప్రభుత్వం.. ఇందిరా గాంధీ ని జైలుకు పంపిన సంగతి తెలిసిందే. కొన్ని రోజుల పాటు తిహాడ్ జైల్లో ఉన్న ఆమె డిసెంబరు 26న విడుదలయ్యారు. ఆ తర్వాత 1980లో మళ్లీ అధికారంలోకి వచ్చారు.

భూగర్భ జలాల పెంపునకు ఇంకుడు గుంతలు తప్పనిసరి ఎంపీడీవో పుల్లారావు



(నార్నూర్, సాక్షర): : వర్ష భావ పరిస్థితులను అధిగమించడానికి భూగర్భ జలాల పెంపునకు ఇంకుడు గుంతలు తప్పనిసరిగా నిర్మించాలని ఎంపీడీవో పుల్లారావు సూచించారు. గురువారం ఆదిలాబాద్ జిల్లా నార్నూర్ మండల కేంద్రంలోని మండల ప్రజా పరిషత్ సమావేశ మందిరంలో ఎంపీడీవో అధ్యక్షతన మండల ఇస్థాయి సమావేశాన్ని నిర్వహించారు. ఆయా శాఖల అధికారులు మండల ప్రగతిని వెల్లడించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ.. ప్రజా ప్రతినిధులు, అధికారులు సమన్వయంతో మండల అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. ఎల్ నినో ప్రభావంతో నీటి జలాలు తగ్గుముఖం పట్టే అవకాశాలు ఉన్నాయని, నీటిని వృథా కాకుండా చూడాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. వృథా నీటిని అరికట్టేందుకు ఇంకుడు గుంతలు నిర్మించుకొవాలన్నారు. ప్రతి సమస్యను సమన్వయంతో పరిష్కరించి ప్రజలు ఇబ్బంది పడకుండా కృషి చేద్దామన్నారు. ఈ సమావేశంలో ఆర్డబ్ల్యూఎస్ డీఈ శ్రీనివాస్, ఎంపీఓ మహేష్, ఏవో ఆకాష్, ఆయా శాఖ అధికారులు, సర్పంచులు ఉన్నారు.

బుల్లెట్ గాయాలతో పోలీసుల మృతదేహాలు.. ఆయుధాలు మిస్సింగ్..



(శ్రీనగర్, సాక్షర): జమ్మూకశ్మీర్‌లో ఇద్దరు స్పెషల్ పోలీసు ఆఫీసర్లు అనుమానాస్పద స్థితిలో ప్రాణాలు కోల్పోవడం కలకలం రేపింది. కిశ్త్వాడ్ జిల్లాలో నిన్న (నవంబరు 11) విధులు నిర్వర్తిస్తూ అదృశ్యమైన వీరు.. గురువారం ఉదయం అటవీ ప్రాంతంలో విగతజీవులుగా కన్పించారు. వారి శరీరంపై బుల్లెట్ గాయాలున్నట్లు అధికారులు వెల్లడించారు. స్పెషల్ ఆపరేషన్స్ గ్రూప్‌నకు చెందిన బాబీ చాంద్ (57), రశ్‌పాల్ కుమార్ (45).. బుధవారం మధ్యాహ్నం తమ క్యాంప్ నుంచి ధర్నా-మర్వా ప్రాంతంలోని ఆర్మీ పోస్ట్‌కు బయల్దేరారు. మార్గమధ్యంలో మధ్యాహ్నం 3.30 గంటల ప్రాంతంలో వీరికి దచన్ అటవీ ప్రాంతం నుంచి శబ్దాలు వినిపించాయి. దీంతో అటుగా వెళ్లిన వీరిద్దరూ మళ్లీ తిరిగిరాలేదు. అదే సమయంలో మొబైల్ నెట్‌వర్క్ సర్వీసులు కూడా పనిచేయకపోవడం గమనార్హం. వీరు అదృశ్యమైనట్లు నిర్ధరించుకున్న ఆర్మీ బలగాలు అటవీ ప్రాంతంలో ముమ్మర గాలింపు చేపట్టాయి. ఈ క్రమంలోనే గురువారం ఉదయం వీరి మృతదేహాలను భద్రతా సిబ్బంది గుర్తించారు. ఘటనాస్థలంలో పోలీసు ఆఫీసర్ల సర్వీసు తుపాకులు కన్పించలేదని అధికారులు వెల్లడించారు. దీంతో ఉగ్రకోణం ఉండొచ్చని అనుమానిస్తున్నారు. ఉగ్రవాదులు వీరిని కిడ్నాప్ చేసి హత్య చేసి ఉండొచ్చని అధికారులు పేర్కొన్నారు. ఈ ప్రాంతంలో నిర్బంధ తనిఖీలు చేపట్టినట్లు వెల్లడించారు. కాగా.. జమ్మూకశ్మీర్‌లోని కుల్గామ్ జిల్లాలో నిన్న సీఆర్పీఎఫ్ శిబిరంపై ఉగ్రదాడి జరిగిన సంగతి తెలిసిందే. బుధవారం మధ్యాహ్నం 2 గంటల సమయంలో మోటార్ సైకిళ్లపై వచ్చిన ఇద్దరు ఉగ్రవాదులు చెక్‌పోస్ట్ వద్ద ఉన్న సీఆర్పీఎఫ్ సిబ్బందిపై కాల్పులు జరిపి పరారయ్యారు. దాదాపు అదే సమయంలో కిశ్త్వాడ్‌లో పోలీసులు అదృశ్యమై ప్రాణాలు కోల్పోవడం గమనార్హం. ఈ రెండు ఘటనలకు ఏదైనా సంబంధం ఉందా? అన్న కోణంలో పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

మొదటి పేజీ తరువాయి కరువు మండలాల్లో రుణాల వసూళ్లకు బ్రేక్

ఈ సమావేశంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క బ్యాంకర్లతో మాట్లాడారు. కరువు కారణంగా పంటలు దెబ్బతిని ఇబ్బందులు పడుతున్న రైతుల నుంచి ప్రస్తుతం ఉన్న రుణాలను వెంటనే వసూలు చేయకుండా మారటోరియం అమలు చేయాలని కోరారు. అలాగే రానున్న రబీ సీజన్‌లో సాగు పనుల కోసం రైతులకు కొత్త రుణాలు కూడా ఇవ్వాలని సూచించారు.బ్యాంకర్ల సమావేశంలో తీసుకున్న నిర్ణయం ప్రకారం.. ఓ మోస్తరు కరువు ఉన్న 254 మండలాల్లో రైతుల రుణాల వసూళ్లను 12 నెలల పాటు నిలిపివేస్తారు. ఈ రుణాలను తిరిగి చెల్లించేందుకు రైతులకు 36 నెలల గడువు కల్పిస్తారు. అంటే మూడేళ్లలోపు రుణాలను చెల్లించాల్సి ఉంటుంది. అదే తీవ్ర కరువు పరిస్థితులు ఉన్న 111 మండలాల్లోనూ 12 నెలల పాటు రుణాల వసూళ్లు నిలిపివేస్తారు. అయితే ఈ మండలాల రైతులకు రుణాల చెల్లింపునకు 60 నెలల గడువు ఇవ్వనున్నారు. అంటే ఐదేళ్లలోపు రుణాలు తిరిగి చెల్లించే అవకాశం ఉంటుంది.మరో ముఖ్యమైన విషయం ఏమిటంటే.. మారటోరియం కోసం రైతులు ప్రత్యేకంగా ముందుకొచ్చినా, రాకపోయినా బ్యాంకులే అర్హులైన రైతులను గుర్తించి ఉపశమన చర్యలు చేపట్టనున్నాయి. రైతుల బ్యాంకు ఖాతాలను పరిశీలించి అర్హులకు మారటోరియం అమలు చేయడంతో పాటు రబీ సీజన్‌కు కొత్త రుణాలు కూడా మంజూరు చేయనున్నారు.ఫామ్‌లు అన్వేషించండిమారటోరియం అమలయ్యే 12 నెలల కాలానికి రైతుల రుణాలపై పడే వడ్డీ భారాన్ని తగ్గించాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. ఇందుకోసం ఆ వడ్డీని రాయితీ రూపంలో సర్దుబాటు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరనుంది. రాష్ట్రంలో నెలకొన్న కరువు పరిస్థితుల వివరాలను 15 రోజుల్లోగా రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) సీఐఎంఎస్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలని రాష్ట్ర బ్యాంకర్ల సమావేశం నిర్ణయించింది.

మొదటి పేజీ తరువాయి ఎన్విడియా సీఈఓ జెన్సన్ హువాంగ్‌ను నియమించుకోవడం గౌరవంగా భావిస్తా:ఎలాన్ మస్క్

ఈ తరానికి చెందిన గొప్ప వ్యాపారవేత్తల్లో హువాంగ్ ఒకరని మాగ్నెట్ ప్రశంసించారు. అయితే ఆయన ఓ తీవ్రమైన తప్పు చేశారని, అది అమెరికాకు నష్టదాయకమని పేర్కొన్నారు. హువాంగ్ చర్యల వెనుక దురుద్దేశం ఉండకపోవచ్చని అభిప్రాయపడ్డారు. అమెరికా ఏఐ రంగానికి హువాంగ్ లాంటి నాయకుడు భర్తీ చేయలేనివారని రాశారు. మరోవైపు హువాంగ్ వ్యక్తిగత వ్యవహారాలపై వస్తున్న ఆరోపణలతో ఎన్విడియాలో ఆయన భవిష్యత్తుపై చర్చ మొదలైంది. కంపెనీ బోర్డు బుధవారం సమావేశమై ఆయన్ను పదవిలో కొనసాగించడంపై నిర్ణయం తీసుకోనున్నట్లు వార్తలు వచ్చాయి. ఉద్యోగులకు పంపిన ఈమెయిల్‌లో హువాంగ్ వివాహేతర సంబంధాన్ని అంగీకరించడంతో బోర్డు ఇప్పటికే స్వతంత్ర విచారణ చేపట్టినట్లు సమాచారం. ఎన్విడియా వైస్ ప్రెసిడెంట్ కింబర్లీ పావెల్‌తో హువాంగ్‌కు సంబంధం ఉన్నట్లు వార్తలు వచ్చాయి. అంతకుముందు చైనా అధికారిణిగా పనిచేసిన ఆలిస్ హువాంగ్ (హువాంగ్ లీ)తోనూ సంబంధం ఉందని, ఆమె చైనా గూఢచారి అయి ఉండొచ్చని అమెరికా నిఘా సంస్థలు భావిస్తున్నట్లు కొన్ని కథనాలు పేర్కొన్నాయి. ఈ పరిణామాల నేపథ్యంలో న్యూయార్క్‌లో బుధవారం మార్కెట్ ముగిసిన తర్వాత జరిగిన ట్రేడింగ్‌లో ఎన్విడియా షేర్లు ఒక దశలో 10 శాతం వరకు పడిపోయాయి. ఐదు రోజుల వ్యవధిలో 13 శాతం నష్టపోయాయి. ఈ పతనం కొనసాగితే కంపెనీ మార్కెట్ విలువ 4 లక్షల కోట్ల డాలర్ల దిగువకు చేరే అవకాశం ఉందని నివేదికలు పేర్కొన్నాయి.

మొదటి పేజీ తరువాయి కేసీఆర్ స్థానంలో కేటీఆర్.. రేవంత్ గురి ఎటు?

అదే సమయంలో, తెలంగాణ సంప్రదాయ రాజకీయాల్లో మాస్ శైలికి పెద్దపీట ఉంటుంది. కేటీఆర్ అర్బన్, కార్పొరేట్ లుక్‌కు భిన్నంగా తన పక్కా మాస్, తెలంగాణ రఫ్ అండ్ టఫ్ ఇమేజ్‌ను బలంగా చాటుకోవాలని రేవంత్ ప్రయత్నిస్తున్నారు. నేను కేడర్ నుంచి వచ్చిన మాస్ లీడర్‌ను, కేటీఆర్ అలా కాదు అనే సందేశాన్ని ప్రజల్లోకి పంపడానికే ఆయన ఈ తరహా పోలికలను తీసుకొస్తున్నారు.అయితే, ఈ విమర్శల నాణేనికి మరోవైపు కూడా ఉంది. ప్రతిపక్షం లేవనెత్తే మూసీ ప్రక్షాళన, గ్యారెంటీ అమ్యూరెన్స్‌లు, విద్యుత్, నీటి సమస్యలు వంటి విధానపరమైన ప్రశ్నలకు సమాధానం ఇవ్వకుండా, వ్యక్తిగత అంశాలపై పడటం కాంగ్రెస్ ప్రభుత్వ డిఫెన్సివ్ మైండ్ సెట్‌ను చూపుతోందని బీఆర్ఎస్ ఎదురుదాడి చేస్తోంది. పరిపాలనాంశాలపై కంటే ఇలాంటి వ్యక్తిగత పోరు ఎక్కువైతే, అది చివరికి ప్రజా సమస్యల చర్చను పక్కదారి పట్టిస్తుంది. రేవంత్ రెడ్డి వేస్తున్న ఈ వ్యక్తిగత బాణాలు కేటీఆర్‌ను సైకలాజికల్‌గా దెబ్బతీసేందుకు వేసిన స్కెచ్ కావచ్చు, లేదా కేసీఆర్ లేని లోటును కేటీఆర్‌కు అప్పగిస్తూ ఆయన్ను ప్రధాన ప్రత్యర్థిగా నిలబెట్టే వ్యూహం కావచ్చునని అంచనా వేస్తున్నారు. ప్రత్యేక వ్యూహాలతో గ్రౌండ్ వర్క్ తెలంగాణ రాజకీయాల్లో ప్రస్తుతం పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల వేడి తారాస్థాయికి చేరుకుంటోంది. అధికార, ప్రతిపక్ష పార్టీలు ఈ ఎన్నికలను అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుంటున్నాయి. ఏమాత్రం అవకాశం ఇవ్వకుండా ప్రత్యర్థులపై పైచేయి సాధించాలని పావులు కదుపుతున్నాయి. అయితే, అందరికంటే ముందుగానే అలర్ట్ అయ్యి, ప్రత్యేక వ్యూహాలతో గ్రౌండ్‌వర్క్ ప్రారంభించిన ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్‌లో మాత్రం ఇప్పుడు సరికొత్త చర్చ నడుస్తోంది. పార్టీ అధినాయకత్వం ఎంత గట్టిగా ఫ్లాన్ చేసినా, క్షేత్రస్థాయిలో ఇన్చార్జుల నుంచి వస్తున్న స్పందన మాత్రం గులాబీ బాస్‌లకు షాకిస్తోంది. ఈ రెండు పట్టభద్రుల స్థానాల పరిధిలోని దాదాపు 40 నుంచి 50 అసెంబ్లీ నియోజకవర్గాల్లో విస్తృతంగా పర్యటించాలని పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ భావించారు. పట్టభద్రుల ఓటరు నమోదు కార్యక్రమం ఊపందుకునేలా ప్రతి నియోజకవర్గంలోనూ ఒక భారీ సన్నాహక సమావేశం ఏర్పాటు చేయాలని, తాను స్వయంగా వాటికి హాజరవుతానని కూడా ఆయన స్పష్టం చేశారు. కానీ, ఆచరణలోకి వచ్చేసరికి ఆ ప్లాన్‌కు అనూహ్యంగా బ్రేక్ పడింది. అభ్యర్థి ఎవరో ఖరారు కాకుండా నియోజకవర్గ స్థాయి సన్నాహక సమావేశాలు పెట్టడం కష్టమని, పైగా ఈ భారాంతా తమ భుజాల మీదే వేసుకోవడం ఇబ్బందికరమని ఇన్చార్జులు భావిస్తున్నట్లు పార్టీ వర్గాల్లో జోరుగా చర్చ సాగుతోంది. నియోజకవర్గాల వారీగా సన్నాహక సమావేశాలు అంటే మాటలు కాదని గులాబీ నేతలు లెక్కలు వేస్తున్నారు. భారీ హాల్స్ బుకింగ్స్, కార్యకర్తలకు భోజనాలు, ఇతర ఏర్పాట్ల కోసం తడిసిమోపెడవుతుందని వారు అందోళన చెందుతున్నారు. కేవలం రెండు మూడు నెలల క్రితమే ఎస్ఐఆర్ సన్నాహక సమావేశాల పేరుతో తాము భారీగా ఖర్చు పెట్టామని, అప్పట్లో కేటీఆర్, హరీష్ రావుల పర్యటనల కోసం జేబులు గుల్ల చేసుకున్నామని నేతలు వాపోతున్నారట. ఇప్పుడు మళ్లీ ఎమ్మెల్సీ ఎన్నికలంటూ భారీ సభలు పెట్టి లక్షల రూపాయలు ఖర్చు పెట్టే ఆర్థిక పరిస్థితి లేదని, ఁడబ్బులేమన్నా ఊరికే వస్తున్నాయా?ఁ అంటూ ఇన్చార్జులు అంతర్గతంగా పెదవి విరుస్తున్నట్లు సమాచారం. ఖర్చుల భయంతో పాటు రాబోయే రోజుల్లో జరిగే నియోజకవర్గాల పునర్విభజన అంశం కూడా నేతలను వెనకడుగు వేసేలా చేస్తోంది. భవిష్యత్తులో తమ పరిధిలో ఏయే మండలాలు ఉంటాయో, ఏవి మారుతాయో ఇప్పుడే స్పష్టత లేని పరిస్థితుల్లో.. కేవలం ఓటర్ల నమోదు కోసం ఇప్పుడు భారీగా ఖర్చు పెట్టడం దండుగ మారి పనేనని నేతలు భావిస్తున్నారు. అసెంబ్లీ ఎన్నికలకు ఇంకా రెండేళ్ల సమయం ఉందన్న ఆలోచనతో, ఇప్పటికప్పుడు భారీగా నిధులు ఖర్చు చేయడం అనవసరమని అధిష్టానానికి తేల్చిచెప్పినట్లు గులాబీ శిబిరంలో గుసగుసలు వినిపిస్తున్నాయి. ఇక ఇన్చార్జుల నుంచి స్పందన మందగించడాన్ని గమనించిన అధిష్టానం కూడా పరిస్థితిని అర్థం చేసుకున్నట్లు తెలుస్తోంది. భారీ సభలు, ఆర్భాటాలకంటే కేవలం ఓటర్ల నమోదు ప్రక్రియే ముఖ్యమని భావించి పెద్ద ఎత్తున సమావేశాలు పెట్టాలనే ఆలోచనను పక్కనపెట్టింది. నియోజకవర్గాల వారీగా కాకుండా, మండల స్థాయిలోనే సింపుల్‌గా సమావేశాలు నిర్వహించు కోవాలని గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు సమాచారం. మరోవైపు, ముందుగా అభ్యర్థిని ప్రకటించి, ఆ తర్వాత మీటింగ్‌లు పెడితేనే క్యాడర్‌లో జోష్ వస్తుందని, లేదంటే అనవసర ప్రయాస అవుతుందనే వాదనకు పార్టీ పెద్దలు కూడా సుముఖత చూపినట్లు తెలుస్తోంది. మొత్తానికి, దబ్బులైవ్ అంటూ ఇన్చార్జులు చూపిన నిరాసక్తత ఇప్పుడు బీఆర్ఎస్ వ్యూహాత్మక సర్దుబాట్లకు కారణమవుతోంది.

లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ చేసిన శాసనసభ్యుడు మహేశ్వర్ రెడ్డి



(నిర్మల్ ప్రతినిధి, సాక్షర): లక్ష్మణచందా మండలాలకు చెందిన లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాల కింద మంజూరైన చెక్కులను భారతీయ జనతా పార్టీ శాసనసభాపక్ష నేత, నిర్మల్ శాసనసభ్యుడు ఏలేటి మహేశ్వర్ రెడ్డి గురువారం పంపిణీ చేశారు.సోన్ మండలంలో 19 మంది లబ్ధిదారులకు 19,02,204 రూపాయల విలువైన చెక్కులను, లక్ష్మణచందా మండలంలో 51 మంది లబ్ధిదారులకు 51,05,916 రూపాయల విలువైన చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారులకు శుభాకాంక్షలు తెలియజేశారు.కార్యక్రమాల్లో స్థానిక ప్రజాప్రతినిధులు, సోన్ మండల అధ్యక్షుడు మార గంగారెడ్డి, లక్ష్మణచందా మండల అధ్యక్షుడు చిన్నయ్య, సర్పంచులు, భారతీయ జనతా పార్టీ నాయకులు, సంబంధిత అధికారులు, లబ్ధిదారుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

మొదటి పేజీ తరువాయి డిసెంబర్ నుంచి డేంజర్ బెల్స్...

చలికాలం ముగిసేలోపే అంటే సరిగ్గా డిసెంబర్ నెల నుంచే హైదరాబాద్‌కు 'కన్నీటి' కష్టాలు మొదలు కానున్నాయనే వార్త తెలంగాణ ప్రజలను.. ముఖ్యంగా నగరవాసులను తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది. ఒకప్పుడు నిండుగా ప్రవహించే చెరువులు.. కుంటలతో కళకళలాడిన హైదరాబాద్ తాగునీటి వనరులు ఇప్పుడు బొట్టు నీటికి కూడా అల్లాడే పరిస్థితి దాపురిస్తోంది. హైదరాబాద్‌కు ప్రధానంగా తాగునీటిని అందించే సింగూరు.. మంజీరా జలాశయాల్లో నీటి నిల్వలు మునుపెన్నడూ లేనంతగా క్షీణించి పోతున్నాయి. డిసెంబర్ నాటికి ఈ రిజర్వాయర్లలో నీటి మట్టం కేవలం 10 శాతానికి పడిపోయే ప్రమాదం ఉందన్న జలమండలి అంచనాలు గుండెల్లో రైళ్లు పరుగెత్తిస్తున్నాయి. ఈ నీటి సంక్షోభం ప్రభావం ప్రధానంగా పశ్చిమ హైదరాబాద్‌లోని ఐటీ సిటీలో భాగమైన హైటెక్ సిటీ, గచ్చిబౌలి, కొండాపూర్, నార్సింగి, కోకాపేట వంటి ఐటీ హబ్‌లపై దారుణంగా పడనుంది. శేరిలింగంపల్లిలో ఏకంగా 80 శాతం.. జూబ్లీహిల్స్‌లో 50 శాతం వరకు నీటి సరఫరా నిలిచిపోయే అవకాశాలు కనిపిస్తున్నాయి. రోజుకు సుమారు 10 కోట్ల గ్యాలన్ల నీటి లోటు ఏర్పడితే.. ఉదయాన్నే లేచి కుళాయి తిప్పితే చుక్క నీరు రాకపోతే.. పిల్లలను స్కూళ్లకు.. ఉద్యోగాలకు పంపే కుటుంబాల పరిస్థితి ఎంత నరకప్రాయంగా మారుతుందో ఊహించుకోవడానికే భయమేస్తోంది. రూ.కోట్లు వెచ్చించి కొనుక్కున్న ఫ్లాట్లు.. 40 అంతస్తుల విలాసవంతమైన ఫ్లాట్లు ఉన్నా.. గొంతు తడుపుకోవడానికి గుక్కెడు నీళ్లు లేకపోతే ఆ అభివృద్ధికి అర్థమేముంది? వందల అడుగులు తవ్వినా భూగర్భ జలాలు ఊరని పరిస్థితి నెలకొంటుంది.. రోజువారీ అవసరాల కోసం ట్యాంకర్ల వెంట బకెట్లతో పరుగులు తీయాల్సిన దుస్థితి వస్తే సామాన్య.. మధ్యతరగతి కుటుంబాల బతుకులు మరింత భారమవుతాయి. కనీస అవసరమైన మంచి నీరు కూడా ఖరీదైన వ్యాపారంగా మారిపోకముందే.. ప్రభుత్వం, జలమండలి అధికారులు తక్షణమే స్పందించాలి. ప్రత్యామ్నాయ గోదావరి జలాల తరలింపు వేగవంతం చేసి.. లీకేజీలను అరికట్టి నగర దాహార్తిని తీర్చకపోతే.. నగరంలో వికాసం కాదు.. వినాశనమే మిగులుతుంది. ఎందుకంటే ఎన్ని ఫ్లైఓవర్లు కట్టినా.. ఎన్ని ఆకాశహర్మ్యాలు నిర్మించినా చివరకు మనిషికి కావాల్సింది గుక్కెడు మంచినీళ్లే..

రైతు కుటుంబాలను వేధిస్తే సహించేది లేదు..

- బ్యాంకు అధికారుల తీరుపై బీఆర్ఎస్ ఆగ్రహం.. రైతులకు అండగా ఉంటాం : విజ్జగిరి నారాయణ



(ఆదిలాబాద్ టౌన్, సాక్షర) బ్యాంకు రుణాల వసూళ్ల పేరుతో రైతు కుటుంబాలను మానసికంగా వేధించడం తగదని బీఆర్ఎస్ పార్టీ ఉపాధ్యక్షుడు విజ్జగిరి నారాయణ డిమాండ్ చేశారు. చాందా గ్రామంలో బ్యాంకు అధికారుల వేధింపులకు గురవుతున్న లంకా ప్రవీణ్, చిందం రమాకాంత్, గండ్రత్ దేవన్నతో పాటు పలువురు రైతు కుటుంబాలను బీఆర్ఎస్ పార్టీ నాయకులు కలిసి వారి పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. బాధిత కుటుంబాలకు అండగా ఉంటామని భరోసా కల్పించారు. అనంతరం గ్రామపంచాయతీ కార్యాలయం ఎదుట రైతు కుటుంబాలకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ నిరసన కార్యక్రమం చేపట్టారు.ఈ సందర్భంగా విజ్జగిరి నారాయణ మాట్లాడుతూ ఎల్ నినో ప్రభావంతో ఆదిలాబాద్ జిల్లా రైతాంగం తీవ్రంగా నష్టపోయిందని, పంట దిగుబడులు పూర్తిగా పడిపోయి రైతులు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. గతంలో ఎకరాకు పది క్వింటాళ్ల వరకు దిగుబడి వచ్చేదని, ప్రస్తుతం ఒకటి రెండు క్వింటాళ్లు కూడా వచ్చే పరిస్థితి లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి విపత్కర పరిస్థితుల్లో రైతులకు అండగా నిలవాల్సిన బ్యాంకు అధికారులు రుణాల రికవరీ పేరుతో ఇళ్లకు వెళ్లి ఒత్తిడి చేయడం, బంగారు ఆభరణాలు, ఆస్తులు జప్తు చేస్తామంటూ బెదిరించడం దుర్మార్గమని మండిపడ్డారు.కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే రైతులకు రూ. 2 లక్షల రుణమాఫీ చేస్తామని హామీ ఇచ్చి రైతులను మోసం చేసిందని విమర్శించారు. పంటలు ఎండిపోయి రైతులు తీవ్ర ఇబ్బందుల్లో ఉన్న నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం కరువు ప్రాంతంగా ప్రకటించినప్పటికీ బ్యాంకు అధికారుల వేధింపులు మాత్రం ఆగడం లేదన్నారు.ఒకవైపు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క బ్యాంకు అధికారులతో సమావేశాలు నిర్వహిస్తూ రైతులకు సహకరించాలని సూచిస్తుంటే, మరోవైపు క్షేత్రస్థాయిలో రైతు కుటుంబాలు రికవరీల పేరుతో మానసిక వేదనకు గురవుతున్నాయని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే జోక్యం చేసుకుని బ్యాంకు అధికారుల వేధింపులను అరికట్టాలని డిమాండ్ చేశారు.రైతులు ఎట్టి పరిస్థితుల్లోనూ సహనాన్ని కోల్పోవద్దని, వారికి బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. రైతు కుటుంబాలను ఆత్మహత్యల దిశగా నెట్టేలా మానసిక ఒత్తిడికి గురిచేయడం సమంజసం కాదన్నారు. ప్రభుత్వం స్పందించి రైతులకు న్యాయం చేయకపోతే మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత జోగు రామన్న ఆధ్వర్యంలో రైతుల పక్షాన పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ అఖిలేష్, కో రెడ్డి ప్రవీణ్, దాసరి రమేష్, దయానంద్ తదితరులు పాల్గొన్నారు.

గంజాయి మహమ్మారిని తరిమికొడదాం.



గంజాయి మహమ్మారిని తరిమికొట్టే బాధ్యత మనందరిపై ఉందని ఎస్పీ నాయక్ మహారాజ్ ఏలియా సోమ్లాదాదా మోటివేషన్ స్పీకర్ అన్నారు. ఈ మేరకు ఆయన మీడియాతో మాట్లాడుతూ గంజాయి నిర్మూలనపై తాము తెలంగాణలో రాష్ట్ర ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు ఎన్నో ప్రదేశంలో ఇవ్వడం జరిగిందని పేర్కొన్నారు. పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష, డిసిపి బలరాం రెడ్డి ఆదేశాల మేరకు గత సంవత్సర కాలంగా పెద్దపల్లి జిల్లాలో ప్రతి గ్రామంలో ప్రదర్శనలు ఇవ్వడం జరిగిందని అన్నారు. ఈ మహమ్మారిని తరిమికొట్టేందుకు ప్రతి ఒక్కరూ కంకణ బద్ధులై పూనుకోవాలని అన్నారు. ఈ గాంజా మహమ్మారి విద్యార్థుల బతుకులను శీద్రం చేస్తుందని కొన్ని దుష్ట శక్తులు విద్యార్థులను పెడదారిన పట్టించి వారికి గంజాయి అలవాటు చేస్తున్నారని అన్నారు. నేడు గంజాయిని చాక్లెట్ రూపంలో సైతం అందజేయడం జరుగుతుందని తల్లిదండ్రులు ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటే తమ పిల్లల భవిష్యత్తు మారుతుందని లేకుంటే వారి భవిష్యత్తు చీకటి మయంగా మారుతుందని అన్నారు. గంజాయి విక్రయదారులు ముఖ్యంగా కళాశాలలు పాఠశాలల వద్ద మఖాంవేసి విద్యార్థులకు గంజాయి అలవాటు చేస్తున్నారని దీంతో విద్యార్థులు గంజాయి కి బానిసలై పోతున్నారని పేర్కొన్నారు. ఈ మహమ్మారిని తరిమికొట్టేందుకు ప్రతి ఒక్కరూ కంకణం కట్టుకోవాలని లేనియెడల విద్యార్థుల యువత భవిష్యత్తు నాశనం అవుతుందని స్పష్టం చేశారు. ప్రజలను యువతను మేలుకొల్పేందుకే గ్రామాల్లో గంజాయి నిషేధంపై ప్రదర్శనలు ఇవ్వడం జరుగుతుందని స్పష్టం చేశారు. యువత భవిష్యత్తు తమ తల్లిదండ్రుల చేతుల్లోనే ఉందని కాపాడుకోవాల్సిన బాధ్యత మీపై ఉందని పేర్కొన్నారు. ప్రతి విద్యార్థి గంజాయి కి దూరంగా ఉండి ఉన్నత చదువులు చదువుకుంటే మీ జీవితం బంగారు బాట వేస్తుందని ఇకపై గంజాయి మహమ్మారిని యువత తరిమికొట్టాలని సూచించారు.

నిమ్మల బాపురెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించిన డీసీసీ అధ్యక్షుడు డా. నరేష్ జాదవ్



(జైనథ్, సాక్షర): మండలం సాంగ్వి (కే) గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు నిమ్మల బాపురెడ్డి ఇటీవల అనారోగ్యంతో మరణించారు. ఈ విషయం తెలుసుకున్న ఆదిలాబాద్ జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) అధ్యక్షుడు డా. నరేష్ జాదవ్, మాజీ డీసీసీ అధ్యక్షుడు సాజిద్ ఖాన్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ అల్లూరి సంజీవరెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ బోరంచు శ్రీకాంత్ రెడ్డి, గుడిహత్నూర్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు తొడసం దౌలత్ రావు గురువారం వారి స్వగ్రామమైన సాంగ్వి (కే) గ్రామాన్ని సందర్శించి, నిమ్మల బాపురెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించారు.ఈ సందర్భంగా వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ, ధైర్యంగా ఉండాలని భరోసా కల్పించారు. పార్టీ కోసం నిబద్ధతతో పనిచేసిన సీనియర్ నాయకుడు నిమ్మల బాపురెడ్డి సేవలు ఎప్పటికీ మరువలేనివని పేర్కొన్నారు.ఈ సందర్భంగా డీసీసీ అధ్యక్షుడు డా. నరేష్ జాదవ్ మాట్లాడుతూ నిమ్మల బాపురెడ్డి కాంగ్రెస్ పార్టీ అభివృద్ధికి, బలోపేతానికి ఎంతోకాలంగా అంకితభావంతో పనిచేశారని, పార్టీ పట్ల ఆయనకున్న నిబద్ధత, నాయకులు, కార్యకర్తలతో ఆయనకున్న అనుబంధం చిరస్మరణీయమని అన్నారు. ఆయన మరణం కాంగ్రెస్ పార్టీకి తీరని లోటని, వారి కుటుంబానికి పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని తెలిపారు. వారి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థించారు. పరామర్శ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

మొదటి పేజీ తరువాయి జనవరి నుంచి పల్లె యాత్రకు సిద్ధం

ప్రత్యక్ష సభ ద్వారా కాళేశ్వరం నిర్మాణంలో జరిగిన ఆర్థిక, సాంకేతిక లోపాలను ప్రజాక్షేత్రంలో పెట్టాలని భావిస్తున్నారు. బిఆర్ఎస్ తమ హయాంలో సాధించిన అతిపెద్ద విజయంగా చెప్పుకునే కాళేశ్వరాన్ని వైఫల్యాల కాళేశ్వరం గా మార్చడం ద్వారా ప్రతిపక్షాల విమర్శల దాడికి మూలాల్లోనే గండికొట్టాలనేది తాడేపల్లి-హైదరాబాద్ పొలిటికల్ డిజైన్. అసెంబ్లీలో కేసీఆర్ మార్క్ ప్రాజెక్టుల గుట్టు విప్పి, పల్లెల్లో ప్రజాబలం ద్వారా ప్రజలను మమేకం చేయడం ఈ రెంటెడ్ వ్యూహంఅదే సమయంలో, పల్లెబాట ద్వారా కాంగ్రెస్ పార్టీ అంతర్గత సమీకరణాలను చక్కదిద్దే దిశగా కూడా అడుగులు పడుతున్నాయి. మంత్రివర్గంలో లేదా క్షేత్రస్థాయిలో ఉన్న చిన్నపాటి అసమ్మతి సెగలను అణచివేయడానికి, కేడర్‌లో నూతన ఉత్సాహాన్ని నింపడానికి ఈ పల్లెబాట ఒక పొలిటికల్ ఎనర్జీ బూస్టర్‌లా పనిచేయనుంది. స్థానిక సంస్థలు మరియు భవిష్యత్ ఎన్నికల దిశగా పార్టీ యంత్రాంగాన్ని సన్నద్ధం చేయాలంటే స్వయంగా ముఖ్యమంత్రే గ్రౌండ్‌లోకి దిగి పర్యటించడం కంటే వేరే మార్గం లేదు. కేటీఆర్, హరీష్ రావు వంటి బిఆర్ఎస్ అగ్రనేతలు ప్రభుత్వంపై పదే పదే చేస్తున్న దాడిని ఎదుర్కొనేందుకు రేవంత్ రెడ్డి ఎంచుకున్న ఈ 'డ్యూయల్ ఆపరేషన్' కాంగ్రెస్ పార్టీకి గట్టి రక్షణ కవచంగా మారనుంది. సచివాలయ పరిపాలనకు, గ్రామీణ ప్రజాక్షేత్రానికి మధ్య ఉన్న దూరాన్ని తగ్గించడం ద్వారా ప్రజలు తమకు ఇబ్బంది వచ్చినప్పుడు ఆదుకునే నేతగా రేవంత్‌ను చూసే వాతావరణాన్ని కల్పించేందుకు తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు.సంక్రాంతి తర్వాత ప్రారంభం కానున్న 'ప్రజాబలం' పల్లెబాట తెలంగాణ రాజకీయాల్లో ఒక పెద్ద టర్నింగ్ పాయింట్‌గా మారే అవకాశాలు ఉన్నాయి. ఒకవైపు అసెంబ్లీ వేదికగా కాళేశ్వరంపై బీఆర్ఎస్ నెరేటివ్‌ను తిరగరాయడం, మరోవైపు పల్లెల్లో శ్రేణులను ఏకం చేస్తూ ప్రజామోదాన్ని పెంచుకోవడం ద్వారా రేవంత్ రెడ్డి తెలంగాణలో తన రాజకీయ స్థానాన్ని మరింత తిరుగులేనిదిగా మార్చుకోవడానికి సుదీర్ఘమైన స్కెచ్ వేశారు

మొదటి పేజీ తరువాయి ప్రెస్ రిలీజ్‌ల కాలం పోయింది.. ఇప్పుడంతా ఇన్‌స్టా రీల్స్..!

గతంలో ఏదైనా కార్యక్రమం జరిగితే పత్రికా ప్రకటనలు ఇచ్చేవారని, ఇప్పుడు సామాజిక మాధ్యమాల విస్తృతితో అన్నీ ఇన్‌స్టా రీల్స్‌లోనే తెలిసిపోతున్నాయని మోదీ అన్నారు. ఈ సందర్భంగా దేశాభివృద్ధి కోసం తమ ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలను ప్రధాని వివరించారు. పేదరిక నిర్మూలన కోసం కృషి చేసినట్లు పేర్కొన్నారు. ఒకప్పుడు గరీబీ హఠావో వంటి నినాదాలు వినిపించేవని, కానీ తమ ప్రభుత్వం గత 12 ఏళ్లలో 50 కోట్ల మందిని దారిద్ర్య రేఖ నుంచి బయటపడేసిందని చెప్పారు. దేశంలో అసాధారణ విజయాలు సాధించినవారు ఎంతోమంది ఉన్నారని, వారి విజయ గాథలను ప్రపంచానికి తెలియజేయాలని విలేకరులను కోరారు.

మొదటి పేజీ తరువాయి ధాన్యం కొనుగోలు చేయకుండా కాంగ్రెస్ రైతులను మోసం చేస్తున్నది : పుట్ట మధుకర్

భారత రాజ్యాంగాన్ని అవమానించే పార్టీ.. ఓవైపు కోతలతో దోపిడీ చేస్తూ ఇప్పుడు దళారులను రైతుల మీదకు పంపిస్తున్నదని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం మంథనిలో అభివృద్ధిని విస్మరించి అన్ని వర్గాల ప్రజలను మోసం చేస్తున్నారని మండిపడ్డారు. మంత్రి శ్రీధర్ బాబు అధికారం, పదవులు, డబ్బు సంపాదించిన ధ్యేయంగా పనిచేస్తున్నాడు. ఇప్పటికైనా ప్రభుత్వం కళ్లు తెరుచి వెంటనే ధాన్యం కొనుగోలు ప్రారంభించడంతోపాటు రైతులకు మద్దతు ధర కల్పించాలని డిమాండ్ చేశారు.

ఎమ్మెల్యేలపై కాంగ్రెస్ హైకమాండ్ సీక్రెట్ సర్వే

(న్యూఢిల్లీ, సాక్షర): 2023 డిసెంబర్‌లో రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ 2026 డిసెంబర్ నాటికి ప్రజా పాలనకు మూడేళ్లు పూర్తి అవుతుంది. దీంతో ప్రభుత్వ పనితీరు, ప్రజాప్రతినిధుల వ్యవహారశైలి, పార్టీ క్షేత్రస్థాయి పరిస్థితులపై కాంగ్రెస్ నాయకత్వం దృష్టి సారించినట్లు తెలుస్తోంది. ప్రభుత్వ పథకాల అమలుతోపాటు ప్రజల్లో పార్టీకి ఉన్న ఆదరణ, స్థానికంగా ఎదురవుతున్న సమస్యలు, ఎమ్మెల్యేల పనితీరు వంటి అంశాలను అంచనా వేయడంలో భాగంగా సర్వే చేయనున్నట్లు తెలుస్తోంది. "కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత మంత్రులు, ప్రజాప్రతినిధుల పనితీరు ఎలా ఉంది? కాంగ్రెస్ పాలనపై ప్రజాభిప్రాయం ఎలా ఉంది? పరిష్కారం కాని సమస్యలు ఏమైనా ఉన్నాయా? ఒకవేళ ఉంటే వాటిని ఎందుకు పరిష్కారం చేయలేకపోతున్నారు" అనే తదితర అంశాలపైన వివరాలు సేకరిస్తున్నట్లు తెలుస్తోంది. అయితే ఈ సర్వేకు సంబంధించిన వివరాలను పూర్తిగా గోప్యంగా ఉంచుతున్నట్లు పార్టీకి చెందిన ఓ నాయకుడు తెలిపారు.క్షేత్ర స్థాయిలో కాంగ్రెస్ నిర్వహిస్తున్న సర్వేలో ఎమ్మెల్యేల పనితీరుపై ఆరా తీస్తున్నట్లు తెలుస్తోంది. ఎన్నికల్లో విజయం తర్వాత ఎమ్మెల్యేలు ప్రజలకు ఎంతవరకు అందుబాటులో ఉంటున్నారు? నియోజకవర్గాల్లో సమస్యల పరిష్కారానికి ఎంత ప్రాధాన్యత ఇస్తున్నారు? అభివృద్ధి పనుల పురోగతి ఎలా ఉంది? అనే అంశాలపై ప్రజల అభిప్రాయాన్ని తీసుకుంటున్నట్లు తెలుస్తోంది. హామీల అమలు, ప్రజలకు అందుబాటులో ఉండే తీరు, అధికారులతో సమన్వయం, స్థానిక సమస్యలపై స్పందన ఆధారంగా ఎమ్మెల్యేల పనితీరును అంచనా వేయనున్నట్లు తెలుస్తోంది. "ప్రజల్లో ఎన్నికలకు ముందు ఆయా నాయకులపై ఉన్న ఆదరణకు, ఇప్పుడు ఉన్న అభిప్రాయానికి మధ్య తేడా ఎంత? ఏ నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలపై అసంతృప్తి ఉంది? ఎక్కడ సంతృప్తి ఉంది?" అనే అంశాలపై దృష్టి సారించనున్నట్లు తెలుస్తోంది. "ప్రజలకు ఎమ్మెల్యేలు సమయం కేటాయిస్తున్నారా? అధికారులతో మాట్లాడి సమస్యలను పరిష్కరిస్తున్నారా?" అనే అంశాల్లో వారి పనితీరును అంచనా వేయడంలో ప్రాతిపదికగా తీసుకోనున్నట్లు సమాచారం.కాంగ్రెస్‌లో అంతర్గత సమన్వయం కూడా మరో కీలక అంశంగా కనిపిస్తోంది. అధికారంలోకి వచ్చిన తర్వాత కొందరు ప్రజాప్రతినిధుల వ్యవహారశైలిలో మార్పులు వచ్చాయనే అభిప్రాయం పార్టీ వర్గాల్లో ఉన్నాయి? సొంత పార్టీ నాయకులు, కార్యకర్తలకు తగిన గుర్తింపు లభిస్తోందా? లేక బయట పార్టీల నుంచి వచ్చిన నేతలకు ప్రాధాన్యం ఇస్తున్నారా? అనే అంశాలపై సమాచారం సేకరిస్తున్నట్లు తెలుస్తోంది. పార్టీ అభ్యర్థుల విజయం కోసం పనిచేసిన స్థానిక నాయకులు, కార్యకర్తలతో ఎమ్మెల్యేలు ఎలా వ్యవహరిస్తున్నారు? స్థానిక నాయకుల మధ్య సమన్వయం ఉందా? ఎక్కడైనా వర్గ విభేదాలు పార్టీ బలోపేతానికి అడ్డంకిగా మారుతున్నాయా? అనే అంశాలను పరిశీలించే అవకాశం ఉంది.రాష్ట్రంలోని నియోజకవర్గాల వారీగా క్షేత్రస్థాయి పరిస్థితులను అంచనా వేసి, నవంబర్ నెలాఖరుకు సమగ్ర నివేదిక సిద్ధం చేయాలనే లక్ష్యంతో సునీల్ కనుగోలు బృందం పనిచేస్తున్నట్లు సమాచారం. అయితే ఈ గడువుపై అధికారికంగా స్పష్టత లేదు. డిసెంబర్‌లో కాంగ్రెస్ ప్రభుత్వం మూడేళ్ల పాలన పూర్తి చేసుకోనున్నందున ఈ నివేదికకు రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది.

భాజపా ఎస్సీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా బోండ్ల నారాయణ నియామకం



(ఆదిలాబాద్ టౌన్, సాక్షర): భారతీయ జనతా పార్టీ తెలంగాణ రాష్ట్ర ఎస్సీ మోర్చా కార్యవర్గ సభ్యుడిగా నియమితులైనందుకు బోండ్ల నారాయణ హర్షం వ్యక్తం చేస్తూ పార్టీ నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.ఆదిలాబాద్ పార్లమెంట్ సభ్యుడు గొడం నగేష్, ఆదిలాబాద్ శాసనసభ్యుడు పాయల్ శంకర్ సూచన మేరకు, జిల్లా అధ్యక్షుడు బ్రహ్మానందం తన నియామక విషయాన్ని రాష్ట్ర ఎస్సీ మోర్చా అధ్యక్షుడు కాంతి కిరణ్ దృష్టికి తీసుకెళ్లగా, భాజపా తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు అనుమతితో తనకు ఈ బాధ్యతను అప్పగించడం జరిగిందని తెలిపారు.ఈ సందర్భంగా తన నియామకానికి సహకరించిన పార్లమెంట్ సభ్యుడు గొడం నగేష్, శాసనసభ్యుడు పాయల్ శంకర్, జిల్లా అధ్యక్షుడు బ్రహ్మానందం, రాష్ట్ర ఎస్సీ మోర్చా అధ్యక

పశుగ్రాసం కొరత.. ఒక కట్టకు 100 రూపాయలు




(తానూర్, సాక్షర): మండలంలో వర్షాభావ పరిస్థితుల కారణంగా పశుగ్రాసం కొరత తీవ్రంగా ఏర్పడింది. ఎల్ నినో ప్రభావంతో ఆశించిన స్థాయిలో వర్షాలు కురవక పంటలు దెబ్బతినడంతో పాటు వ్యవసాయ పొలాల్లో పశువులకు అవసరమైన గడ్డి లభించడం లేదు.దీంతో పశువుల పెంపకంపై ఆధారపడిన రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గడ్డి కొరతతో ఒక కట్ట గడ్డి ధర 100 రూపాయలకు చేరింది. గతంలో ఎన్నడూ లేని విధంగా ధరలు పెరగడంతో చిన్న, సన్నకారు రైతులు పశువులను పోషించలేక సతమతమవుతున్నారు.పశుగ్రాసం కోసం రైతులు పక్క మండలాలు, పక్క జిల్లాలకు వెళ్లి కొనుగోలు చేస్తున్నారు. రవాణా ఖర్చు కూడా భారంగా మారిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం పశుగ్రాసం కొరతను గుర్తించి తగిన చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

రోస్టర్ సవరించే వరకు ఉద్యమం: రమేష్



(ఆదిలాబాద్‌టౌన్, సాక్షర): ఎస్సీ వర్గీకరణలోని రోస్టర్ విధానాన్ని సవరించే వరకు ఉద్యమాన్ని ఆపేది లేదని మాల సంక్షేమ సంఘం జిల్లా నాయకుడు కొప్పుల రమేష్ అన్నారు.20లోపు మాలలకు రెండు రోస్టర్ పాయింట్లను కేటాయించాలని కోరుతూ జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ఎదుట సంఘం నాయకులు గురువారం ఒకరోజు రిలే నిరాహార దీక్ష చేపట్టారు. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన రోస్టర్ విధానంలో మాలలకు ఉద్యోగ, ఉపాధి అవకాశాల్లో అన్యాయం జరుగుతుందని తెలిపారు.

ప్రభుత్వ మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటించాలి జిల్లా అదనపు కలెక్టర్ వి. రాములు



(మంచిర్యాల ప్రతినిధి, సాక్షర) వానాకాలం 2026-27 సీజన్కు సంబంధించి ధాన్యం కొనుగోలు ప్రక్రియ సజావుగా నిర్వహించేందుకు ప్రభుత్వ మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటించాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి. రాములు అన్నారు.గురువారం జిల్లాలోని నస్పూర్లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని అదనపు కలెక్టర్ కార్యాలయ గదిలో జిల్లాలోని అన్ని ధాన్యం కొనుగోలు కేంద్రాల శాఖాధిపతులతో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ వానాకాలం 2026-27 సీజన్కు సంబంధించి ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాలు, సూచనలను ప్రతి ప్రాథమిక కొనుగోలు కేంద్ర శాఖాధిపతి తప్పనిసరిగా పాటించాలని ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల నమోదు ప్రక్రియను ఎలాంటి జాప్యం లేకుండా పూర్తి చేయడంతో పాటు, నిర్దేశించిన 16 ప్రశ్నలకు సంబంధించిన వివరాల నమోదు ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. ధాన్యం కొనుగోళ్లకు సంబంధించి ప్రభుత్వ నిబంధనలను పకడ్బందీగా అమలు చేస్తూ, సంబంధిత అధికారులు సమన్వయంతో పని చేయాలని, కొనుగోలు ప్రక్రియలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా పౌర సరఫరాల అధికారి వేణుగోపాల్, జిల్లా నిర్వాహకుడు శ్రీకళ, జిల్లా కార్యక్రమ నిర్వాహకుడు, పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ కార్యక్రమ సంచాలకుడు, బాధ్యతల్లో ఉన్న జిల్లా సహకార అధికారి, జిల్లా సహకార విక్రయ సంఘం నిర్వాహకుడు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

రైతుల పేరుతో రాజకీయం చేయడం మానండి..

- భారత రాష్ట్ర సమితి హయాంలో రాష్ట్రాన్ని అప్పులపాలు చేశారు ఖానాపూర్ శాసనసభ్యుడు వెడ్మ బొజ్జు పటేల్



(నిర్మల్ ప్రతినిధి, సాక్షర) కల్వకుంట్ల తారక రామారావు చేస్తున్న వ్యాఖ్యల్లో వాస్తవాలు లేవని, రైతుల సమస్యలను రాజకీయ ప్రయోజనాల కోసం ఉపయోగించుకోవడం భారత రాష్ట్ర సమితి నాయకులకు అలవాటుగా మారిందని ఖానాపూర్ శాసనసభ్యుడు, నిర్మల్ జిల్లా కాంగ్రెస్ సమితి అధ్యక్షుడు వెడ్మ బొజ్జు పటేల్ విమర్శించారు. గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.ప్రజా సమస్యలపై చర్చించాల్సిన సభలో రైతులు, నిరుద్యోగులు, రాష్ట్ర ఆర్థిక పరిస్థితి, సాగునీటి అంశాలపై ప్రభుత్వం తన అభిప్రాయాలను స్పష్టంగా వెల్లడించిందని తెలిపారు. కానీ ప్రజా సమస్యలపై నిర్మాణాత్మక సూచనలు చేయకుండా, కల్వకుంట్ల తారక రామారావు కేవలం రాజకీయ విమర్శలకే ప్రాధాన్యత ఇవ్వడం విచారకరమన్నారు.ఎల్నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉందని ముందుగానే రైతులను ప్రభుత్వం అప్రమత్తం చేసిందని, నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకొని పంటల సాగు చేసుకోవాలని సూచించిందని పేర్కొన్నారు. ప్రకృతి పరిస్థితులను కూడా ప్రభుత్వంపై నెట్టడం కల్వకుంట్ల తారక రామారావు రాజకీయ వైఖరికి నిదర్శనమని అన్నారు. రైతులకు సాగునీటి విషయంలో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రభుత్వం అవసరమైన చర్యలు తీసుకుంటోందని స్పష్టం చేశారు.గత భారత రాష్ట్ర సమితి ప్రభుత్వం ప్రాజెక్టుల పేరుతో ప్రచారం చేసుకుందే తప్ప, రాష్ట్రానికి మిగిల్చింది అప్పుల భారమని విమర్శించారు. కాళేశ్వరం ప్రాజెక్టు పరిస్థితి ప్రజలందరికీ తెలిసిందేనని, గత ప్రభుత్వ హయాంలో జరిగిన తప్పిదాలకు సమాధానం చెప్పకుండా నేడు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని విమర్శించడం సరికాదన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, కొత్త రేషన్ కార్డులు, సన్నబియ్యం పంపిణీ, రైతు రుణమాఫీ వంటి పథకాలను అమలు చేస్తోందని తెలిపారు. ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేరుస్తున్నామని పేర్కొన్నారు.గత పదేళ్లలో భారత రాష్ట్ర సమితి ప్రభుత్వం ఇచ్చిన హామీలు, చేసిన అప్పులు, ప్రజలకు అందించిన ప్రయోజనాలపై చర్చించేందుకు సిద్ధంగా ఉండాలని భారత రాష్ట్ర సమితి నాయకులకు సవాల్ విసిరారు. కుటుంబ రాజకీయాలు, అధికారం కోసం ఆరాటం పక్కనపెట్టి ప్రజల సమస్యలపై మాట్లాడాలని హితవు పలికారు.రైతుల సంక్షేమం కాంగ్రెస్ ప్రభుత్వానికి రాజకీయ అంశం కాదు.. అది బాధ్యత. రైతుల ప్రయోజనాల విషయంలో ఎలాంటి రాజీ పడకుండా ప్రభుత్వం ముందుకు సాగుతుంది. ప్రజలు అన్నీ గమనిస్తున్నారు. గత పాలనకు, ప్రస్తుత ప్రజా ప్రభుత్వానికి మధ్య ఉన్న తేడాను ప్రజలే అర్థం చేసుకుంటున్నారని శాసనసభ్యుడు వెడ్మ బొజ్జు పటేల్ స్పష్టం చేశారు.ఈ సమావేశంలో నిర్మల్ పురపాలక ఉపాధ్యక్షుడు అప్పల గణేష్, నిర్మల్ పట్టణ అధ్యక్షుడు ఆకుల హరీష్, ఖానాపూర్ వ్యవసాయ మార్కెట్ సమితి అధ్యక్షుడు పడగల భూషణ్, జిల్లా కాంగ్రెస్ సమితి ప్రధాన కార్యదర్శి జునైద్, యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు సమరసింహా రెడ్డి, షెడ్యూల్డ్ కులాల విభాగం జిల్లా అధ్యక్షుడు కట్టే శ్యామ్, నిర్మల్ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విశాఖలో ఘనంగా ప్రారంభమైన 31వ సీఐఐ పార్ట్‌నర్‌షిప్ సమ్మిట్

- ఏపీ, ఎంఎస్ఎంఈ పెవిలియన్లను ప్రారంభించిన పీయూష్ గోయల్, చంద్రబాబు, పవన్
- తిరుపతి, విశాఖ, అమరావతి ఎకనమిక్ రీజియన్ల ప్రగతిపై అధికారుల ప్రజెంటేషన్
- డోలు వాయించిన చంద్రబాబు, పీయూష్ గోయల్, పవన్ కల్యాణ్..



విశాఖపట్నం: విశాఖపట్నం వేదికగా 31వ సీఐఐ భాగస్వామ్య సదస్సు ఘనంగా ప్రారంభమైంది. ఈ సదస్సులో ఏర్పాటు చేసిన ఆంధ్రప్రదేశ్ పెవిలియన్, ఎంఎస్ఎంఈ పెవిలియన్‌లను కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్ సంయుక్తంగా ప్రారంభించారు. అనంతరం ప్రాంగణంలోని వివిధ స్టాళ్లను నేతలు ఆసక్తిగా పరిశీలించారు. సదస్సు వేదిక వద్ద ప్రముఖులకు ధింసా, తప్పెటగుళ్లు వంటి రాష్ట్ర సంప్రదాయ నృత్యాలతో ఘన స్వాగతం లభించింది. ఈ సందర్భంగా చంద్రబాబు, పీయూష్ గోయల్, పవన్ కల్యాణ్ స్వయంగా డోలు వాయించి కళాకారులను ఉత్సాహపరిచారు. అనంతరం పెవిలియన్‌లో తిరుపతి, విశాఖపట్నం, అమరావతి ఎకనమిక్ రీజియన్లతో పాటు సీఆర్‌డీఏ పరిధిలో



జరుగుతున్న అభివృద్ధి పనులపై అధికారులు ఇచ్చిన డిజిటల్ ప్రజెంటేషన్‌ను కేంద్ర మంత్రికి వివరించారు. ఈ ప్రదర్శనలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన అమరావతి టవర్ మోడల్ అందరినీ ఆకట్టుకుంది. రాష్ట్ర సంస్కృతిని ప్రతిబింబించే తోలుబొమ్మలాట, పెన్ కలంకారీ, గిరిజన కళాకృతుల స్టాళ్లను నేతలు సందర్శించారు. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన కళాకారుల ప్రతిభను కేంద్రమంత్రికి సీఎం వివరించారు. అనంతరం అరకు కాఫీ స్టాల్ వద్ద నేతలు కాఫీని రుచి చూశారు. సదస్సు ప్రాంగణంలో నేతలు కాసేపు బ్యాటరీ కారులో ప్రయాణించి పరిశ్రమల పురోగతిని సమీక్షించారు. నవంబర్ 12, 13 తేదీల్లో రెండు రోజుల పాటు జరిగే ఈ సదస్సు ద్వారా రాష్ట్రానికి పెద్దఎత్తున పెట్టుబడులను ఆకర్షించడమే లక్ష్యంగా ప్రభుత్వం అడుగులు వేస్తోంది.

ఎన్ హెచ్ఎం ఉద్యోగుల సమ్మెకు కార్మిక, రైతు, విద్యార్థి సంఘాల మద్దతు

- 31వ రోజుకు చేరిన నిరవధిక సమ్మె



(ఆదిలాబాద్ టౌన్, సాక్షర) ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో సంయుక్త కార్యాచరణ సమితి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 31వ రోజు నిరవధిక ధర్నాకు గురువారం వివిధ ప్రజా, కార్మిక, విద్యార్థి సంఘాల నాయకులు హాజరై జాతీయ ఆరోగ్య మిషన్ ఉద్యోగుల పోరాటానికి తమ సంపూర్ణ మద్దతు ప్రకటించారు.ఈ సందర్భంగా మద్దతు తెలిపిన నాయకులు వెంకట్నారాయణ - భారతీయ కార్మిక సంఘాల సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి, సాయన్న - అఖిల భారత రైతు కూలీ సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి, మాడవి గణేష్ - ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి, దత్తాత్రి - ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం జిల్లా సహాయ కార్యదర్శి, గౌరలా సుభాష్ - భారతీయ కార్మిక సంఘాల సమాఖ్య జిల్లా నాయకులు మాట్లాడారు. గత 21 సంవత్సరాలుగా వైద్య ఆరోగ్య శాఖలో ప్రజలకు నిరంతర సేవలందిస్తున్న 17,000 మంది జాతీయ ఆరోగ్య మిషన్ ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కోరారు.78 విభాగాల్లో పనిచేస్తున్న ఒప్పంద, బయటి సేవల ఉద్యోగులందరినీ క్రమబద్ధీకరించాలనే ప్రధాన న్యాయమైన కోర్కెను ప్రభుత్వం సానుకూలంగా పరిశీలించి తక్షణమే న్యాయం చేయాలని అన్నారు.ప్రజారోగ్య వ్యవస్థలో కీలక పాత్ర పోషిస్తున్న జాతీయ ఆరోగ్య మిషన్ ఉద్యోగుల సేవలను ప్రభుత్వం గుర్తించాలని, వారి కుటుంబాల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని సమస్యలను పరిష్కరించాలని మద్దతు తెలిపిన నాయకులు కోరారు.సంయుక్త కార్యాచరణ సమితి ఆదిలాబాద్ నాయకులు మాట్లాడుతూ వివిధ కార్మిక, రైతు, విద్యార్థి సంఘాలు తమ పోరాటానికి మద్దతుగా నిలవడం ఎంతో ప్రోత్సాహాన్ని ఇస్తుందని, అందరికీ హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేస్తున్నామని పేర్కొన్నారు.

ఓటు హక్కుపై అవగాహనకు వ్యాసరచన, క్విజ్ పోటీలు



(నిర్మల్ ప్రతినిధి, సాక్షర): విద్యార్థులు, యువ ఓటర్లలో ఎన్నికల ప్రక్రియ, ఓటు హక్కు, ప్రజాస్వామ్య విలువలపై అవగాహన పెంపొందించేందుకు ఓటరు అక్షరాస్యత సంఘాల ఆధ్వర్యంలో 009-నిర్మల్ శాసనసభ నియోజకవర్గ స్థాయి వ్యాసరచన, క్విజ్ పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్మల్ రెవెన్యూ విభాగ అధికారి, ఓటరు నమోదు అధికారి దేవిదాస్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.ఈ పోటీల్లో మండల స్థాయిలో ఎంపికైన విద్యార్థులు పాల్గొనాలని, విజేతలకు ప్రశంసా పత్రాలు, బహుమతులు అందజేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ పోటీలు నవంబర్ 13న ఉదయం 11 గంటలకు నిర్మల్లోని భాగ్యనగర్ నారాయణ ఉన్నత పాఠశాలలో నిర్వహించనున్నట్లు తెలిపారు. సంబంధిత అధికారులు, పాఠశాలలు, కళాశాలల ప్రధానోపాధ్యాయులు ఎంపికైన విద్యార్థులను సకాలంలో పంపించి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

ప్రజాసేవ నుంచి న్యాయవాద వృత్తి వరకు.. రాథోడ్ శ్రవణ్ విజయ ప్రస్థానం



(ఆదిలాబాద్, సాక్షర): నడ్డంగూడ గ్రామపంచాయతీ 1వ వార్డు సభ్యుడిగా ప్రజల మద్దతుతో ఎన్నికైన రాథోడ్ శ్రవణ్ తన విజయ ప్రస్థానంలో మరో మైలురాయిని చేరుకున్నారు. బీఎస్సీ, ఎల్ఎల్బీ విద్యను విజయవంతంగా పూర్తి చేసిన ఆయన తాజాగా రాష్ట్ర బార్ కౌన్సిల్‌లో న్యాయవాదిగా నమోదు చేసుకున్నారు.రాథోడ్ ప్రహ్లాద్ కుమారుడైన శ్రవణ్ ప్రజాప్రతినిధిగా తన బాధ్యతలను నిర్వర్తిస్తూనే న్యాయ విద్యను పూర్తి చేసి న్యాయవాదిగా తన వృత్తి జీవితాన్ని ప్రారంభించడం విశేషం. ప్రజాసేవ పట్ల నిబద్ధతతో పాటు న్యాయరంగంలోనూ రాణించాలనే లక్ష్యంతో ఆయన ముందుకు సాగుతున్నారు.ఒకవైపు ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తూ, మరోవైపు న్యాయవాదిగా సమాజానికి సేవ చేసే అవకాశం పొందడం అభినందనీయమని గ్రామస్థులు, కుటుంబ సభ్యులు, స్నేహితులు, శ్రేయోభిలాషులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.ఈ సందర్భంగా రాథోడ్ శ్రవణ్‌కు పలువురు అభినందనలు తెలియజేస్తూ, భవిష్యత్తులో ప్రజాసేవతో పాటు న్యాయరంగంలోనూ మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షిస్తున్నారు.

అంగన్వాడీ పోస్టుల అర్హులైన, అనర్హులైన ప్రదర్శన

(ఆదిలాబాద్,సాక్షర): సమీకృత శిశు అభివృద్ధి పథకం, ఆదిలాబాద్ పట్టణ ప్రాజెక్టు పరిధిలోని అంగన్వాడీ కేంద్రాల్లో ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీకి దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల అర్హులైన, అనర్హులైన జాబితాను శుక్రవారం నుంచి ప్రదర్శించనున్నట్లు శిశు అభివృద్ధి ప్రాజెక్టు అధికారి తెలిపారు.అంగన్వాడీ ఉపాధ్యాయురాలు 32 పోస్టులు, అంగన్వాడీ సహాయకురాలు 63 పోస్టుల భర్తీకి దరఖాస్తులు స్వీకరించారు. ఈ పోస్టులకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల జాబితాను 13.11.2026 నుంచి సంబంధిత గ్రామ పంచాయతీ కార్యాలయ ప్రకటన పట్టికలో ప్రదర్శిస్తారు. సంబంధిత అభ్యర్థులు గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని సందర్శించి తమ పేరు జాబితాలో ఉందో లేదో పరిశీలించుకోవాలని సూచించారు.

తెలంగాణలో 21 మంది ఐపీఎస్ ల బదిలీలు

(హైదరాబాద్, సాక్షర): తెలంగాణలో భారీగా ఐపీఎస్ అధికారులను బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. 21 మంది ఐపీఎస్ అధికారులకు స్థానచలనం కలిగింది. హైదరాబాద్ పోలీస్ కమిషనర్గా మహేష్ భగవత్, జైళ్ల శాఖ డీజీగా స్వాతి లక్రా, మహిళా భద్రత, షీ టీమ్స్, భరోసా డీజీపీగా సౌమ్య మిశ్రా, ఏసీబీ డీజీగా చారు సిన్హా బదిలీ అయ్యారు. టీజీఎస్ఆర్టీసీ ఎండీగా అనిల్ కుమార్, తెలంగాణ ఫైర్ సర్వీసెస్ డీజీగా వీసీ సజ్జనార్, సివిల్ సప్లైస్ కమిషనర్గా నాగిరెడ్డి. గ్రేహౌండ్స్, ఆక్టోపస్ డీజీగా విక్రమ్ సింగ్ మాన్. అదనపు డీజీపీ (లా అండ్ ఆర్డర్) గా ఆకున్ సబర్వాల్. తెలంగాణ ట్రాఫిక్ మేనేజ్మెంట్ డైరెక్టర్గా ఎం. స్టీఫెన్ రవీంద్ర నియమితులయ్యారు..

తాగేందుకు, వంటకూ రూ.20 ఫిల్టర్ డబ్బా నీళ్లే..

- మంత్రి వాకిటి శ్రీహరి ఇలాఖాలో నీటి కష్టాలపై మహిళ..

(మక్తల్, సాక్షర): మంత్రి వాకిటి శ్రీహరి ప్రాతినిధ్యం వహిస్తున్న ఏరియాలో ప్రజలు గుక్కెడె తాగునీటి కోసం రోడ్డెక్కాల్సిన పరిస్థితి వచ్చింది. మక్తల్ మున్సిపాలిటీ పరిధిలో కొద్ది రోజులుగా తాగునీళ్లు రావడం లేదంటూ జనాలు ఆందోళన బాట పట్టారు. కాలనీల్లో కొన్ని రోజులుగా కనీసం తాగు నీరు రావడం లేదంటూ నందిని నగర్ కాలనీ వాసులు మక్తల్-కర్ణి రహదారిపై బైఠాయించారు. దీనికి సంబంధించిన వీడియో రేవంత్ సర్కార్లో తాగునీటి కష్టాలు ఎలా ఉన్నాయో మరోసారి చెప్పకనే చెబుతోంది. ఓటేయించుకుని ఇటువైపు రావడం లేదు..: నిరసనలో పాల్గొన్న ఓ మహిళ మాట్లాడుతూ..నీళ్లు రాకపోవడంతో వంట చేయలేక రోడ్డుపై వచ్చి కూర్చున్నాం.. మాకు నీళ్లు కావాలే.. నీళ్లు లేకుంటే వంట చేసే పరిస్థితి లేదు.. ఎన్ని దినాలాయే.. 20 రూపాయల ఫిల్టర్ నీళ్ల డబ్బా తెచ్చుకుంటున్నం.. తాగేందుకు అవే.. వంట చేసేందుకు అవే.. లీడర్లు ఓట్లపుడు మా దగ్గరకు రాకుంటే ఇంట్లనే ఉండేవాళ్లం.. ఏదో ఒక ఆశ చెప్పి ఓటేయించుకుని ఇటువైపు రావడం లేదు.. మాకు నీళ్లు కావాలే.. మాకు చేసుకోవడానికి పనులు కూడా లేవని వాపోయింది. మేం అది చేస్తం.. ఇది చేపిస్తమని చెప్పి ఓట్లేయించుకున్నరు.. మేం ఆఫీసుల చుట్టూ తిరిగినా మమ్మల్ని ఎవరూ పట్టించుకోవడం లేదు.. 2 నెలల నుంచి మాకు సరిగ్గా నీళ్లే లేవు.. ఎన్ని రోజులు ఇలా మోసుకోవాలి మేము అంటూ మరో మహిళ ఆవేదన వ్యక్తం చేసింది.

సివిల్స్ విద్యార్థిని కోల సింధు రచించిన పుస్తకాన్ని ఆవిష్కరించిన... కేటీఆర్

- కోల సింధు రచనా ప్రతిభను అభినందించిన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



గోదావరిఖని:రామగుండం నియోజకవర్గం వేమునూర్ గ్రామ సర్పంచ్ కోల లత గారి కోడలు, కోల మహేష్ – లక్ష్మీ దంపతుల కుమార్తె, సివిల్స్ విద్యార్థిని కోల సింధు రచించిన " అండ్ డిఫైనేబుల్ గర్ల్" (Un Definable Girl) పుస్తకాన్ని ఈరోజు బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు (కేటీఆర్) చేతుల మీదుగా ఘనంగా ఆవిష్కరించడం జరిగింది. ఈ సందర్భంగా కేటీఆర్, కోల సింధు రచించిన పుస్తకాన్ని అభినందిస్తూ, ఆమె రచనా ప్రతిభను కొనియాడారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని, ప్రతిష్టాత్మకమైన ఆలిండియా సివిల్స్ పరీక్షలో ఉత్తీర్ణత సాధించి ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు.చిన్న వయసులోనే రచనా రంగంలో ప్రతిభను చాటుతూ, సివిల్స్ లక్ష్యంతో ముందుకు సాగుతున్న కోల సింధు యువతకు ఆదర్శంగా నిలుస్తున్నారని ఈ సందర్భంగా పలువురు అభినందించారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి, నర్సాపూర్ ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి , బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు, రామగుండం నియోజకవర్గానికి చెందిన వ్యాళ్ల హరీష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆదివాసీ గ్రామాల సమస్యలు పరిష్కరించాలి: తుడుం దెబ్బ రాష్ట్ర అధ్యక్షుడు గోడం గణేష్



(తలమడుగు, సాక్షర) ఆదివాసీ గ్రామాల సమస్యలు పరిష్కరించాలని తుడుం దెబ్బ రాష్ట్ర అధ్యక్షుడు గోడం గణేష్ డిమాండ్ చేశారు. గురువారం ఆదివాసీ హక్కుల పోరాట సమితి తుడుం దెబ్బ తలమడుగు మండల కమిటీ ఆధ్వర్యంలో మండలంలోని దేవాపూర్, బరంపూర్, చర్లపల్లి, ఝరి, రత్నపూర్ గ్రామాలను క్షేత్రస్థాయిలో సందర్శించి గ్రామాల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా తుడుం దెబ్బ రాష్ట్ర అధ్యక్షుడు గోడం గణేష్ మాట్లాడుతూ స్వాతంత్ర్యం సిద్ధించి 80 సంవత్సరాలు గడిచినా ఇప్పటికీ ఆదివాసీ గ్రామాలకు రోడ్డు కల్పించకపోవడం చాలా విచారకరమని అన్నారు. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి దేవాపూర్ తనిఖీ కేంద్రం నుంచి పునాగూడ వరకు, ఝరి నుంచి రత్నపూర్ వరకు రోడ్డు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. అదే విధంగా తలమడుగు మండలాన్ని కరువు మండలంగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో తుడుం దెబ్బ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి వెట్టి మనోజ్, రాష్ట్ర కార్యదర్శి అర్కా శేషారావు, జిల్లా ఉపాధ్యక్షులు కుముర జ్ఞానేష్, ఆత్రం భరత్, మండల అధ్యక్షుడు జంగల పోచన్న, కార్యనిర్వాహక అధ్యక్షుడు గోడం బుజంగారావు, రైతు సంఘం అధ్యక్షుడు పెందుర్ మాధవరావు, ఉపాధ్యక్షుడు అనక రాంజీ, సర్పంచులు ఆత్రం సూర్యబాన్, ఆత్రం అశోక్, మాజీ సర్పంచి తొడసం హేమంత్, పెందుర్ జైతు పటేల్, మెస్రం నాగోరావ్ పటేల్, నైతం బాజేరావు పటేల్, ఆత్రం సీతారాం, పేందూరు శంభు, ఆయా గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

షేక్ షమా కుటుంబ సభ్యులను పరామర్శించిన డీసీసీ అధ్యక్షుడు నరేష్ జాదవ్



(ఆదిలాబాద్, సాక్షర): ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని ఖుర్షీద్ నగర్ కాలనీకి చెందిన ఏఐఎంఐఎం టౌన్ ప్రెసిడెంట్ నజీర్ అహ్మద్ సోదరుడు షేక్ షమా ఇటీవల క్యాన్సర్ వ్యాధితో బాధపడుతూ మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న డీసీసీ అధ్యక్షుడు డా. నరేష్ జాదవ్, ఆదిలాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ బోరంచు శ్రీకాంత్ రెడ్డి వారి స్వగృహానికి వెళ్లి కాంగ్రెస్ నేతలతో కలిసి పరామర్శించారు.ఈ సందర్భంగా మృతుని కుటుంబ సభ్యులతో మాట్లాడి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. కుటుంబ సభ్యులకు ధైర్యం చెబుతూ, ఈ కష్ట సమయంలో వారికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. షేక్ షమా మృతి పట్ల తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తూ, వారి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు.కార్యక్రమంలో మాజీ డీసీసీ అధ్యక్షుడు సాజిద్ ఖాన్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ అల్లూరి సంజీవరెడ్డి, మాజీ టీపీసీసీ జనరల్ సెక్రటరీ గండ్రత్ సుజాత, కాంగ్రెస్ పార్టీ టౌన్ ప్రెసిడెంట్ కిజార్ పాషా, గుడిహత్నూర్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు తొడసం దౌలత్ రావు, టౌన్ జనరల్ సెక్రటరీ మహేందర్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు జావిద్, మోసిన్ పటేల్, సుదర్శన్, కలీం తదితర కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా కృషి

- ఉద్యోగుల సంయుక్త కార్యాచరణ సమితి జిల్లా అధ్యక్షులు నాశెట్టి సుమన్ కుమార్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం సభ్యత్వ నమోదు కార్యక్రమం



(నిజామాబాద్ ప్రతినిధి, సాక్షర) ప్రభుత్వ ఉద్యోగుల సంఘం ప్రతి ఉద్యోగికి ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి పరమావధిగా కృషి చేస్తోందని ఉద్యోగుల సంయుక్త కార్యాచరణ సమితి జిల్లా అధ్యక్షుడు, ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు నాశెట్టి సుమన్ కుమార్ తెలిపారు.గురువారం ప్రభుత్వ ఉద్యోగుల సంఘం కేంద్ర సంఘం అధ్యక్షుడు శ్రీమారం జగదీశ్వర్, ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.ఎం. హుసేని ఆదేశాల మేరకు ప్రతి సంవత్సరం మాదిరిగా ఈ సంవత్సరం కూడా ప్రభుత్వ ఉద్యోగుల సంఘం సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని కలెక్టరేట్ కార్యాలయంలో గల జిల్లా విద్యాశాఖ, వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఉద్యోగుల సంయుక్త కార్యాచరణ సమితి జిల్లా అధ్యక్షుడు, ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు నాశెట్టి సుమన్ కుమార్, ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా కార్యదర్శి నేతికుంట శేఖర్ విచ్చేసి ఆయా శాఖల ఉద్యోగుల సమస్యలపై చర్చించారు. అనంతరం 2026-27 సంవత్సరానికి గాను ప్రభుత్వ ఉద్యోగుల సంఘం సభ్యత్వాన్ని సదరు శాఖ ఉద్యోగులకు అందజేసి, సభ్యత్వం ప్రాముఖ్యతను వివరించారు. ఇతర సమస్యలపై సుదీర్ఘంగా చర్చించి, ఉద్యోగుల సమస్యలే పరమావధిగా భావిస్తున్న ప్రభుత్వ ఉద్యోగుల సంఘం, ప్రతి ఉద్యోగికి ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ, సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలియజేశారు.ఈ సమావేశానికి ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర కార్యదర్శి పోల శ్రీనివాస్, జిల్లా కోశాధికారి నిరంజన్ గౌడ్, ఉపాధ్యక్షుడు శివకుమార్, ప్రభుత్వ ఉద్యోగుల సంఘం నగర విభాగం అధ్యక్ష, కార్యదర్శులు జాకీర్ హుస్సేన్, మారుతి, విద్యాశాఖ వేదిక అధ్యక్ష, కార్యదర్శులు అశ్విన్ కుమార్, శోభన్, ప్రభుత్వ ఉద్యోగుల సంఘం ముఖ్య సలహాదారు వనమాల సుధాకర్, వ్యవసాయ శాఖ వేదిక జిల్లా కార్యదర్శి గోవర్ధన్, ఆయా శాఖల ఉద్యోగులు, మహిళా ఉద్యోగులు హాజరై ప్రభుత్వ ఉద్యోగుల సంఘం సభ్యత్వాన్ని స్వీకరించారు.



వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ అందించడమే లక్ష్యం : సీఎండీ వరుణ్ రెడ్డి



- చెన్నూరులో నూతన విద్యుత్ రెవెన్యూ కార్యాలయం ప్రారంభం

(చెన్నూరు, సాక్షర) నిరంతరం వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ అందించడమే విద్యుత్ శాఖ ప్రధాన లక్ష్యమని తెలంగాణ విద్యుత్ శాఖ సీఎండీ కర్ణాటి వరుణ్ రెడ్డి అన్నారు. స్థానిక సబ్ స్టేషన్ ఆవరణలో నూతనంగా నిర్మించిన విద్యుత్ రెవెన్యూ కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు.చెన్నూరు ప్రాంత అన్ని వర్గాల ప్రజలకు విద్యుత్ సమస్యలు పరిష్కరిస్తూ, నాణ్యమైన విద్యుత్ అందిస్తూ సంస్థ ఆదాయాన్ని మెరుగుపరిచేలా కృషి చేయాలని సిబ్బందికి సూచించారు.కార్యక్రమంలో జిల్లా విద్యుత్ శాఖ సూపరింటెండెంట్ బి. రాజన్న, ఏఏఓ శ్రీనివాస్, స్థానిక అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి చెక్కులు అందజేసిన ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డి



(నిర్మల్ ప్రతినిధి, సాక్షర): నిర్మల్ నగరంలోని పెన్షనర్స్ భవన్లో నిర్మల్ పట్టణానికి చెందిన 50 మంది, నిర్మల్ రూరల్ మండలానికి చెందిన 16 మంది కలిపి మొత్తం 66 మంది లబ్ధిదారులకు రూ. 66,07,656 విలువైన కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాల చెక్కులను బీజేపీఎల్పీ నేత, నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి పంపిణీ చేశారు. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, మండల అధ్యక్షులు, కౌన్సిలర్లు, సర్పంచులు, బీజేపీ నాయకులు, సంబంధిత అధికారులు, లబ్ధిదారుల కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

తిరిగి సర్వే పనులు వేగంగా పూర్తి చేయాలి : అదనపు కలెక్టర్



(బజార్ హత్నూర్ , సాక్షర): గంగాపూర్ గ్రామంలో జరుగుతున్న భూముల తిరిగి సర్వే పనులను అదనపు కలెక్టర్ (ఆదాయ శాఖ) రాయి సిడాం చిత్రు పరిశీలించారు. ఈ సందర్భంగా తిరిగి సర్వే పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో మండల ఆదాయ అధికారి కె. శ్యామ్ సుందర్, మండల కొలతల అధికారి బాపురావు, మండల భూ రికార్డుల పర్యవేక్షకుడు రాథోడ్ నూర్ సింగ్, గ్రామ పంచాయతీ అధికారి అనసూయ, గ్రామ సర్పంచి, గ్రామస్థులు పాల్గొన్నారు.

న్యూఢిల్లీలో ఆర్టిఫిషియల్ రెయిన్

(న్యూఢిల్లీ, సాక్షర): దేశ రాజధాని దిల్లీలో పెరుగుతున్న వాయు కాలుష్యాన్ని అరికట్టేందుకు ఐఐటీ కాన్పూర్ కీలక నిర్ణయం తీసుకుంది. దిల్లీలో మరోసారి కృత్రిమ వర్షం (క్లౌడ్ సీడింగ్) సాధ్యాసాధ్యాలను అధ్యయనం చేస్తున్నట్లు వెల్లడించింది. ప్రస్తుత వాతావరణంలో మేఘాలు ఏర్పడటానికి, వర్షం కురవడానికి సరిపడా తేమ ఉందో లేదో అంచనా వేసేందుకు ఈ పరిశీలన జరుగుతోందని ఐఐటీ వర్గాలు తెలిపాయి. అనుకూలమైన తేమ పరిస్థితులను సంస్థ నిర్ధరించుకున్న తర్వాతే ఈ ఆపరేషన్పై తుది నిర్ణయం తీసుకుంటారని చెప్పాయి. ఈ ఆపరేషన్ కోసం విమానం సిద్ధంగా ఉందని, అనుమతులు రాగానే ఇది దిల్లీ నుంచే టేకాఫ్ అవుతుందని అధికారులు వెల్లడించారు.దీపావళి వేడుకల అనంతరం దిల్లీలో వాయు కాలుష్యం తీవ్రస్థాయికి చేరుకుంది. ఉష్ణోగ్రతలు పడిపోవడం, దట్టమైన పొగమంచు కమ్మేయడంతో కాలుష్య తీవ్రత మరింత పెరిగింది. రాష్ట్రవ్యాప్తంగా వాటర్ స్ప్రింక్లర్లను ఉపయోగించి, సూక్ష్మ కణాల ప్రభావాన్ని తగ్గించడానికి దిల్లీ ప్రభుత్వం కాలుష్య నియంత్రణ చర్యలు తీసుకుంటోంది. బుధవారం ఉదయం 7 గంటలకు కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి (రికార్డు చేసిన గణాంకాల ప్రకారం దిల్లీలో సగటు ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ 299 పూర్ కేటగిరీగా నమోదైంది.సగటు మెరుగ్గా కనిపిస్తున్నప్పటికీ, దిల్లీలోని పలు కీలక ప్రాంతాల్లో గాలి నాణ్యత 'అత్యంత అధ్వాన్నం' కేటగిరీలోనే కొనసాగుతోంది. సెంట్రల్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ డేటా ప్రకారం, ఛాప్లాలో అత్యధికంగా 396 ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ నమోదైంది. ఆ తర్వాతి స్థానాల్లో చాందినీ చౌక్ (379), (375), దిల్లీ (375), నార్త్ క్యాంపస్ (374), (367), బురారీ క్రాసింగ్ (362), పూసా (359), నరేలా (352), జాఫర్పూర్ (351), ద్వారక (350), మథుర రోడ్ (348), పంజాబీ బాగ్ (341), (339), అయా నగర్ (337), తల్కటోరా గార్డెన్ (331), వివేక్ విహార్ (326), సిరిఫోర్ట్ (321), వజీర్పూర్ (321), జహంగీర్పురి (320), బురారీ (315), బదర్పూర్ (312), ముండ్కా (305), ఆనంద్ విహార్ (304), బావానా (304) ఆర్.కె. పురం (300) ఉన్నాయి.రాజధానిలోని మరికొన్ని ప్రాంతాల్లో గాలి నాణ్యత 'పేలవమైన' విభాగంలోనే కొనసాగింది. రోహిణిలో 298, అశోక్ విహార్లో 298, ద్వారక-సెక్టార్ 8లో 295, జరోడా కలాన్లో 289, ఇగ్నో మైదాన్ గర్హిలో 287, IGI విమానాశ్రయం (T3) వద్ద 282, అలీపూర్లో 279, ఉత్తమ్ నగర్లో 259 నమోదయ్యాయి. ఈ విభాగంలో లోధి రోడ్ వద్ద అత్యల్పంగా 203 నమోదైంది.ముందుగా శాస్త్రవేత్తలు కృత్రిమ వర్షానికి అనువైన మేఘాలను గుర్తిస్తారు. అందులో సరిపడా తేమ ఉంటుంది. కానీ, వర్షాలు కురిసేందుకు అనువైన పరిస్థితులు ఉండవు. అలాంటి సందర్భంలోనే సిల్వర్ అయోడైడ్, పొటాషియం అయోడైడ్ లాంటి రసాయన ఉత్ప్రేరకాలను మేఘాలపై చల్లి క్లౌడ్ సీడింగ్ ప్రక్రియను చేపడతారు. ఇవి మేఘాల్లోని తేమను కరిగించి, వర్షపు బిందువుల రూపంలో కింద పడేందుకు సహకరిస్తాయి. ఇందుకు కొన్ని సార్లు పొడి మంచును కూడా వినియోగిస్తారు. దీనివల్ల మేఘాలు చల్లబడి వర్షం కురిసేందుకు వీలుంటుంది.

మరో ఉద్యోగితో రిలేషన్..

- జేన్సన్ హువాంగ్‌పై వేటుకు ఎన్వీడియో బోర్డు సిద్ధం

న్యూఢిల్లీ:అమెరికా చిప్ తయారీ కంపెనీ ఎన్వీడియా సీఈవో జేన్సన్ హువాంగ్‌పై చర్యలు తీసుకునేందుకు ఆ కంపెనీ బోర్డు సిద్ధమైనట్లు ఓ నివేదిక ద్వారా వెల్లడైంది. చైనీస్ గూఢాచారితో పాటు మరో మహిళతోను సీఈవో జేన్సన్ వివాహేతర సంబంధం పెట్టుకున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తిన విషయం తెలిసిందే. త్వరలోనే కంపెనీ బోర్డు సభ్యులు సమావేశం కానున్నారని ఆ నివేదికలో వెల్లడైంది. ఒకవేళ హువాంగ్‌ను తప్పిస్తే, అప్పుడు సుమారు 4 ట్రిలియన్ల డాలర్ల చిప్ తయారీ కంపెనీ భవితవ్యం ఆగమ్యగోచరంగా మారనున్నది. జేన్సన్ అఫైర్ వార్తలు బయటకు పొక్కడంతో ఆ కంపెనీ షేర్లు అమాంతం 8 శాతం పడిపోయాయి. ఈ వారంలోనే ఆ కంపెనీ సుమారు 600 బిలియన్ల మార్కెట్ విలువను కోల్పోయింది. హువాంగ్‌ను తక్షణమే తొలగించలేని పరిస్థితిలో ఆ కంపెనీ ఉన్నది. ఎందుకంటే ఆయనకు వారసుడిగా ఎవర్ని ప్రకటించాలన్న దానిపై ఇంకా క్లారిటీ లేదు. ఒకవేళ కంపెనీ విధానాలను కానీ, చట్టాలను కానీ హువాంగ్ ఉల్లంఘించినట్లు రుజువైతే, దానికి తగిన ఆధారాలు ఉంటే, ఆయనపై చర్యలు తీసుకుంటామని టెక్నాలజీ రీసర్చ్ హెడ్ గిల్ లూరియా తెలిపారు. చైనీస్ గూఢాచారిణి అలిస్

కేసీఆర్ మళ్లీ ముఖ్యమంత్రి కావాలని పాదయాత్ర

(మహబూబ్‌నగర్, సాక్షర): మూసాపేట మండలం తిమ్మాపూర్, జానంపేట గ్రామాలకు చెందిన బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు కేసీఆర్ మళ్లీ ముఖ్యమంత్రి కావాలని, దేవరకద్ర ఎమ్మెల్యేగా ఆల వెంకటేశ్వర్ రెడ్డి తిరిగి గెలవాలని ఆకాంక్షిస్తూ కురుమూర్తి స్వామి దేవస్థానం వరకు 35 కిలోమీటర్ల పాదయాత్ర చేపట్టారు. మార్గమధ్యంలో బీఆర్ఎస్ శ్రేణులు ఘనస్వాగతం పలికారు. సాయంత్రం ఆలయానికి చేరుకున్న నాయకులు, కార్యకర్తలు కేసీఆర్, ఆల వెంకటేశ్వర్ రెడ్డి విజయాలను కాంక్షిస్తూ ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఇచ్చిన మాట నిలబెట్టుకున్నాం.. శంకర్ గౌడ్ కుటుంబానికి అండగా నిలిచాం! మంత్రి పొన్నం

(హైదరాబాద్, సాక్షర): నర్సంపేట ఆర్టీసీ డిపోలో డ్రైవర్‌గా పనిచేస్తూ ఆత్మహత్య చేసుకున్న స్వర్గీయ శంకర్ గౌడ్ కుటుంబానికి ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా నిలిచిందని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు.. ముఖ్యమంత్రి సూచనల మేరకు ప్రభుత్వం, ఆర్టీసీ తరపున కుటుంబానికి పరిహారం అందించాం. తెలంగాణ వ్యాప్తంగా ఆర్టీసీ ఉద్యోగులు తమ ఒక రోజు వేతనాన్ని విరాళంగా అందించి దాదాపు రూ.కోటి ఆర్థిక సహాయం చేసి కుటుంబానికి అండగా నిలిచారు. ఇచ్చిన హామీ మేరకు శంకర్ గౌడ్ కుమారుడు హేమంత్ గౌడ్‌కు ఆర్టీసీలో రికార్డ్ ట్రెజరర్‌గా ఉద్యోగ నియామక పత్రాన్ని ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డి తో కలిసి అందజేశారు. ఆర్టీసీ ఉద్యోగుల సంక్షేమం మా ప్రభుత్వ బాధ్యత.ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడం ఆర్టీసీ బాధ్యత. ఉద్యోగులను కాపాడుకోవడం సమాజం బాధ్యత.ఆర్టీసీ ఉద్యోగులు దురుసుగా ప్రవర్తిస్తే ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయాలి. భౌతిక దాడులకు పాల్పడకూడదు.ఉద్యోగులపై దాడులు చేస్తే ప్రభుత్వం తీవ్రంగా స్పందిస్తుంది. చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటాం. ప్రయాణికులు మర్చిపోయిన విలువైన వస్తువులను నిజాయితీగా తిరిగి అప్పగిస్తున్న ఆర్టీసీ ఉద్యోగులు ఎందరో ఉన్నారు. వారి సేవలను గుర్తించాలని అన్నారు..మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం నేపథ్యంలో రద్దీకి అనుగుణంగా అదనపు బస్సులను ఏర్పాటు చేస్తున్నాం.ప్రయాణికుల అవసరాలకు అనుగుణంగా కొత్త బస్సుల కొనుగోలు, బస్టాండ్ల ఆధునీకరణకు చర్యలు తీసుకుంటున్నాం. ఏ గ్రామానికైనా బస్సు సౌకర్యం అవసరమైతే స్థానిక ఆర్టీసీ అధికారులను సంప్రదించాలి. రూట్ వెరిఫికేషన్, సాధ్యాసాధ్యాల పరిశీలన అనంతరం బస్సు సౌకర్యం కల్పిస్తాం.బాధిత కుటుంబానికి ఇచ్చిన మాటను నిలబెట్టుకోవడం మా బాధ్యత. ఆ కుటుంబానికి ఎల్లప్పుడూ అండగా ఉంటామని అన్నారు

నా జీవితం తెరిచిన పుస్తకం:డీకే శివకుమార్



- సిద్ధరామయ్య సహా ఎవరికీ చెడు తలపెట్టనని స్పష్టీకరణ
- సీఎం కావడం కన్నా 48 ఏళ్ల వయసులో డిగ్రీ పొందడమే ఎక్కువ సంతోషాన్ని ఇచ్చిందని వ్యాఖ్య
- కష్టపడితేనే గుర్తింపు, అదృష్టాన్ని నమ్మొద్దని యువతకు సూచన
- విమర్శలు కాలక్రమేణా కనుమరుగవుతాయి, పనులే మిగులుతాయని వెల్లడి

మైసూరు:తన జీవితం ఒక తెరిచిన పుస్తకమని, అందులో దాచడానికి రహస్యాలేమీ లేవని కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి సిద్ధరామయ్య సహా తాను ఎవరికీ కీడు తలపెట్టబోనని ఆయన పేర్కొన్నారు. మైసూరులో తన జీవిత చరిత్ర 'చలిసువ బండె డీకే శివకుమార్' పుస్తకావిష్కరణ సభలో ఆయన ప్రసంగించారు. "నేను సిద్ధరామయ్యతో కలిసి పనిచేశాను. ఆయనకు గానీ, మరెవరికీ గానీ నేను చెడు కోరుకోను. ఇతరులకు హాని తలపెట్టే వ్యక్తిని నేను కాదు, భవిష్యత్తులోనూ అలా చేయను. ఇదే నా నిబద్ధత" అని శివకుమార్ వివరించారు. మానవత్వమే అన్నింటికన్నా ముఖ్యమని, అన్ని కులాలు, మతాల ప్రజలను తాము ప్రేమిస్తామని, గౌరవిస్తామని తెలిపారు. తన ఎదుగుదలను ప్రతిపక్షాలు జీర్ణించుకోలేకపోతున్నాయని, అయితే విమర్శలకు తాను వెరవబోనని స్పష్టం చేశారు. గతంలో కేంద్ర మంత్రి హెచ్‌డీ కుమారస్వామితో రాజకీయ విభేదాలు ఉన్నప్పటికీ, కాంగ్రెస్ పార్టీ ఆయనతో పొత్తు పెట్టుకోవాలని నిర్ణయించినప్పుడు ఆయనను ఇబ్బంది పెట్టకుండా, మద్దతుగా నిలిచేందుకే ప్రయత్నించానని గుర్తుచేశారు. "మనం చేసే పనిని మన మనస్సాక్షి అంగీకరిస్తే చాలు" అని ఈ సందర్భంగా ఆయన వ్యాఖ్యానించారు. ముఖ్యమంత్రి లేదా కేబినెట్ మంత్రి పదవులు చేపట్టడం కంటే, 48 ఏళ్ల వయసులో మైసూరు ఓపెన్ యూనివర్సిటీ ద్వారా డిగ్రీ పట్టా అందుకోవడం తన జీవితంలో అత్యంత సంతోషకరమైన క్షణమని శివకుమార్ పేర్కొన్నారు. కష్టకాలంలో జైలులో ఉన్నప్పుడు కూడా తాను ఆత్మవిశ్వాసం కోల్పోలేదని, పార్టీని తిరిగి అధికారంలోకి తీసుకువస్తాననే నమ్మకంతో పనిచేశానని తెలిపారు. యువత అదృష్టాన్ని నమ్ముకోకుండా కష్టం, క్రమశిక్షణపై ఆధారపడాలని హితవు పలికారు. విమర్శలు కాలక్రమేణా కనుమరుగవుతాయని, కానీ మనం చేసిన పనులే శాశ్వతంగా నిలిచిపోతాయని పేర్కొన్నారు.

చెరువు సుందరీకరణ పేరుతో 122 ఇళ్లకు నోటీసులు

- బాధితులకు అండగా నిలుస్తాం : డీసీసీ అధ్యక్షుడు నరేష్ జాదవ్‌ఇతర



(ఆదిలాబాద్ టౌన్, సాక్షర) ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని ఖానాపూర్ (కొలిపుర) కాలనీలో చెరువు సుందరీకరణ పనుల నేపథ్యంలో చెరువు పక్కన నివాసం ఉంటున్న 122 ఇళ్ల యజమానులకు ఇళ్లను ఖాళీ చేసి తొలగించాలంటూ సంబంధిత అధికారులు నోటీసులు జారీ చేశారు.ఈ విషయం తెలుసుకున్న ఆదిలాబాద్ జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) అధ్యక్షుడు డా. నరేష్ జాదవ్, మాజీ డీసీసీ అధ్యక్షుడు సాజిద్ ఖాన్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ అల్లూరి సంజీవరెడ్డి, మాజీ టీపీసీసీ జనరల్ సెక్రటరీ గండ్రత్ సుజాత కొలిపుర కాలనీని సందర్శించి, కాలనీలో పర్యటిస్తూ నోటీసులు అందుకున్న బాధిత కుటుంబాలను నేరుగా కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.ఎన్నో ఏళ్లుగా ఇక్కడే నివాసం ఉంటూ జీవనం సాగిస్తున్న తమకు ఇళ్ల తొలగింపు నోటీసులు రావడంతో తీవ్ర ఆందోళనకు గురవుతున్నామని స్థానికులు తమ ఆవేదనను డా. నరేష్ జాదవ్ దృష్టికి తీసుకువచ్చారు.ఈ సందర్భంగా డా. నరేష్ జాదవ్ బాధితుల సమస్యలను, వారి ఇబ్బందులను సావధానంగా విన్నారు. ప్రజలకు ఎలాంటి అన్యాయం జరగకుండా, ఇబ్బందులు కలగకుండా సమస్యను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి న్యాయం జరిగేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు.ప్రజల సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకుంటూ, బాధితులకు అండగా నిలవడమే లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ ప్రజల పక్షాన ఉంటుందని ఈ సందర్భంగా పేర్కొన్నారు.కార్యక్రమంలో ఆయనతోపాటు కాంగ్రెస్ పార్టీ టౌన్ ప్రెసిడెంట్ కిజార్ పాషా, టౌన్ జనరల్ సెక్రటరీ మహేందర్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

సైదులు మృతి ముదిరాజ్ సమాజానికి తీరని లోటు

- మన ముదిరాజ్ మహాసభ నేతల తీవ్ర సంతాపం



(ఆదిలాబాద్ ప్రతినిధి, సాక్షర) సీనియర్ విలేకరి, రచయిత, సామాజిక శాస్త్ర పరిశోధకుడు, ముదిరాజ్ జాతి అభ్యున్నతి కోసం తుది శ్వాస విడిచే వరకు తపించిన గొప్ప మానవతావాది పోలంపల్లి సైదులు మృతి పట్ల మన ముదిరాజ్ మహాసభ రాష్ట్ర కమిటీ తీవ్ర సంతాపం ప్రకటించింది.ఆయన మృతి వార్త వినగానే రాష్ట్ర కమిటీ నేతలు దిగ్భ్రాంతికి గురయ్యారు. క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్న ఆయనను ఆదుకునేందుకు ఎన్నో విధాలుగా ప్రయత్నాలు చేసినప్పటికీ ఆయన కన్నుమూయడం దురదృష్టకరమన్నారు. ముదిరాజ్ సమాజం ఆయన కుటుంబానికి పూర్తి అండదండలు ఇస్తుందని తెలిపారు. ఆయన మృతి పట్ల తీవ్ర సంతాపం వ్యక్తం చేస్తూ వారి కుటుంబ సభ్యులకు మన ముదిరాజ్ మహాసభ నేతలు తమ ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేశారు.సంతాపం తెలిపిన వారిలో మన ముదిరాజ్ రాష్ట్ర అధ్యక్షుడు వైద్యుడు చొప్పరి శంకర్, ఉపాధ్యక్షులు అందె బాబయ్య, పగిడాల సుధాకర్, ఈటెల భద్రయ్య, తుమ్మల గంగాధర్, పిట్ల నగేష్, రాస వెంకటి, వైద్యుడు బోయిని జగన్మోహన్, వైద్యుడు నిజ్జన రమేష్, కావలి ఆంజనేయులు, వైద్యుడు శీలం పాపారావు, యాసాడ నర్సింగ్, బొజ్జ నారాయణ, భాస్కర్, కోల వనిత, రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు సలేంద్ర శివయ్య, మద్దెల సంతోష్, అంజయ్య, కరుణాకర్, రాష్ట్ర కార్యదర్శులు బి.ఆర్. బిందుశ్రీ, కొప్పెర వెంకట నరసయ్య, మూసి శ్రీనివాస్, రాష్ట్ర కోశాధికారి బైండ్ల సత్యనారాయణ, యువజన విభాగం అధ్యక్షుడు బొమ్మరగొని రాజు, ప్రధాన కార్యదర్శి జక్కం కార్తీక్, గండు రాజు, రిషి, తెలంగాణ సంపత్, లక్ష్మి ఆంజనేయులు, మహిళా నాయకులు పోచమల్ల అశ్విని, సిరవేన స్వప్న, కోడూరి శ్రీదేవి, ఉమాదేవి తదితరులు ఉన్నారు.

తలమడుగును కరువు మండలంగా ప్రకటిస్తాం

- ఆదిలాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ బోరంచు శ్రీకాంత్ రెడ్డి గిడ్డంగికి రోడ్డు, కరువు మండల ప్రకటనపై హామీ సర్పంచుల ఆందోళనకు స్పందించిన శ్రీకాంత్ రెడ్డి



(తలమడుగు , సాక్షర) తలమడుగు మండలాన్ని కరువు మండలంగా ప్రకటించాలని డిమాండ్ చేస్తూ సర్పంచులు మండల సమావేశాన్ని బహిష్కరించిన నేపథ్యంలో, ఆదిలాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ బోరంచు శ్రీకాంత్ రెడ్డి అక్కడికి చేరుకుని సర్పంచులతో మాట్లాడారు. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం అధ్యక్షుడు దామోదర్ రెడ్డితో కలిసి తలమడుగును కరువు ప్రాంతంగా ప్రకటించేలా, తలమడుగు గిడ్డంగి రోడ్డు నిర్మాణానికి అవసరమైన చర్యలు తీసుకువస్తామని భరోసానిచ్చారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని అన్ని మండలాలతో పాటు తలమడుగు మండలాన్ని కూడా కరువు మండలంగా ప్రకటించాలని కాంగ్రెస్ పార్టీ తరపున, జిల్లా కాంగ్రెస్ సమితి ఆధ్వర్యంలో, మార్కెట్ అధ్యక్షుడిగా తాము ఇప్పటికే కలెక్టర్ ద్వారా ప్రభుత్వానికి నివేదిక పంపడం జరిగిందని తెలిపారు. అవసరమైతే సర్పంచులు, రైతులతో కలిసి మంత్రులు, ముఖ్యమంత్రిని కలిసి తలమడుగును కరువు మండలంగా ప్రకటించేలా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. అలాగే, తలమడుగు గిడ్డంగి వరకు రోడ్డు సౌకర్యం త్వరలోనే తీసుకువస్తామని హామీనిచ్చారు.ప్రతి పంటకు సూక్ష్మ పోషకాలు ఎంతో కీలకమని, రసాయన ఎరువుల వాడకం వల్ల భూమి గట్టిపడిపోతున్నదని పేర్కొంటూ రైతులు భూసారాన్ని కాపాడుకునేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. సర్పంచులు, అనుభవజ్ఞులైన రైతులు తోటి రైతులకు అవగాహన కల్పించాలని, వ్యవసాయ అధికారులు కూడా ప్రతి గ్రామంలో ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో మండల పరిష్కార అభివృద్ధి అధికారి శంకర్, వ్యవసాయ అధికారులు శ్రీనివాస్ రావు, ప్రమోద్ రెడ్డి, స్థానిక సర్పంచులు, పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

కోతకొచ్చిన పంటకు కొనుగోళ్లు లేవు, అమ్ముకున్న ధాన్యానికి గిట్టుబాటు ధర లేదు,

- ఇదేనా కాంగ్రెస్ రైతు సంక్షేమం.
- రైతు రాజ్యం అని చెప్పి, రైతును రోడ్డున పడేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం.
- తక్షణమే ఐకేపీ కేంద్రాలు ప్రారంభించి, మద్దతు ధరతో పాటు బోనస్ చెల్లించాలి.
- కోదాడ మాజీ శాసనసభ్యులు బొల్లం మల్లయ్య యాదవ్



(సూర్యాపేట, సాక్షర): ఈరోజు కోదాడ మాజీ శాసనసభ్యులు బొల్లం మల్లయ్య యాదవ్ తమ నివాసంలో ప్రస్తుతం కోదాడ నియోజకవర్గంలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం పచ్చి రైతు వ్యతిరేక విధానాలను అవలంబిస్తూ రైతుల ఉసురు తీసుకుంటుందని, కాంగ్రెస్ ప్రభుత్వ అసమర్థతపై మాజీ శాసనసభ్యులు శ్రీ బొల్లం మల్లయ్య యాదవ్ తీవ్రంగా మండిపడ్డారు. ఖరీఫ్ సీజన్ లో ఎల్ నినో ప్రభావంతో వర్షాలు లేక పంటలు నష్టపోయిన మండలాలను కరువు మండలాలుగా ప్రకటించి ప్రభుత్వం చేతులు దులుపుకుందని, అలా ప్రకటించి ఇన్ని రోజులవుతున్నా నేటికీ ఆయా మండలాల్లో నష్టపోయిన రైతులను గుర్తించి ఎవ్వరికి ఒక్క రూపాయి కూడా కరువు పరిహారం అందించకపోవడం ఈ ప్రభుత్వ చేతగానితనానికి నిదర్శనం అని మండిపడ్డారు. ఒకపక్క కరువుతో అరాకొరా పండిన ధాన్యం కళ్లాల వద్దకు వచ్చి, అమ్ముకునే సమయానికి దళారులతో కాంగ్రెస్ నాయకులు మరియు ప్రభుత్వం కుమ్మక్కై రాత్రికి రాత్రే ధాన్యం రేట్లను అమాంతం తగ్గించడం అత్యంత దారుణమన్నారు. రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన పంటకు కనీస గిట్టుబాటు ధర కూడా దక్కక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులకు గిట్టుబాటు ధర కల్పించడంతో పాటు, ప్రభుత్వం ఏర్పడటానికి ముందు తాము ఇచ్చిన ప్రధాన హామీ అయిన 'ధాన్యానికి బోనస్' ను తక్షణమే రైతుల ఖాతాల్లో జమ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. రైతులు వరి కోతలు కోసి, రోజుల తరబడి రోడ్లమీద కుప్పలు పోసుకుని ఎదురుచూస్తున్నా... ఇంతవరకు ఐకేపీ (ఐకెపి) ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించకపోవడం శోచనీయమన్నారు. ఐకేపీ సెంటర్లు ప్రారంభం కాకపోవడం వల్ల, గిట్టుబాటు ధర రాక రైతులు పడుతున్న ఇబ్బందులపై ప్రముఖంగా వచ్చిన పత్రికా కథనాలే ఈ కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యానికి సజీవ సాక్ష్యాలు అన్నారు. పత్రికలు ఘోషిస్తున్నా, రైతులు రోడ్లపై కన్నీరు పెడుతున్నా కాంగ్రెస్ ప్రభుత్వానికి కనీసం చీమ కుట్టినట్లు కూడా లేకపోవడం సిగ్గుచేటన్నారు. తక్షణమే రాష్ట్రవ్యాప్తంగా, ముఖ్యంగా కోదాడ నియోజకవర్గంలో ఐకేపీ కేంద్రాలను యుద్ధప్రాతిపదికన ప్రారంభించి, రైతులకు మద్దతు ధరతో పాటు బోనస్ చెల్లించాలని, అలాగే పెండింగ్ లో ఉన్న కరువు పరిహారాన్ని వెంటనే విడుదల చేయాలని శ్రీ బొల్లం మల్లయ్య యాదవ్ గారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రైతుల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం మొండి వైఖరిని విడనాడకపోతే, రైతాంగంతో కలిసి కాంగ్రెస్ ప్రభుత్వ మెడలు వంచేలా పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని ఆయన హెచ్చరించారు.

ఐఆర్‌సీఎస్ సేవా కార్యక్రమాలను విస్తృతం చేయాలి



- సభ్యత్వ నమోదు మరింత పెంచాలి
- జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్
- ఐఆర్‌సీఎస్ మేనేజింగ్ కమిటీ సభ్యులతో కలెక్టర్ సమావేశం

రాజన్న సిరిసిల్ల:ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ (ఐఆర్‌సీఎస్) ఆధ్వర్యంలో జిల్లావ్యాప్తంగా సేవా కార్యక్రమాలను మరింత విస్తృతంగా చేపట్టాలని ఆ సంస్థ జిల్లా అధ్యక్షురాలు, జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ పిలుపునిచ్చారు. సమాజ సేవే లక్ష్యంగా పనిచేస్తూ, ప్రజలకు మరిన్ని సేవలు అందించేలా కార్యాచరణ రూపొందించుకోవాలని సూచించారు.గురువారం జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ మేనేజింగ్ కమిటీ సభ్యులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. జిల్లాలో ప్రణాళికాబద్ధంగా సేవా కార్యక్రమాలను చేపట్టాలని, సంస్థ సభ్యత్వ నమోదును మరింత పెంచాలని సూచించారు.అలాగే ఐఆర్‌సీఎస్ కార్యాలయం ఏర్పాటు, నూతన బ్లడ్ బ్యాంక్ నిర్మాణం, ఇతర సేవా కార్యక్రమాల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులకు, కమిటీ సభ్యులకు సూచించారు. ప్రజలకు అవసరమైన సేవలను అందించడంలో రెడ్ క్రాస్ సొసైటీ మరింత చురుకైన పాత్ర పోషించాలని పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఐఆర్‌సీఎస్ జిల్లా చైర్మన్ గూడూరి రవీందర్, వైస్ చైర్మన్ ప్రయాకరావు వేణు కుమార్, సెక్రటరీ సీహెచ్ సంతోష్ కుమార్, సలహాదారు ఈవీ శ్రీనివాసరావు, రాష్ట్ర మేనేజింగ్ కమిటీ సభ్యుడు పీవీ సంజీవరెడ్డి, కోశాధికారి చంద్రగిరి శ్రీధర్, మేనేజింగ్ కమిటీ సభ్యులు ఎం. అజయ్ బాబు, ఏ. శివప్రసాద్, కే. బాబు, సీహెచ్ శ్రీనివాస్, దేవదాస్, అరుణ, రాజు, సురేంద్రబాబు, శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

భూముల తిరిగి కొలతలు వేగవంతం చేయాలి : కలెక్టర్ ఇలా త్రిపాఠి

- రోవర్ సాయంతో కొలతలు ... మాదాపూర్, వెల్గటూర్లో కలెక్టర్ తనిఖీ తిరిగి కొలతల్లో నిర్లక్ష్యం వద్దు : అధికారులకు కలెక్టర్



(నిజామాబాద్ ప్రతినిధి, సాక్షర) రైతులు, యజమానుల ప్రయోజనం కోసం ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూముల తిరిగి కొలతల ప్రక్రియను ఎలాంటి లోటుపాట్లు లేకుండా వేగవంతం చేయాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి సంబంధిత అధికారులను ఆదేశించారు.జక్రాన్‌పల్లి మండలం మాదాపూర్, మెండోరా మండలం వెల్గటూర్లో కొనసాగుతున్న భూముల తిరిగి కొలతల ప్రక్రియను కలెక్టర్ ఇలా త్రిపాఠి గురువారం అదనపు కలెక్టర్ రాజాగౌడ్తో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తూ, రోవర్ సాయంతో కొలతలు నిర్వహిస్తున్న తీరును క్షుణ్ణంగా పరిశీలిస్తూ, సర్వే, భూమి రికార్డుల అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు.ప్రభుత్వ మార్గదర్శకాలను పక్కాగా పాటిస్తూ, నిబంధనలకు అనుగుణంగా పూర్తి పారదర్శకంగా కొలతలు నిర్వహించాలని, భవిష్యత్తులో ఎలాంటి ఇబ్బందులు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. రైతులు, పట్టాదార్లకు ఇబ్బందులు కలగకుండా చూడాలన్నారు.ప్రతిరోజు సగటున 30 ఎకరాల చొప్పున కొలతలు నిర్వహిస్తూ, వేగవంతంగా ఈ ప్రక్రియను పూర్తి చేయాలని అన్నారు. కొలతల సందర్భంగా క్షేత్రస్థాయిలో ఏవైనా ఇబ్బందులు ఏర్పడితే, తమ దృష్టికి తేవాలన్నారు. తిరిగి కొలతలు వేగవంతం చేయడానికి అదనంగా అవసరమైన రోవర్ యంత్రాలను సమకూరుస్తామని అన్నారు.తిరిగి కొలతల ప్రక్రియ నిర్వహణలో అలసత్వానికి తావిస్తే ఎంతమాత్రం ఉపేక్షించబోమని, నిర్లక్ష్యంగా వ్యవహరించే అధికారులు, సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ స్పష్టం చేశారు.కొలతలు చేపట్టే ముందు సంబంధిత రైతులకు తప్పనిసరిగా ముందస్తు సమాచారం అందించి, వారి సమక్షంలో కొలతలు నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు. భూమి హద్దుల వివరాల నమోదులో పొరపాట్లు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. గ్రామ హద్దు, ప్రభుత్వ భూమి, పట్టా భూములకు సంబంధించిన పూర్తి వివరాలు తిరిగి కొలతల ఆధారంగా పక్కాగా నమోదు చేయాలన్నారు.కొలతల అనంతరం గ్రామ సభలు నిర్వహిస్తూ, ఎవరికైనా అభ్యంతరాలు ఉంటే వారి నుంచి దరఖాస్తులు స్వీకరించి వేగంగా పరిష్కరించాలన్నారు. తిరిగి కొలతల విషయంలో రైతులకు, భూ యజమానులకు ఏవైనా సందేహాలు ఉంటే వాటిని నివృత్తి చేయాలని సూచించారు.కలెక్టర్ వెంట ఆర్మూర్ ఉప కలెక్టర్ అభిగ్యాన్ మాల్వియ, సర్వే,

ఆయుధ ప్రదర్శన వెనుక ఇరాన్ వ్యూహం ఏమిటి?

క్షిపణులతో ప్రపంచానికి హెచ్చరికా? అమెరికా ఆధిపత్యానికి సవాలా? మధ్యప్రాచ్యంలో కొత్త శక్తి సమీకరణమా? ప్రపంచ రాజకీయాల్లో ఆయుధాలు కేవలం యుద్ధ సాధనాలు మాత్రమే కావు. అవి ఒక దేశ ఆత్మవిశ్వాసానికి, భయానికి, రాజకీయ సంకల్పానికి, అంతర్జాతీయ వ్యూహానికి ప్రతీకలు కూడా! ఇప్పుడు ఇరాన్ నిర్వహిస్తున్న ఆయుధ ప్రదర్శన ఈ కోణంలో ప్రపంచ దేశాల దృష్టిని ఆకర్షిస్తోంది. టెహ్రాన్‌లోని నేషనల్ ఏరోస్పేస్ పార్క్‌లో ఇరాన్ తన సైనిక సాంకేతిక సామర్థ్యాలను ప్రపంచానికి చూపిస్తోంది. బాలిస్టిక్ క్షిపణులు, హైపర్‌సోనిక్ క్షిపణులు, మానవరహిత వైమానిక వాహనాలు (డ్రోన్లు), వైమానిక రక్షణ వ్యవస్థలు, అంతరిక్ష సాంకేతిక పరిజ్ఞానం.. ఇలా ఆధునిక యుద్ధానికి అవసరమైన అనేక వ్యవస్థలను ప్రదర్శనలో ఉంచింది.అయితే అసలు ప్రశ్న ఏమిటంటే.. ఇరాన్ ఈ సమయంలో తన ఆయుధ సంపత్తిని ఎందుకు ప్రపంచానికి చూపిస్తోంది? ఇది కేవలం సైనిక ప్రదర్శనా? లేక అంతర్జాతీయ రాజకీయాలకు ఇస్తున్న వ్యూహాత్మక సందేశమా? అమెరికాకు ఒక రాజకీయ సందేశం! దశాబ్దాలుగా అమెరికా ఆర్థిక ఆంక్షలు, అంతర్జాతీయ ఒత్తిళ్లను ఎదుర్కొంటున్న దేశం ఇరాన్. అణు కార్యక్రమం, క్షిపణి అభివృద్ధి, మధ్యప్రాచ్య రాజకీయాల్లో ఇరాన్ పాత్ర వంటి అంశాలు అమెరికాతో దాని సంబంధాలను నిరంతరం ఉద్రిక్తంగా ఉంచుతున్నాయి.అమెరికా సైనిక, ఆర్థిక శక్తికి నేరుగా పోటీ ఇవ్వడం ఇరాన్‌కు సాధ్యం కాకపోవచ్చు. కానీ తక్కువ వ్యయంతో తయారయ్యే డ్రోన్లు, వివిధ శ్రేణుల క్షిపణులు, స్వదేశీ రక్షణ వ్యవస్థల ద్వారా ప్రత్యర్థికి భారీ వ్యయాన్ని కలిగించగలమనే వ్యూహాన్ని ఇరాన్ అనుసరిస్తోంది. అందుకే ఈ ప్రదర్శన ద్వారా అమెరికాకు ఇరాన్ చెబుతున్న సందేశం ఒక్కటే కావచ్చు.. ఆంక్షలు విధించినంత మాత్రాన మా సైనిక సామర్థ్యాన్ని పూర్తిగా నిర్వీర్యం చేయలేరు! ఇజ్రాయెల్‌కు హెచ్చరికా? ఇరాన్-ఇజ్రాయెల్ మధ్య ఘర్షణలు మధ్యప్రాచ్య ప్రాంతీయ భద్రతను తీవ్రంగా ప్రభావితం చేస్తున్నాయి. 2025 జూన్‌లో జరిగిన 12 రోజుల యుద్ధం ఇరాన్ రక్షణ వ్యవస్థల్లోని బలహీనతలను బయటపెట్టింది. అదే సమయంలో క్షిపణి దాడులు, వైమానిక రక్షణ వ్యవస్థల ప్రాధాన్యతను కూడా ప్రపంచానికి తెలియజేసింది. 2026లో అమెరికా-ఇజ్రాయెల్‌తో ఇరాన్‌కు ఏర్పడిన సైనిక ఘర్షణలు ఈ పోటీని మరింత సంక్లిష్టం చేశాయి. ఈ నేపథ్యంలో ఇరాన్ తన క్షిపణి, డ్రోన్ సామర్థ్యాలను ప్రదర్శించడం ద్వారా ఇజ్రాయెల్‌కు కూడా ఒక సందేశం పంపుతున్నట్లు భావించవచ్చు. తమపై దాడి జరిగితే ప్రతిస్పందించే సామర్థ్యం ఉందని ప్రత్యర్థికి గుర్తుచేయడం ఇందులో ప్రధాన ఉద్దేశంగా కనిపిస్తోంది.అయితే ప్రదర్శనలో చూపించిన ఆయుధాల సంఖ్య లేదా రూపాన్ని బట్టి వాటి వాస్తవ యుద్ధ సామర్థ్యాన్ని నిర్ణయించలేం. వాటి లక్ష్యసాధన సామర్థ్యం, నిఘా వ్యవస్థలు, సాంకేతిక విశ్వసనీయత, ప్రత్యర్థి రక్షణ వ్యవస్థలను అధిగమించే సామర్థ్యం కీలకం. డ్రోన్ల యుగంలో మారుతున్న యుద్ధ వ్యూహాల! ఆధునిక యుద్ధ చరిత్రలో రష్యా-ఉక్రెయిన్ యుద్ధం, మధ్యప్రాచ్య ఘర్షణలు ఒక విషయాన్ని స్పష్టం చేశాయి. యుద్ధంలో గెలవడానికి భారీ యుద్ధ విమానాలు, అత్యంత ఖరీదైన ఆయుధాలే అవసరం లేదు. తక్కువ ధరతో తయారయ్యే డ్రోన్లు కూడా శక్తిమంతమైన దేశాల రక్షణ వ్యవస్థలకు సవాలు విసరగలవు.ఇరాన్ తయారీ షాహెద్ డ్రోన్లు అంతర్జాతీయంగా చర్చకు వచ్చాయి. ఈ సాంకేతికతను ఇతర దేశాలు కూడా పరిశీలిస్తున్నాయి. తక్కువ వ్యయంతో ఎక్కువ సంఖ్యలో డ్రోన్లను తయారు చేయడం, వాటిని వివిధ యుద్ధ పరిస్థితుల్లో వినియోగించడం ఇరాన్ వ్యూహంలో ఒక ముఖ్యమైన అంశం.ఇక్కడ మరో విషయం గమనించాలి. ఒక దేశం ఆయుధాలను తయారు చేయడం ఒక ఎత్తయితే, వాటిని నిరంతరం ఉత్పత్తి చేయగల పరిశ్రమను నిర్మించడం మరో ఎత్తు. ఇరాన్ ఇప్పుడు రెండో అంశంపై కూడా దృష్టి పెడుతోంది. భూగర్భ క్షిపణి నగరాలు.. మరో వ్యూహాత్మక కోణం! ఇటీవల ఇరాన్ రివల్యూషనరీ గార్డ్స్ ప్రకటించిన భూగర్భ క్షిపణి ఉత్పత్తి కేంద్రాల అంశం కూడా ప్రాధాన్యత సంతరించుకుంది. భూమి లోతుల్లో క్షిపణుల నిల్వ మాత్రమే కాకుండా, వాటి తయారీ కేంద్రాలను కూడా అభివృద్ధి చేస్తున్నట్లు ఇరాన్ ప్రకటించింది.యుద్ధ సమయంలో శత్రు దేశాలు వైమానిక దాడులు చేసినా ఆయుధ ఉత్పత్తి ఆగిపోకుండా ఉండాలన్నది ఈ వ్యూహం వెనుక ఉన్న ఆలోచన.అయితే ఇరాన్ ప్రకటిస్తున్న ప్రతి సైనిక సామర్థ్యాన్ని స్వతంత్రంగా నిర్ధారించిన వాస్తవంగా పరిగణించకూడదు. ప్రభుత్వ ప్రకటనలకు, వాస్తవ యుద్ధ సామర్థ్యానికి మధ్య తేడా ఉండవచ్చు.దేశీయ ప్రజలకు ఆత్మవిశ్వాసం.. ప్రపంచానికి సంకేతం! ఈ ప్రదర్శనకు మరో ముఖ్యమైన కోణం దేశీయ రాజకీయాలు. ఆర్థిక ఆంక్షలు, ద్రవ్యోల్బణం, యుద్ధ భయాలు, అంతర్జాతీయ ఒత్తిళ్ల మధ్య ఇరాన్ ప్రజల్లో జాతీయ ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడం ప్రభుత్వానికి అవసరం. దేశీయంగా తయారైన ఆయుధాలను ప్రజలకు చూపించడం ద్వారా సాంకేతిక స్వావలంబన, జాతీయ భద్రత, స్వదేశీ పరిశ్రమల ప్రాధాన్యతను ప్రభుత్వం ప్రచారం చేయగలదు. అంటే ఈ ప్రదర్శన విదేశీ శత్రువులకు మాత్రమే కాదు.. సొంత ప్రజలకు కూడా ఒక రాజకీయ సందేశం. చైనా, రష్యా, భారత్‌లకు ఏమి సంకేతం? ఇరాన్ ఆయుధ ప్రదర్శనను కేవలం అమెరికా, ఇజ్రాయెల్ కోణంలోనే చూడటం సరిపోదు. ప్రపంచ శక్తి సమీకరణల్లో మార్పులు చోటుచేసుకుంటున్న తరుణంలో పశ్చిమాసియాలో ఇరాన్ స్థానం కూడా కీలకమైనది.చైనా, రష్యాలు ఇరాన్‌తో వ్యూహాత్మక సంబంధాలు కొనసాగిస్తున్నాయి. మరోవైపు భారత్‌కు ఇరాన్‌తో చారిత్రక, వాణిజ్య, భౌగోళిక సంబంధాలు ఉన్నాయి. ముఖ్యంగా చాబహార్ పోర్టు, మధ్య ఆసియా రవాణా మార్గాలు భారత్‌కు వ్యూహాత్మకంగా ప్రాధాన్యత కలిగినవి.అయితే ఇరాన్ సైనిక బలప్రదర్శన వల్ల ప్రాంతీయ ఉద్రిక్తతలు పెరిగితే భారత్ వంటి దేశాలకు ఇంధన భద్రత, సముద్ర వాణిజ్యం, విదేశాల్లో పనిచేస్తున్న భారతీయుల భద్రత వంటి అంశాల్లో సవాళ్లు ఏర్పడవచ్చు. ఆయుధ పోటీ ప్రపంచానికి ఎలాంటి ప్రమాదం? ఒక దేశం తన భద్రత కోసం ఆయుధాలు సమకూర్చుకుంటే మరో దేశం కూడా అదే కారణంతో మరింత ఆయుధ సంపత్తిని పెంచుకుంటుంది. ఈ క్రమం అంతర్జాతీయంగా ఆయుధ పోటీకి దారితీస్తుంది. మధ్యప్రాచ్యంలో ఇప్పటికే అనేక దేశాలు సైనిక సామర్థ్యాలను పెంచుకుంటున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో ఇరాన్ ప్రదర్శన ప్రాంతీయ దేశాల్లోనూ రక్షణ వ్యయాలను పెంచే అవకాశముంది. అంతిమంగా ఆయుధాల పెరుగుదల ప్రజల సంక్షేమానికి కేటాయించాల్సిన వనరులను కూడా ప్రభావితం చేస్తుంది. యుద్ధంలో గెలిచినా ఓడినా నష్టపోయేది సాధారణ ప్రజలే. ప్రాణనష్టం, ఆర్థిక విధ్వంసం, నిరాశ్రయత్వం, తరతరాలపై పడే ప్రభావం యుద్ధం మిగిల్చే చేదు నిజాలు. బలం చూపడం ఒక వ్యూహం.. శాంతిని కాపాడడం అసలైన విజయం! ఇరాన్ ఆయుధ ప్రదర్శనను మూడు కోణాల్లో అర్థం చేసుకోవచ్చు. ఒకటి.. అమెరికా, ఇజ్రాయెల్‌కు తన రక్షణ సామర్థ్యాన్ని తెలియజేయడం. రెండోది.. ఆంక్షల మధ్య స్వదేశీ సైనిక పరిశ్రమను బలోపేతం చేసుకున్నామని ప్రపంచానికి చెప్పడం. మూడోది.. దేశీయంగా ప్రజల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడం. కానీ ఒక దేశం వద్ద ఎన్ని క్షిపణులు ఉన్నాయి? ఎన్ని డ్రోన్లు ఉన్నాయి? ఎంత శక్తివంతమైన ఆయుధ వ్యవస్థలు ఉన్నాయి? అన్నదానికంటే ఆ ఆయుధాలను యుద్ధానికి ఉపయోగించాల్సిన పరిస్థితి రాకుండా చేయగల రాజకీయ పరిణతి ఎంత ఉందన్నదే ప్రపంచానికి ముఖ్యం. ప్రపంచం ఇప్పుడు మరో ప్రచ్ఛన్న యుద్ధాన్ని, మరో ఆయుధ పోటీని భరించే స్థితిలో లేదు. దేశాల మధ్య విభేదాలను చర్చల ద్వారా పరిష్కరించుకోవాల్సిన అవసరం గతంలో కంటే ఇప్పుడు ఎక్కువగా ఉంది. ఆయుధాలతో భయాన్ని సృష్టించవచ్చు.. కానీ శాంతితోనే విశ్వాసాన్ని సంపాదించవచ్చు. క్షిపణుల పరిధి ఎంత దూరమైనా.. దౌత్యం పరిధి అంతకంటే విస్తృతంగా ఉండాలి. అదే మానవాళికి అవసరమైన నిజమైన విజయం! -



వ్యాసకర్త: ఉక్కుల కర్ రాజేందర్ నాథ్ , సీనియర్ జర్నలిస్ట్,
కామారెడ్డి జిల్లా అక్రెడిటేషన్ కమిటీ సభ్యులు 9440287170

ఆదివాసీ గ్రామాలకు రోడ్లు మంజూరు చేయాలి



- తుడుం దెబ్బ రాష్ట్ర అధ్యక్షుడు గోడం గణేష్

(తలమడుగు, సాక్షర): ఆదివాసీ హక్కుల పోరాట సమితి తుడుం దెబ్బ తలమడుగు మండల కమిటీ ఆధ్వర్యంలో తలమడుగు మండలంలోని దేవాపూర్, బరంపూర్, చర్లపల్లి, ఝరి, రత్నపూర్ గ్రామాలను గురువారం క్షేత్రస్థాయిలో సందర్శించి గ్రామాల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా తుడుం దెబ్బ రాష్ట్ర అధ్యక్షుడు గోడం గణేష్ మాట్లాడుతూ స్వాతంత్ర్యం సిద్ధించి 80 సంవత్సరాలు గడిచినా ఇప్పటికీ ఆదివాసీ గ్రామాలకు రోడ్డు సౌకర్యం కల్పించకపోవడం చాలా విచారకరమన్నారు. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి దేవాపూర్ చెక్ పోస్ట్ నుండి పునాగూడ వరకు, ఝరి నుండి రత్నపూర్ వరకు రోడ్డు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా తలమడుగు మండలాన్ని కరువు మండలంగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో తుడుం దెబ్బ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి వెట్టి మనోజ్, రాష్ట్ర కార్యదర్శి అర్కా శేషారావు, జిల్లా ఉపాధ్యక్షులు కుమర జ్ఞానేష్, జంగల పోచన్న, వర్కింగ్ ప్రెసిడెంట్ గోడం బుజంగారావు, రైతు సంఘం అధ్యక్షుడు పెందుర్ మాధవరావు, ఉపాధ్యక్షుడు అనక రాంజీ, సర్పంచులు ఆత్రం సూర్యబాన్, ఆత్రం అశోక్, మాజీ సర్పంచ్ తొడసం హేమంత్, పెందుర్ జైతు పటేల్, మెస్రం నాగోరావ్ పటేల్, నైతం బాజేరావు పటేల్, ఆత్రం సీతారాం, పెందూరు శంభు, ఆయా గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అమలు

- జిల్లాలో 8,209 మందికి నూతన పెన్షన్ మంజూరు
- ఈ నెల 19వ తేది నుంచి లబ్ధిదారుల ఖాతాల్లో పెన్షన్ నగదు జమ
- రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమెల్యే ఆది శ్రీనివాస్
- వేములవాడలో జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ తో కలిసి మంజూరు పత్రాలు పంపిణీ చేసిన ప్రభుత్వ విప్



(రాజన్న సిరిసిల్ల, సాక్షర): నవంబర్ 12 : ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధికి సమాన ప్రాధాన్యతనిస్తూ ముందుకు సాగుతున్నదని, అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ ఫలాలు అమలు చేస్తున్నామని రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ తెలిపారు. వేములవాడ నియోజకవర్గ స్థాయి చేయూత నూతన పెన్షన్ మంజూరు పత్రాల పంపిణీ కార్యక్రమాన్ని వేములవాడ పట్టణంలోని ఫంక్షన్ హాల్ లో నిర్వహించగా, ముఖ్య అతిథిగా ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ హాజరయ్యారు. ముందుగా జయ జయహే తెలంగాణ గీతంతో ప్రారంభించారు. అనంతరం లబ్ధిదారులకు పెన్షన్ మంజూరు పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రతి రోజూ సుమారు 18 గంటలు శ్రమిస్తూ రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారని పేర్కొన్నారు. ఇందిరాగాంధీ జయంతి సందర్భంగా ఈ నెల 19వ తేది నుంచి కొత్తగా మంజూరైన పెన్షన్ల నగదు లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో జమ అయ్యేలా ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని తెలిపారు. జిల్లాలో కొత్తగా 8,209 పెన్షన్లు మంజూరు చేసినట్లు వెల్లడించారు.ఇప్పటికే జిల్లాలో 1,13,264 మందికి పెన్షన్లు అందుతున్నాయని, కొత్తగా మంజూరైన పెన్షన్లతో కలిపి మొత్తం 1,21,473 మందికి ప్రతి నెలా పెన్షన్లు అందనున్నాయని వివరించారు. ఇందుకోసం ప్రతి నెలా సుమారు రూ.25.97 కోట్ల నిధులను ప్రభుత్వం వెచ్చించనుందని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాల ఫలాలు అందించడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డులు, సన్న బియ్యం పంపిణీ లాంటి పథకాలను కొనసాగిస్తూ, ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నామని తెలిపారు. ఒకవైపు సంక్షేమ పథకాల ద్వారా పేదలకు అండగా నిలుస్తూ, మరోవైపు మౌలిక సదుపాయాల కల్పనతో రాష్ట్ర అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందని పేర్కొన్నారు.జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. వితంతువులు, ఒంటరి మహిళలు, దివ్యాంగులు (తలసేమియా, సికిల్ సెల్, హిమోఫీలియా) గీత కార్మికులు, నేత కార్మికులు, ఫైలేరియా, డయాలసిస్ బాధితులు నుంచి ఇప్పటికే దరఖాస్తుదారులు స్వీకరించామని తెలిపారు. అర్హుల ఎంపిక కోసం అధికారులతో విచారణ చేయించామని పేర్కొన్నారు. ఆగస్టు 01 వ తేదీ నుంచి సెప్టెంబర్ 15వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరించామని, ఆయా దరఖాస్తులను అధికారులు విచారణ చేయించామని తెలిపారు. ఈ నెల 18 వ తేదీ వరకు మంజూరు పత్రాలు అందిస్తామని పేర్కొన్నారు. 19వ తేదీన తర్వాత లబ్ధిదారుల బ్యాంక్ ఖాతాలో డబ్బులు జమ అవుతాయని వెల్లడించారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, వారి పేరిట ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తున్నామని, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ద్వారా మౌలిక వసతులు కల్పించే పనులు చేయిస్తున్నామని పేర్కొన్నారు. మహిళా సంఘాల ద్వారా స్కూల్ విద్యార్థులకు యూనిఫాంలు కుట్టించే బాధ్యత అప్పగించామని తెలిపారు. వయోవృద్ధుల సంరక్షణ కోసం ప్రభుత్వ చట్టం చేసిందని, త్వరలో అమలు కానున్నదని పేర్కొన్నారు.కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నాగుల సత్యనారాయణ గౌడ్ మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు, వైస్ చైర్మన్ నరాల శేఖర్, మార్కెట్ కమిటీ చైర్మన్లు రొండి రాజు, చెలుకల తిరుపతి, కచ్చకాయల ఎల్లయ్య, ఫ్యాక్స్ ఛైర్మెన్లు వకులాభరణం శ్రీనివాస్, బొమ్మెన భాస్కర్, ఏగోలపు శ్రీనివాస్, గసికంటి ప్రభాకర్, పిల్లి కనకయ్య,ఆర్డీఓ కే ఎస్ బీ కుమారి, డీఆర్డీఓ లక్ష్మీనారాయణ మున్సిపల్ కమిషనర్ లోకేష్, తహసీల్దార్ జయంత్ తదితరులు పాల్గొన్నారు

మాలలకు 20 లోపు రెండు రోస్టర్ పాయింట్ లను కేటాయించాలి



(ఆదిలాబాద్ టౌన్, సాక్షర): మాల సంక్షేమ సంఘం ఆదిలాబాద్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో గురువారం వంతుల వారీ నిరాహార దీక్ష జరిగింది.ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు కొప్పుల రమేష్ మాట్లాడుతూ ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు కలెక్టర్ కార్యాలయం ముందు వంతుల వారీ నిరాహార దీక్ష చేశామని తెలిపారు. షెడ్యూల్డ్ కులాల వర్గీకరణ రోస్టర్ బిందువుల్లో అవలంబించిన విధానానికి వ్యతిరేకంగా, ఇటీవల విడుదలైన ప్రభుత్వ జ్ఞాపిక సంఖ్య 1628 రద్దు చేయాలని డిమాండ్ చేస్తున్నామని తెలిపారు. షెడ్యూల్డ్ కులాల వర్గీకరణ రోస్టర్ పాయింట్‌లో మాలలకు 10 లోపు ఒక రోస్టర్ బిందువు కేటాయించాలని, 11 నుండి 20 లోపు ఒక రోస్టర్ పాయింట్ కేటాయించాలని, మాలలకు 20 లోపు రెండు రోస్టర్ పాయింట్ లను కేటాయించాలని, ఇటీవల విడుదలైన ప్రభుత్వ మెమో నెం 1628 రద్దు చేయాలని అన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు కొప్పుల రమేష్, ప్రధాన కార్యదర్శి బొబ్బిలి సుధాకర్, గౌరవ అధ్యక్షుడు మేకల మల్లన్న, సీనియర్ నాయకుడు సింగరి అశోక్, మేదరి స్వామి, గైని ప్రకాష్, సహ అధ్యక్షులు పాశం రాఘవేంద్ర, ముచ్చ రఘు, మలిపతి సుభాష్, మాల ఉద్యోగుల సంక్షేమ సంఘం జిల్లా శాఖ అధ్యక్షుడు చిలుక పొచ్చన్న, ప్రధాన కార్యదర్శి అలుక బుచ్చిబాబు, ఆర్థిక కార్యదర్శి అయితే పొచ్చన్న, సహ అధ్యక్షుడు బొమ్మెత సుభాష్, జిల్లా నాయకులు బి ప్రభాకర్, ఎలుక రాజు, మాదాసు అర్జున్, పబ్బత్ అడేల్లు, పిప్పల్ కోటి సర్పంచి దాసరి రమేష్, నిపాని సర్పంచి మల్లెల స్వామి, సుంకిడి సర్పంచి మగ్గిడి ప్రకాష్, గూడ సర్పంచి రఘు, ఉండం సర్పంచి మహేందర్, తలమడుగు సర్పంచి చంటి, కాటం రమేష్, ఇంద్రవెల్లి అధ్యక్షుడు రాజేశ్వర్, రాంనగర్ బుద్ధ విహార్ అధ్యక్షుడు జి భీంరావ్, సోగల సుదర్శన్, జి తుకరాం, వాగ్మారే కాంతారావు, వివిధ గ్రామాల కార్యవర్గ సభ్యులు, మండల కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

ఈశ్వరీయ బ్రహ్మకుమారీస్ కేంద్రంలో ఘనంగా భాయ్ దూజ్ దీపావళి వేడుకలు



(ఆదిలాబాద్ టౌన్, సాక్షర): ఆదిలాబాద్ పట్టణంలోని ఈశ్వరీయ బ్రహ్మకుమారీస్ కేంద్రంలో భాయ్ దూజ్ దీపావళి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మున్సిపల్ చైర్‌పర్సన్ బండారి అనూష సతీష్ దీపాలు వెలిగించి వేడుకలను ప్రారంభించారు.ఈ సందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ బండారి అనూష సతీష్ మాట్లాడుతూ.. భారతీయ సంస్కృతి, సంప్రదాయాలకు దీపావళి పండుగ ప్రత్యేకమైన గుర్తింపు అని, భాయ్ దూజ్ పండుగ అన్నాచెల్లెళ్లు, అక్కాతమ్ముళ్ల మధ్య ఉన్న ప్రేమానురాగాలు, ఆప్యాయత, ఆత్మీయతకు ప్రతీకగా నిలుస్తుందని అన్నారు. ప్రతి ఒక్కరి జీవితాల్లో ప్రేమ, శాంతి, సంతోషం, సౌభాగ్యం నిండాలని ఆకాంక్షించారు.ఈశ్వరీయ బ్రహ్మకుమారీస్ సంస్థ సమాజంలో ఆధ్యాత్మిక చింతన, మానసిక ప్రశాంతత, సోదరభావం పెంపొందించేందుకు చేస్తున్న సేవలు అభినందనీయమని కొనియాడారు. ఇలాంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు ప్రజల్లో సానుకూల ఆలోచనలు, మానవీయ విలువలను పెంపొందిస్తాయని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో కరీంనగర్‌కు చెందిన విజయలక్ష్మి అక్కయ్య, రేవతి అక్కయ్య, దేవదాస్ దేశ్‌పాండే, బ్రహ్మకుమారీస్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఆదిలాబాద్‌లో 'చేయూత' పెన్షన్ల పంపిణీ



(ఆదిలాబాద్, సాక్షర): ఆదిలాబాద్‌లో ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన 'చేయూత' పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్‌తో కలిసి ఆదిలాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ బోరంచు శ్రీకాంత్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో లబ్ధిదారులకు నూతన పింఛన్లను పంపిణీ చేసి, ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో డీఆర్‌డీఓ పీడీ రాథోడ్ రవీందర్, డీపీఓ జి. రమేష్, ఎంపీడీవో వంశీ

డబుల్ బెడ్‌రూం ఇండ్లు అందించేందుకు చర్యలు జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా



(నిర్మల్ ప్రతినిధి, సాక్షర) అర్హులైన పేదలకు డబుల్ బెడ్‌రూం ఇండ్లు అందించడంతో పాటు, లబ్ధిదారులకు అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలు కల్పించాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు.గురువారం సోన్ మండలంలోని సంగెంపేట్ గ్రామంలో నిర్మించిన డబుల్ బెడ్‌రూం ఇళ్లను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యుత్, రహదారులు, డ్రైనేజీ, తాగునీరు, పారిశుద్ధ్యం తదితర మౌలిక వసతులపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఇళ్లకు అవసరమైన అన్ని సదుపాయాలను త్వరితగతిన కల్పించాలని సూచించారు.ప్రతి ఇంటికి ఇంకుడు గుంత నిర్మించాలని, తద్వారా వర్షపు నీటిని భూమిలోకి ఇంకింపజేసి భూగర్భ జలాల సంరక్షణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని సూచించారు. అనంతరం గ్రామస్థులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. అవసరమైన సదుపాయాల కల్పనకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అలాగే, జాబ్ కార్డులు కలిగిన ప్రతి ఒక్కరూ విబిజి రామ్ జీ పథకం ద్వారా ఉపాధి పనులు పొందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సంతోష్, ఎంపీడీవో రామకృష్ణ, హౌసింగ్ డీఈ గంగాధర్, సర్పంచ్ విలాస్, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

జాతీయ ఆరోగ్య కాంటాక్ట్ అండ్ అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు కోరుతున్నదేమిటి?

- క్రమబద్ధీకరణ, ఉద్యోగ భద్రత, వేతన సమస్యలు పరిష్కరించలేరా? భారతీయ కార్మిక సంఘాల సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి బి. వెంకట నారాయణ




(ఆదిలాబాద్ ప్రతినిధి, సాక్షర) 2026 అక్టోబర్ 13 నుంచి జాతీయ ఆరోగ్య మిషన్లో పనిచేస్తున్న 17,541 మంది కాంటాక్ట్ అండ్ అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు తమ న్యాయమైన సమస్యల పరిష్కారం కోసం రాష్ట్రవ్యాప్తంగా నిరవధిక సమ్మె చేస్తున్నప్పటికీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఏమాత్రం పట్టించుకోకుండా మొండిగా, నిర్లక్ష్యంగా ఉండడాన్ని భారతీయ కార్మిక సంఘాల సమాఖ్య తీవ్రంగా నిరసిస్తుందని సమాఖ్య ఆదిలాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి. వెంకట నారాయణ అన్నారు.గురువారం ఆదిలాబాద్‌లోని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి కార్యాలయం ముందు జాతీయ ఆరోగ్య మిషన్ ఉద్యోగులు చేస్తున్న నిరవధిక సమ్మెకు భారతీయ కార్మిక సంఘాల సమాఖ్య, అఖిల భారత రైతు కూలీ సంఘం, ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం జిల్లా కమిటీలు సంపూర్ణ మద్దతు తెలియజేశాయి.ఈ సందర్భంగా సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి బి. వెంకట నారాయణ, అఖిల భారత రైతు కూలీ సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి కే. సాయన్న, ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మడవి గణేష్ మాట్లాడుతూ, జాతీయ ఆరోగ్య మిషన్ ఉద్యోగుల క్రమబద్ధీకరణ, ఉద్యోగ భద్రత, కనీస వేతన సమస్యలను పరిష్కరించలేని ప్రభుత్వాలు ఈ దేశంలో, రాష్ట్రంలో పాలన కొనసాగిస్తున్నాయని ఎద్దేవా చేశారు.గత రెండు దశాబ్దాలుగా ఒప్పంద, బయటి సేవల విధానంలో పనిచేస్తున్న జాతీయ ఆరోగ్య మిషన్ ఉద్యోగులు కోరుతున్నది రాజ్యాంగం కల్పించిన చట్టబద్ధ హక్కులు, సౌకర్యాలనే అని అన్నారు.కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉమ్మడిగా నిర్వహిస్తున్న జాతీయ ఆరోగ్య మిషన్ ఉద్యోగులు రెండు దశాబ్దాలుగా పనిచేస్తున్నా వారి సేవలను క్రమబద్ధీకరించలేదని, వేతనాలు సక్రమంగా, సకాలంలో ఇవ్వడం లేదని, పూర్తి మొత్తంలో జీతం లేదని, ఆరోగ్య బీమా, జీవిత బీమా సౌకర్యం లేదని, పదవీ విరమణ ప్రయోజనాలు లేవని, చట్టం ప్రకారం గ్రాట్యుటీ, పింఛన్ సౌకర్యం లేదని తెలిపారు. కనుక క్రమబద్ధ ఉద్యోగులతో సమానంగా విధులు, బాధ్యతలు నిర్వహిస్తున్నప్పటికీ తమకు సమాన వేతనం, మహిళా ఉద్యోగులకు ప్రసూతి సెలవులతో పాటు అవసరమైన ఇతర ఉద్యోగ భద్రత, సంక్షేమ సౌకర్యాలు లభించేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నప్పటికీ ఈ ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరించడం బాధాకరమని అన్నారు.పెరుగుతున్న నిత్యవసర సరుకుల ధరలు, విద్య, వైద్యం తదితర ఖర్చులు నిత్యం పెరుగుతున్న స్థితిలో, చాలీచాలని వేతనాలతో జీవితాలను గడుపుతున్న జాతీయ ఆరోగ్య మిషన్ ఒప్పంద, బయటి సేవల ఉద్యోగులు నిత్యం అనేక ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.వీరికి బ్యాంకులు వ్యక్తిగత గృహ రుణాలు ఇవ్వడానికి నిరాకరిస్తున్నాయని, వాస్తవానికి శాశ్వత పని స్థలాల్లో ఒప్పంద, బయటి సేవల ఉద్యోగులను క్రమంగా వారి ఉద్యోగాలను క్రమబద్ధీకరణ చేసి ఒప్పంద రద్దు చట్టం - 1976 ప్రకారం ఈ విధానాన్ని రద్దు చేయవలసి ఉంటుందని, చట్టం వచ్చిన తర్వాత పాలకులు అటువైపు ఒక్క అడుగు కూడా వేయలేదని విమర్శించారు.ఇక సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని భారత రాజ్యాంగంలోని 39(డి) అధికరణం నిర్దేశిస్తుందని, అంతే కాదు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని 1964 నుంచి 2016 అక్టోబర్ 26 వరకు సర్వోన్నత న్యాయస్థానంతో సహా వివిధ రాష్ట్ర ఉన్నత న్యాయస్థానాలు సుమారు 64 రకాల తీర్పులు ఇచ్చాయని, అయినా పాలకులు పట్టించుకోకపోవడం ఎంత దుర్మార్గమో కార్మిక వర్గం, ఉద్యోగులు అర్థం చేసుకోవాలని, భారతీయ జనతా పార్టీ, కాంగ్రెస్ ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా బలమైన కార్మికోద్యమాన్ని నిర్మించాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో సమాఖ్య జిల్లా నాయకుడు గౌరాల సుభాష్, ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కనక దత్తాత్రి, జాతీయ ఆరోగ్య మిషన్ ఉద్యోగ సంఘాల సంయుక్త కార్యాచరణ సమితి నాయకులు, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

సోనియాగాంధీ ఆత్మకథపై పీవీ కుమార్తె వాణీదేవి తీవ్ర విమర్శలు

- సోనియాగాంధీ ఆత్మకథపై స్పందించిన పీవీ కుమార్తె ఎమ్మెల్సీ -సురభి వాణీదేవి
- మాజీ ప్రధాని పీవీ అంత్యక్రియలు న్యూఢిల్లీలో ఎందుకు నిర్వహించలేదని ప్రశ్న
- స్వతంత్ర భారత చరిత్రలో ఏ ప్రధానికీ ఇలాంటి పరిస్థితి ఎదురుకాలేదన్న వాణీదేవి
- సోనియా జ్ఞాపకాల పుస్తకం అబద్ధాల పుట్ట అన్న పీవీ మనవడు ఎన్వీ సుభాష్

కాంగ్రెస్ అగ్రనేత సోనియాగాంధీ ఆత్మకథ 'బిలాంగింగ్: ఏ జర్నీ ఆఫ్ లవ్' విడుదలైన నేపథ్యంలో... మాజీ ప్రధాని దివంగత పి.వి. నరసింహారావు కుటుంబ సభ్యుల నుంచి తీవ్ర స్పందన వ్యక్తమైంది. పీవీపై సోనియాకు గౌరవమే ఉంటే ఆయన అంత్యక్రియలను దేశ రాజధాని ఢిల్లీలో ఎందుకు నిర్వహించలేదని పీవీ కుమార్తె, ఎమ్మెల్సీ సురభి వాణీదేవి సూటిగా ప్రశ్నించారు. "సోనియాగాంధీ ఆత్మకథ 'బిలాంగింగ్: ఏ జర్నీ ఆఫ్ లవ్' నేను ఇంకా చదవలేదు. కానీ తనకు పీవీతో ఎలాంటి విభేదాలు లేవని, ఆయనంటే ఎంతో గౌరవమని, తన అత్త, మాజీ ప్రధాని ఇందిర, భర్త రాజీవ్‌గాంధీకి అత్యంత ఆప్తుడని సోనియా ఆ పుస్తకంలో నిక్షిప్తం చేసినట్టు మీడియా ద్వారా విన్నాను. కానీ పార్టీకి, గాంధీ కుటుంబానికి సేవచేసిన, దేశ ప్రధానిగా పనిచేసిన పీవీ అంత్యక్రియలను ఢిల్లీలో జరపలేదెందుకు? స్వతంత్ర భారత చరిత్రలో ఏ ప్రధానికీ ఇలా జరగలేదు. దీనిని గౌరవంగా భావించాలా? అవమానమని అనుకోవాలా?" అంటూ ఆమె నిలదీశారు. మరోవైపు పీవీ మనవడు, బీజేపీ అధికార ప్రతినిధి ఎన్వీ సుభాష్ సైతం సోనియా పుస్తకంపై తీవ్రంగా స్పందించారు. ఈ ఆత్మకథ అసత్యాల పుట్ట అని, చారిత్రక తప్పిదాలతో కూడి ఉందని ఆయన విమర్శించారు. కాంగ్రెస్ పార్టీకి, దేశానికి పీవీ నరసింహారావు అందించిన సేవలను పుస్తకంలో ఉద్దేశపూర్వకంగానే దాటవేశారని ఆరోపించారు. తమ కుటుంబ సభ్యులను మాత్రమే పైకి తెస్తూ, పార్టీలోని ఇతర ముఖ్య నేతలను కించపరచడం గాంధీ కుటుంబానికి అలవాటేనని ఆయన పేర్కొన్నారు. తాజా పరిణామాలతో పీవీ పట్ల కాంగ్రెస్ వైఖరిపై రాజకీయ వర్గాల్లో మరోసారి చర్చ మొదలైంది.

ప్రభాస్ 24 ఏళ్ల నట ప్రస్థానం, సెలబ్రేట్ చేసుకుంటున్న ఫ్యాన్స్



బాక్సాఫీస్ వద్ద కొత్త చరిత్రలు సృష్టించే రెబల్ స్టార్ ప్రభాస్ నట ప్రస్థానం నేటికి 24 ఏళ్లకు చేరుకుంది. ఈశ్వర్ సినిమాతో మొదలైన ప్రభాస్ సిల్వర్ స్క్రీన్ జర్నీ బాక్సాఫీస్ వద్ద దిగ్విజయంగా కొనసాగుతోంది. ఈశ్వర్ తర్వాత వరుసగా సక్సెస్ లతో స్టార్ హీరోగా ఎదిగారు ప్రభాస్. ఇక బాహుబలితో ప్రారంభమైన ఆయన పాన్ ఇండియా జర్నీ ఇప్పుడు పాన్ వరల్డ్ కు చేరుకుంది. ప్రభాస్ తొలి సినిమా "ఈశ్వర్" 2022, నవంబర్ 11న ప్రేక్షకుల ముందుకొచ్చింది. ఈ రోజును రెబల్ ఫ్యాన్స్ తో పాటు మూవీ లవర్స్ స్పెషల్ డేగా గుర్తుంచుకుంటారు. నేటితో రెబల్ స్టార్ నట ప్రస్థానం 24 ఏళ్లకు చేరుకున్న సందర్భాన్ని అభిమానులు ప్రత్యేకంగా సెలబ్రేట్ చేసుకుంటున్నారు. సోషల్ మీడియాలో ప్రభాస్ @24 ఇయర్స్ స్పెషల్ డిపిలు, పోస్టర్స్ సందడి చేస్తున్నాయి. తనపై అభిమానుల, ప్రేక్షకుల పెంచుకున్న ప్రేమాభిమానాలతో ప్రభాస్ తన భారీ పాన్ ఇండియా సినిమాల లైనప్ కంటిన్యూ చేస్తున్నారు. సందీప్ వంగా దర్శకత్వంలో టీ సిరీస్ నిర్మిస్తున్న స్పిరిట్, హను రాఘవపూడి దర్శకత్వంలో మైత్రీ మూవీ మేకర్స్ నిర్మిస్తున్న ఫౌజీ, వైజయంతీ మూవీస్ నిర్మాణంలో దర్శకుడు నాగ్ అశ్విన్ రూపొందిస్తున్న కల్కి 2, ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో హోంబలే ఫిలింస్ నిర్మించనున్న సలార్ 2 చిత్రాల్లో ఆయన నటిస్తున్నారు. ఫౌజీ సినిమా సమ్మర్ లో బాక్సాఫీస్ వద్ద సందడి చేయబోతోంది. అలాగే స్పిరిట్ సినిమా వచ్చే ఏడాది దీపావళికి రిలీజ్ కానుంది. కల్కి 2 ప్రస్తుతం షూటింగ్ జరుగుతోంది. త్వరలోనే సలార్ 2 సినిమా కూడా సెట్స్ మీదకు వెళ్లనుంది.

డార్క్ చాక్లెట్' యూఎస్ ప్రీమియర్స్‌కు అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది.: హీరో విశ్వదేవ్ రాచకొండ



విశ్వదేవ్ రాచకొండ, బిందు మాధవి లీడ్ రోల్స్‌లో రానా దగ్గుబాటి స్పిరిట్ మీడియా, వాల్టెయిర్ ప్రొడక్షన్స్‌తో కలిసి నిర్మిస్తున్న చిత్రం 'డార్క్ చాక్లెట్'. శశాంక్ శ్రీవాస్తవ దర్శకత్వం వహించిన ఈ సినిమా ప్రమోషనల్ కంటెంట్‌కు ఇప్పటికే మంచి రెస్పాన్స్ వచ్చింది. యూఎస్ ప్రీమియర్స్‌లోనూ అద్భుతమైన స్పందన లభించింది. ఈ సినిమా నవంబర్ 13న వరల్డ్ వైడ్‌గా విడుదల కానుంది. ఈ సందర్భంగా హీరో విశ్వదేవ్ రాచకొండ విలేకరుల సమావేశంలో సినిమా విశేషాలను పంచుకున్నారు. యూఎస్ ప్రీమియర్స్‌కు ఎలాంటి రెస్పాన్స్ వచ్చింది? యూఎస్ రివ్యూస్‌కు అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది. క్రిటిక్స్, ఆడియన్స్ రివ్యూస్ కూడా చాలా బాగున్నాయి. సినిమా చాలా ఎంగేజింగ్‌గా ఉందని చెబుతున్నారు. అలాగే పర్ఫార్మెన్స్ విషయంలో కూడా చాలా అప్రిషియేట్ చేస్తున్నారు. ఈ మధ్యకాలంలో ఇంత ఎంగేజింగ్‌గా ఉన్న సినిమా ఇదే అని చెప్పడం మాకు చాలా ఆనందాన్ని ఇచ్చింది. ఇందులో ఎలాంటి క్యారెక్టర్ చేస్తున్నారు? -ఇందులో నా పాత్ర పేరు యజ్ఞ. తను ఒక సినిమాలో హీరోగా వరుసగా మూడు హిట్స్ కొట్టి, ఆ తర్వాత కొన్ని అపజయాలు చూసి డౌన్‌ఫాల్‌లో ఉంటాడు. కాస్త పిచ్చిపిచ్చిగా ప్రవర్తిస్తుంటాడు. ఇష్టానుసారంగా బిహేవ్ చేసే క్యారెక్టర్. తనను ఫిల్మ్ ఛాంబర్ నుంచి బ్యాన్ చేస్తారు. దీంతో తనకు ఎవరూ అక్కర్లేదని, తానే అన్నీ చేసుకోవాలని నిర్ణయించుకుంటాడు. డైరెక్షన్, మాటలు, పాటలు, కొరియోగ్రఫీ.. అన్నీ తానే చూసుకోవాలనుకుంటాడు. అక్కడి నుంచి ఒక కథ రాయడం మొదలుపెడతాడు. అతనికి పిచ్చిపిచ్చి కలలు వస్తుంటాయి. ఆ కలలేంటి? ఆ కలల్లోకి ఎవరు వస్తున్నారు? తన బెస్ట్ ఫ్రెండ్, తన లవ్ ఇంట్రెస్ట్, అలాగే తన బాబాయ్ క్యారెక్టర్‌తో తన జర్నీ ఎలా ఉంటుంది? నిజంగా వాళ్లు వచ్చారా? లేకపోతే కలలో కనిపించారా? ఇదంతా చాలా ఇంట్రెస్టింగ్‌గా ఉంటుంది. ఇప్పటివరకు సినిమా చూసిన వాళ్లంతా ఇలాంటి సినిమా ఎక్కడా, ఎప్పుడూ రాలేదని చెబుతున్నారు. కచ్చితంగా ఒక కొత్త సినిమా తీశాం. ఇది ఆడియన్స్ అందరికీ, అన్ని వర్గాల ప్రేక్షకులకు అర్థమయ్యేలా ఉంటుంది. ఇందులో డైలాగ్స్ చాలా ప్రధానంగా ఉంటాయి. ఒక క్యారెక్టర్ ఏం చెబుతుంది? దానికి అవతలి క్యారెక్టర్ ఎలాంటి రియాక్షన్ ఇస్తుంది? అనేది కూడా చాలా ఇంపార్టెంట్. ఇది ఏ జోనర్ సినిమా? ఇది సర్వైవల్ డ్రామా, డార్క్ కామెడీ, మ్యూజికల్, సైకలాజికల్ థ్రిల్లర్.. ఇలా ఉత్కంఠగా సాగే సినిమా. ఇందులో సోషల్ కామెంట్రీ కూడా ఉంటుంది. ఇప్పటివరకు చూడని ఒక కొత్త ఎక్స్‌పీరియన్స్‌ను క్రియేట్ చేశాం. -ఇందులో నా క్యారెక్టర్ చాలా విచిత్రంగా ఉంటుంది. హీరోతో పాటు మిగతా క్యారెక్టర్లు కూడా చాలా కీలకంగా ఉంటాయి. సినిమా చాప్టర్లుగా ఉంటుంది. సినిమా బిజినెస్ పరంగా ఎలా ఉంది? -బిజినెస్ పరంగా చాలా హ్యాపీగా ఉన్నాం. ఇప్పటికే సీక్రెట్ స్క్రీనింగ్ వేశాం. అక్కడికి వచ్చిన వాళ్ల నుంచి వచ్చిన రెస్పాన్స్ మాకు మరింత కాన్ఫిడెన్స్ ఇచ్చింది. కచ్చితంగా ఈ సినిమా ఫిల్మ్ మేకర్స్‌కు ఇన్‌స్పిరేషన్‌గా ఉంటుంది. -మాటలతో ఆడియన్స్‌ను ఎంగేజ్ చేసే ఒక ప్రయోగం ఇందులో చేశాం. అది చాలా అద్భుతంగా వచ్చింది. 'పరేషాన్', '35' సినిమాల కథలు విన్నప్పుడే కచ్చితంగా ఆడియన్స్‌కు ఒక కొత్త ఎక్స్‌పీరియన్స్ ఇస్తాయని అనిపించింది. డార్క్ చాక్లెట్ కథ కూడా కొత్తగా అనిపించింది. మీ తాతగారు రాచకొండ విశ్వనాథ శాస్త్రి గారి రచనలు చదివారా? కొన్ని చదివాను. తాతగారు సాహిత్యం వైపు ఉండేవారు. నేను డాన్స్, మ్యూజిక్ వైపు ఎక్కువగా ఆసక్తి చూపించేవాడిని. మ్యూజిక్ డైరెక్టర్ శ్రీచరణ్ పాకాల, మేమందరం కలిసి ఒక మ్యూజిక్ ట్రూప్ ఉండేది. అందులో నేను వోకల్స్ , గిటార్ ప్లే చేసేవాడిని. బిందు మాధవి పెర్ఫార్మెన్స్ గురించి? బిందు ఈ సినిమాకు పర్ఫెక్ట్‌గా సెట్ అయింది. తన కెరీర్ బెస్ట్ పెర్ఫార్మెన్స్ ఇందులో ఇచ్చిందని సినిమా చూసిన వాళ్లందరూ చెబుతున్నారు. రానా గారి సపోర్ట్ ఎలా ఉంది? ఆయన ప్రొడక్షన్ పేరు స్పిరిట్ మీడియా. ఆయన ఎప్పుడూ కొత్త కంటెంట్‌ను, కొత్త టాలెంట్‌ను ఎంకరేజ్ చేస్తారు. పారేషన్ , 35 సపోర్ట్ చేశారు. ఇప్పుడు 'డార్క్ చాక్లెట్'కు కూడా మంచి రిలీజ్ ఇస్తున్నారు. మేము కలిసి మరింత మంచి కంటెంట్ ఇవ్వాలని ప్లాన్స్ కూడా ఉన్నాయి. రానా గారు చాలా ఇన్నోవేటివ్ పర్సన్. మీ నుంచి కొత్తగా రాబోతున్న సినిమాలు ఏమిటి? -ప్రస్తుతం నా దగ్గరకు మంచి కథలు వస్తున్నాయి. కొన్ని ఇంట్రెస్టింగ్ ప్రాజెక్ట్స్ చేశాను. నా నుంచి రాబోయే రోజుల్లో చాలా మంచి సినిమాలు చూడబోతున్నారు. అవన్నీ కూడా అందరూ గొప్పగా మాట్లాడుకునే సినిమాలే అవుతాయని నమ్ముతున్నాను. అలాగే మా ప్రొడక్షన్‌లో కూడా కొన్ని ప్రాజెక్ట్స్ నడుస్తున్నాయి.

డాన్ బాస్కో' చిత్రం పెద్ద హిట్ అవ్వాలి - డైరెక్టర్ వెంకీ అట్లూరి



రుష్య దత్తా హీరోగా పరిచయం అవుతున్న చిత్రం 'డాన్ బాస్కో'. రాధా కృష్ణ ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్స్‌పై వెంకట్ ఉప్పుటూరి నిర్మాణంలో గౌరీ శంకర్ ఈ సినిమాను తెరకెక్కిస్తున్నారు. ఈ చిత్రంలో రాజ్‌కుమార్ కసిరెడ్డి, మిర్నా మీనన్, మౌనిక, మురళీ శర్మ, ప్రిన్సిపాల్ విశ్వనాథ్, రాజ్‌కుమార్ కసిరెడ్డి, విష్ణు ఓఐ, ఉత్తేజ్, వినయ్ నల్లకడి, మోహన శ్రీ సురాగా తదితరులు కీలక పాత్రలు పోషించారు. మూవీ ప్రమోషన్స్‌లో భాగంగా బుధవారం నాడు టీజర్‌ను లాంచ్ చేశారు. ఈ మేరకు నిర్వహించిన టీజర్ లాంచ్ ఈవెంట్‌కి సక్సెస్ ఫుల్ డైరెక్టర్ వెంకీ అట్లూరి ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ కార్యక్రమంలో.. వెంకీ అట్లూరి మాట్లాడుతూ* .. ''డాన్ బాస్కో' టీజర్ బాగుంది. ఎంతో వినోదాత్మకంగా సాగింది. శంకర్ గారు చక్కగా హ్యాండిల్ చేశారు. శ్రీచరణ్ బీజీఎం బాగుంది. మిర్నా ప్రతీ పాత్రకు ప్రాణం పోస్తుంటారు. రుష్య నాకు ఫ్యామిలీ మెంబర్. వెంకట్ గారు ఏ సినిమా డిస్ట్రిబ్యూట్ చేసినా సక్సెస్ అవుతుంది. ఈ మూవీతో ఆయనకు మంచి విజయం దక్కాలని కోరుకుంటున్నాను. నేను సొంతంగా సినిమా నిర్మిస్తే ఎంత పెద్ద హిట్ అవ్వాలని కోరుకుంటానో ఈ చిత్రం కూడా అంత పెద్ద హిట్ అవ్వాలని కోరుకుంటున్నాను' అని అన్నారు. హీరో రుష్య దత్తా మాట్లాడుతూ* .. ''మ్యాడ్' డైరెక్టర్ కళ్యాణ్ శంకర్ వల్లే నాకు మా దర్శకుడు గౌరీ శంకర్ పరిచయం అయ్యారు. నిర్మాత వెంకట్ గారు మమ్మల్ని ఎంతో సపోర్ట్ చేశారు. శ్రీచరణ్ గారు మంచి మ్యూజిక్ ఇచ్చారు. రాజు గారు అద్భుతమైన విజువల్స్ ఇచ్చారు. ఎడిటర్ వంశీ గారికి థాంక్స్. చినబాబు గారు నాకు ఎప్పుడూ అండగా ఉంటారు. మా బావ వంశీ గారికి థాంక్స్. మా అక్క, బావలే నాకు అమ్మనాన్నాలు. మిర్నా నా మొదటి హీరోయిన్. ఆమెతో వర్క్ చేయడం సంతోషంగా ఉంది. మా కోసం వచ్చిన వెంకీ అట్లూరి గారికి థాంక్స్. ఆయన బంగారు బాతులాంటి వారు. ఆయన చేతుల మీదుగా లాంచ్ అవుతుండటం ఆనందంగా ఉంది' అని అన్నారు. నిర్మాత వెంకట్ ఉప్పుటూరి మాట్లాడుతూ* .. ''డాన్ బాస్కో' ఈవెంట్‌కి వచ్చిన ప్రతీ ఒక్కరికీ థాంక్స్. మా టీజర్ అందరికీ నచ్చిందని భావిస్తున్నాం. త్వరలోనే మరిన్ని ప్రమోషనల్ కంటెంట్‌తో ఆడియెన్స్‌ని ఆకట్టుకుంటాం' అని అన్నారు. హీరోయిన్ మిర్నా మాట్లాడుతూ* .. ''డాన్ బాస్కో'లో అవకాశం ఇచ్చిన దర్శక, నిర్మాతలకు థాంక్స్. మూడేళ్లుగా నాకు దర్శకుడు శంకర్ గారు తెలుసు. ఆయన ఎంతో అద్భుతంగా నరేషన్ ఇచ్చారు. ఈ మూవీ కోసం ఆయనెంతో కష్టపడ్డారు. ఇంత వరకు నేను ఇంటెన్స్ పాత్రల్ని పోషించాను. ఇలాంటి రోమ్ కామ్ పాత్రను చేయడం ఆనందంగా ఉంది. రుష్యతో వర్క్ చేయడం ఆనందంగా ఉంది. ఈ జర్నీలో మేం స్కూల్ ఫ్రెండ్స్‌లా మారిపోయాం. ఈ మూ కోసం రుష్య ప్రాణం పెట్టేశాడు. శ్రీ చరణ్ గారు మంచి మ్యూజిక్ ఇచ్చారు. నాకు ఈ జర్నీలో సపోర్ట్ చేసిన టీంకు థాంక్స్' అని అన్నారు. డైరెక్టర్ గౌరీ శంకర్ మాట్లాడుతూ* .. ''డాన్ బాస్కో' టీజర్ అందరికీ నచ్చే ఉంటుందని భావిస్తున్నాను. ట్రైలర్ ఇంత కంటే ఎమోషనల్‌గా ఉంటుంది. మా సినిమా గురించి మేం మాట్లాడే కంటే మా కంటెంట్ మాట్లాడితే బాగుంటుంది' అని అన్నారు. మ్యూజిక్ డైరెక్టర్ శ్రీ చరణ్ పాకాల మాట్లాడుతూ* .. ''డాన్ బాస్కో' చిత్రంలో ఫ్రెండ్ షిప్ గురించి అందంగా చూపించారు. ఇందులో మంచి ఎమోషన్ ఉంటుంది. రుష్య దత్తాకి ఇది తొలి చిత్రం. అతని జర్నీలో నేను పార్ట్ అయినందుకు ఆనందంగా ఉంది' అని అన్నారు. నటీనటులు: రుష్య దత్తా, రాజ్‌కుమార్ కసిరెడ్డి, మిర్నా (మిర్నా మీనన్), మౌనిక, మురళీ శర్మ, ప్రిన్సిపాల్ విశ్వనాథ్, రాజ్‌కుమార్ కసిరెడ్డి, విష్ణు ఓఐ, ఉత్తేజ్, వినయ్ నల్లకడి, మోహన శ్రీ సురాగా తదితరులు

'DNK' 'లిటిల్ హార్ట్స్' సినిమా కంటే పెద్ద విజయం సాధించాలి - హీరో శ్రీవిష్ణు



పాన్ ఇండియా నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ భారీ బడ్జెట్ సినిమాలతో పాటు కంటెంట్ ఉన్న చిత్రాలను కూడా ప్రోత్సహిస్తోంది. ఈ బ్యానర్‌పై రూపొందుతున్న క్రైమ్ కామెడీ ఎంటర్‌టైనర్ 'DNK'. మౌళి తనూజ్ ప్రశాంత్ హీరోగా నటిస్తున్న ఈ సినిమాతో శ్రీను కంబాల దర్శకుడిగా పరిచయమవుతున్నారు. ఇప్పటికే ప్రమోషనల్ కంటెంట్ మంచి బజ్ క్రియేట్ చేసింది. నవంబర్ 13న ఈ సినిమా థియేటర్లలో విడుదల కానుంది. ఈ సందర్భంగా గ్రాండ్ గా ప్రీరిలీజ్ ఈవెంట్ నిర్వహించారు. కింగ్ ఆఫ్ ఎంటర్‌టైన్‌మెంట్ శ్రీవిష్ణు ఈ వేడుకలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కింగ్ ఆఫ్ ఎంటర్‌టైన్‌మెంట్ శ్రీ విష్ణు మాట్లాడుతూ.. అందరికీ నమస్కారం. అలీ గారు ఇలాంటి మంచి పాత్రల్లో కనిపించడం చాలా హ్యాపీగా అనిపించింది. చాలా యంగ్ టీమ్ కలిసి చేసిన సినిమా 'DNK'. మౌళి చాలా నీట్‌గా ప్లాన్ చేసుకుని ఈ సినిమా చేశాడు. తనకు అన్ని క్రాఫ్ట్స్‌పై మంచి అవగాహన ఉందని ఈ మధ్యే తెలిసింది. మౌళిది మా జిమ్మే. జిమ్‌లో ఉన్న ప్రతి మెషీన్‌ను టచ్ చేస్తాడు. (నవ్వుతూ) 'లిటిల్ హార్ట్స్' సినిమా చూసిన తర్వాత నవ్వుతూనే ఉన్నాను. 'DNK' కూడా చాలా మంచి విజయం సాధించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను. మైత్రి మూవీ మేకర్స్ రవి గారు, నవీన్ గారు ఈ సినిమా చేయడం చాలా ఆనందంగా ఉంది. అనిల్ గారు ఈ ప్రాజెక్ట్ గురించి మాకు ఎప్పుడూ చెబుతూ ఉండేవారు. ఈ సినిమా చాలా పెద్ద హిట్ అయి మూటలు మూటలుగా డబ్బులు రావాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను. అది కచ్చితంగా జరుగుతుంది. సినిమా నవంబర్ 13న విడుదలవుతోంది. పెద్దలు అందరూ చూడండి. 14న పిల్లలందరినీ తీసుకెళ్లండి. ఫ్యామిలీతో కలిసి ఈ సినిమాను చూడండి. పెద్ద హిట్ చేయండి. థాంక్యూ వెరీ మచ్. హీరో మౌళి మాట్లాడుతూ.. అందరికీ నమస్కారం. బుచ్చిబాబు గారికి, వివేక్ ఆత్రేయ గారికి, శ్రీ విష్ణు గారికి, ఎస్‌కేఎన్ గారికి పేరుపేరునా ధన్యవాదాలు. మైత్రీ మూవీ మేకర్స్ అనిల్ గారు, చెర్రీ గారు మాకు చాలా సపోర్ట్ చేశారు. ఎంత పెద్ద పెద్ద సినిమాలు చేస్తున్నప్పటికీ, నేను ఎప్పుడు కాల్ చేసినా వెంటనే రెస్పాండ్ అవుతారు. వాళ్లకు చిన్న సినిమా, పెద్ద సినిమా అనే తేడా ఉండదు. ఎంతో ఆప్యాయంగా ఉంటారు. అది నాకు చాలా ఆనందాన్ని ఇచ్చింది. వాళ్ల దగ్గర నుంచి చాలా విషయాలు నేర్చుకున్నాను. ఈ ఎక్స్‌పీరియన్స్ నాకు ఎప్పటికీ గుర్తుంటుంది. డైరెక్టర్ గారు చాలా ఎంటర్‌టైనింగ్ స్క్రిప్ట్ తీసుకొచ్చారు. కచ్చితంగా ప్రేక్షకులకు కూడా ఈ సినిమా చాలా ఎంటర్‌టైనింగ్‌గా అనిపిస్తుంది. అందరూ ఎంజాయ్ చేస్తారని నమ్మకం ఉంది. సినిమా చాలా అద్భుతంగా వచ్చింది. నవంబర్ 13న అందరూ థియేటర్లకు వచ్చి సినిమాను ఎంజాయ్ చేయాలని కోరుకుంటున్నాను. అలీ గారు, రజిత గారు, ప్రియ గారు ఎంతో సీనియర్స్ అయినప్పటికీ మాకు ఎంతగానో సహకరించారు. అలాగే హీరోయిన్ సుస్మితకు కూడా ధన్యవాదాలు. మా టీమ్‌లోని ప్రతి ఒక్కరికీ పేరుపేరునా కృతజ్ఞతలు. డీవోపీ సూర్య ఈ సినిమాకు మరో సపోర్ట్‌గా నిలిచారు. సింజిత్ కూడా చాలా మంచి మ్యూజిక్ ఇచ్చారు. ప్రతి ఒక్కరూ తమ సినిమాలాగే భావించి పనిచేశారు. తప్పకుండా ఈ సినిమాను అందరూ ఎంజాయ్ చేస్తారని కోరుకుంటున్నాను. డైరెక్టర్ శ్రీను కంబాల మాట్లాడుతూ.. మైత్రి మూవీ మేకర్స్‌లో నా తొలి సినిమా చేయడం చాలా గర్వంగా ఉంది. మౌళి ఈ కథ చెప్పిన తర్వాత నా జీవితమే మారిపోయింది. మా డీఓపీ, ఇతర టెక్నీషియన్లు అందరూ బెస్ట్ క్వాలిటీ ఇచ్చారు. ఈ వేడుకకు వచ్చిన బుచ్చిబాబు గారికి, శ్రీ విష్ణు గారికి పేరుపేరునా ధన్యవాదాలు. మా టీమ్ అందరికీ థాంక్యూ. ఈ సినిమాలో అలీ గారు, రజిత గారు, ప్రియ గారు వంటి చాలామంది సీనియర్ నటులతో కలిసి పనిచేసే అవకాశం దొరికింది. వారందరూ నన్ను ఎంతగానో ప్రోత్సహించారు. ఈ రోజు కోసం చాలా కాలంగా ఎదురుచూశాను. ప్యాషన్‌తో ఇక్కడి వరకు వచ్చాను. నవంబర్ 13న నా మూమెంట్ రాబోతోంది. సినిమా అవుట్‌పుట్ చాలా అద్భుతంగా వచ్చింది. సినిమాపై నాకు చాలా నమ్మకం ఉంది. ఒళ్లు దగ్గర పెట్టుకుని ఈ సినిమా తీశాను. సినిమా చూడకపోతే మౌళి మీద ఒట్టు(నవ్వుతూ). డైరెక్టర్ బుచ్చిబాబు సానా మాట్లాడుతూ.. అందరికీ నమస్కారం. ఇందులో నటించిన జయకృష్ణ 'ఉప్పెన' సినిమాలో నటించాడు. ఆ తర్వాత 'లిటిల్ హార్ట్స్'తో మంచి బ్రేక్ వచ్చింది. అలాగే అలీ గారు, రజిత గారు సహా చాలామంది సీనియర్ ఆర్టిస్టులు ఈ సినిమాలో నటించారు. ఉప్పెన హిట్ అయితేనే చిన్న సినిమాలు చేస్తానని రవి గారు చెబుతుండేవారు. చిన్న సినిమాలు

'ఇట్లు అర్జున' లాంటి క్యారెక్టర్‌తో పరిచయం కావడం ఆనందంగా ఉంది.: హీరో అనీష్

కింగ్ నాగార్జున సమర్పణలో తెరకెక్కుతున్న చిత్రం 'ఇట్లు అర్జున'. అనీష్ హీరోగా పరిచయం అవుతుండగా, అనస్వర రాజన్ కథానాయికగా నటిస్తున్నారు. మహేష్ ఉప్పల ఈ సినిమాతో దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. దర్శకుడు వెంకీ కుడుముల ఈ సినిమాతో నిర్మాతగా కూడా పరిచయం అవుతున్నారు. ఆయన కొత్తగా ప్రారంభించిన వాట్ నెక్స్ట్ ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఇప్పటికే ప్రమోషనల్ కంటెంట్ సినిమాపై అంచనాలు పెంచింది. ఎస్ తమన్ అందించిన పాటలన్నీ చార్ట్ బస్టర్ అయ్యాయి. 'ఇట్లు అర్జున' నవంబర్ 13న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది. ఈ సందర్భంగా హీరో అనీష్ విలేకరులు సమావేశంలో సినిమా విశేషాలు పంచుకున్నారు. ఇట్లు అర్జున్ కథ విన్నప్పుడు మిమ్మల్ని ఆకట్టుకున్న అంశాలు ఏమిటి? ఈ కథతోనే మీ తొలి సినిమా చేయడానికి కారణమేంటి? -ఈ కథ విన్నప్పుడు నాకు బాగా నచ్చిన అంశం ఒక మూగవాడి ప్రేమకథ. తన భావాలను మాటల్లో వ్యక్తపరచలేని వ్యక్తి ప్రేమను ఎలా చూపిస్తాడనేది నాకు చాలా నచ్చింది. అలాగే కథ నడిచే విధానం, హీరో, హీరోయిన్ ప్రయాణం, యాక్షన్, ఎమోషన్ చాలా ఆర్గానిక్‌గా అనిపించాయి. ఇందులో చాలా ఆసక్తికరమైన సన్నివేశాలు ఉన్నాయి. అలాంటి సందర్భాలను ఒక మూగవాడు ఎలా ఎదుర్కొంటాడు, వాటిని ఎలా హ్యాండిల్ చేస్తాడు అనేది నాకు చాలా ఇంట్రెస్టింగ్‌గా అనిపించింది. ఈ పాత్ర కోసం ఎలాంటి హోమ్ వర్క్ చేశారు ? -ఈ సినిమా కోసం దాదాపు ఆరు నెలల పాటు వర్క్‌షాప్ చేశాం. బాడీ లాంగ్వేజ్, రియాక్షన్స్, ఎక్స్‌ప్రెషన్స్ .. విషయాలపై డైరెక్టర్ గారికి చాలా క్లారిటీ ఉంది. కొంత సైన్ లాంగ్వేజ్ కూడా ఉపయోగించాం. అయితే అది అందరికీ అర్థమయ్యేలా ఉంటుంది. ప్రతి సీన్‌ను ముందుగానే రిహార్సల్స్ చేసేవాళ్లం. దాంతో పాత్రలోకి వెళ్లడానికి చాలా ఉపయోగపడింది. ఎన్టీఆర్, రామ్ చరణ్ లాంటి పెద్ద స్టార్స్ మీకు సపోర్ట్ చేశారు. ఈ విషయంలో మీపై ఎంత బాధ్యత ఉందని భావిస్తున్నారు? -అంత పెద్ద స్టార్స్ వచ్చి మా సినిమా గురించి మాట్లాడటం ఇప్పటికీ నాకు ఒక కలలాగే అనిపిస్తోంది. అంత మంచి సపోర్ట్ లభించడం చాలా ఆనందంగా ఉంది. మేము ఎంచుకున్న కాన్సెప్ట్, మా కంటెంట్ నచ్చడం వల్లే ఈ స్థాయిలో సపోర్ట్ వచ్చిందని భావిస్తున్నాను. ఒక కొత్త నటుడికి ఇంత పెద్ద సపోర్ట్ లభించడం నిజంగా సంతోషంగా ఉంది. అదే సమయంలో ఇది నా మీద మరింత బాధ్యతను పెంచింది. సినిమా మీద మాకు చాలా నమ్మకం ఉంది. ఆడియన్స్ హ్యాపీగా థియేటర్‌లో ఎంజాయ్ చేసే సినిమా. కచ్చితంగా మంచి ఎక్స్‌పీరియన్స్ ఇస్తుంది. సినిమాలో యాక్షన్ ఎలా ఉండబోతోంది? -యాక్షన్‌ను ఇందులో చాలా కొత్తగా డీల్ చేశాం. ఇది ఒక అండర్‌డాగ్ క్యారెక్టర్‌కు తగ్గట్టుగానే యాక్షన్ సన్నివేశాలు ఉంటాయి. మాస్ కమర్షియల్ సినిమాల్లో ఉండే యాక్షన్‌లా కాకుండా ఆ పాత్ర స్వభావానికి అనుగుణంగా ఉంటుంది. యాక్షన్ లో సహజంగా వచ్చే సౌండ్స్ ను మ్యాచ్ చేయడానికి డబ్బింగ్ కూడా చెప్పాను. మాటలు లేకుండా కేవలం బాడీ కదలికలు, ఊమ్ ..హూ లాంటి ఎక్స్ ప్రెస్ ప్రెషన్ కు డబ్బింగ్ చెప్పడం కూడా చాలా కొత్త ఎక్స్ పీరియన్స్. తనది చాలా జెన్యూన్ క్యారెక్టర్. ఆ ఎమోషన్ ఆడియన్స్ ఫీల్ అవుతారు. మీకు నటనపై ఆసక్తి ఎప్పుడు ఏర్పడింది? ఎలాంటి శిక్షణ తీసుకున్నారు? -నాకు చిన్నప్పటి నుంచే నటనపై ఆసక్తి ఉండేది. వైజాగ్‌లో సత్యానంద్ గారి దగ్గర నటనలో శిక్షణ తీసుకున్నాను. అలాగే ఒక ఏడాది పాటు యూఎస్‌లో కూడా నేర్చుకున్నాను. మరికొన్ని చోట్ల కూడా నటనకు సంబంధించిన విషయాలు నేర్చుకున్నాను. తొలి సినిమా చేయడానికి ముందు దాదాపు ఏడాది పాటు కథలు విన్నారట కదా? అవును. తొలి సినిమా చేయడానికి ముందు దాదాపు ఏడాది పాటు కథలు విన్నాను. ఆ సమయంలో మహేష్ గారు ఈ కథ తీసుకొచ్చారు. నాకు చాలా నచ్చింది. కథ ఓకే చేసిన తర్వాత కూడా మరో ఏడాది పాటు వర్క్‌షాప్స్, ప్రీ-ప్రొడక్షన్ వర్క్ చేశాం. నటుడిగా నా ప్రయాణం ప్రారంభించాలనే ఆలోచన ఎప్పటి నుంచో ఉంది. లక్కీగా అందరికీ కనెక్ట్ అయ్యే మంచి ఎమోషన్ ఉన్న కథ దొరికింది. మూగవాడి పాత్ర చేయడంలో మీకు ఎదురైన సవాళ్లు ఏమిటి? -కొన్ని సన్నివేశాల్లో రియాక్ట్ అవ్వడం చాలా ఛాలెంజింగ్‌గా అనిపించింది. సాధారణంగా ఒక వ్యక్తి మాట్లాడుతున్నప్పుడు మనం డైలాగ్‌తో సమాధానం చెబుతాం. కానీ ఈ పాత్రలో మాట్లాడటానికి అవకాశం ఉండదు. ఎదుటివారు మాట్లాడుతున్నప్పుడు మన ఎక్స్‌ప్రెషన్స్‌తోనే స్పందించాలి. అది కొంచెం కష్టంగా అనిపించింది. అలాగే లిప్ సింక్ లేకుండా డ్యాన్స్ చేయడం కూడా ఛాలెంజింగ్‌గా అనిపించింది. మీ తొలి సినిమాతో రిలీజ్ డేట్ వాయిదా పడింది. ఆ సమయంలో ఒత్తిడికి గురయ్యారా? చిన్నప్పటి నుంచి నటుడు కావాలనేది నా కల. తొలి సినిమా రిలీజ్ డేట్ ప్రకటించిన తర్వాత అనుకున్న సమయానికి సినిమా విడుదల కాకపోవడంతో కొంత నిరాశ అనిపించింది. అయితే మేము మంచి సినిమా చేశామని నమ్మకం ఉంది. ఎప్పుడు విడుదలైనా ప్రేక్షకులు ఆదరిస్తారనే నమ్మకంతో మళ్లీ ఉత్సాహంగా పని చేశాం. మీ తొలి సినిమాతో తమన్ లాంటి స్టార్ మ్యూజిక్ డైరెక్టర్ పనిచేయడం ఎలా అనిపించింది? -ఈ సినిమాకు మ్యూజిక్ మెయిన్ హీరో. ముఖ్యంగా ఇది మూగవాడి కథ కావడంతో సంగీతానికి చాలా ప్రాధాన్యత ఉంటుంది. తమన్ గారు ఈ జర్నీలో నాకు ఒక బ్రదర్‌లా అయిపోయారు. ఆయన సినిమా కోసం ప్రాణం పెట్టి పనిచేశారు. పాటలకు అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది. బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ కూడా అందరినీ ఆకట్టుకుంటుంది. రామ్ చరణ్ , అఖిల్ కెరీర్‌లో ఒక దశ తర్వాతే ఇలాంటి సవాళ్ళతో కూడిన పాత్రలు చేశారని నాగార్జున గారు చెప్పారు కదా.. మీరు తొలి సినిమాతోనే మూగవాడి పాత్ర చేయడం ఎలా అనిపించింది? -అంత పెద్ద స్టార్స్‌తో నన్ను పోల్చుకోను. ఏదైనా కథ దొరికిన దాని ప్రకారమే ఉంటుందని భావిస్తున్నాను. నా తొలి సినిమాకే ఇలాంటి కథ దొరకడం నా అదృష్టంగా భావిస్తున్నాను. నాగార్జున గారు మా సినిమాను ప్రజెంట్ చేయడం మాకు మరింత బలాన్ని ఇచ్చింది. అదే సమయంలో బాధ్యతను కూడా పెంచింది. అందుకే మేము మరింత కష్టపడి పనిచేశాం. ప్రేక్షకులు కూడా సినిమాను గొప్పగా ఆదరిస్తారని నమ్ముతున్నాను. ఇందులో ఇతర పాత్రలు ఎలా ఉండబోతున్నాయి? బ్రహ్మాజీ గారు, వెన్నెల కిషోర్ గారు ఇలా మంచి నటులు ఇందులో కీలక పాత్రలు పోషించారు. ప్రతి పాత్రకు కథలో ఒక ప్రాధాన్యత ఉంటుంది. సినిమా చూస్తున్నప్పుడు ప్రేక్షకులు ప్రతి పాత్రను ఎంజాయ్ చేస్తారు. మీకు వెంకీ